అమ్మ
రూ॥ 350/-
పేజీలు: 400


ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★


'పాలమూరు – రంగారెడ్డి' చుట్టూ రాజకీయ చక్రం!

కేరళ 'స్థానిక' ఎన్నికల ఫలితాలు.. అమిత్ షాకు ఆశాభంగం 06


సంపుటి 09, సంచిక: 34 | బుధవారం | 31-12-2025 | ఖమ్మం | Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00




## అందుబాటులోనే యూరియా

● 2,14,561 మెట్రిక్ టన్నుల నిల్వలున్నాయి రైతులెవరూ ఆందోళన చెందొద్దు ● వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచన ● యూరియా పంపిణీకి ప్రత్యేక అధికారులను నియమించిన వ్యవసాయశాఖ

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో యూరియా అందుబాటులో ఉన్నదని వ్యవసాయ శాఖ స్పష్టం చేసింది. ప్రస్తుతం 2,14,561 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు (బ్యాగులు 47.68 లక్షల సంచులు) అందుబాటులో ఉన్నాయని, రైతులు ఎవ్వరూ ఆందోళన చెందవద్దని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు సూచించారు. యాసంగి సీజన్‌లో రాష్ట్రంలో యూరియా పంపిణీ నిమ్మితం వ్యవసాయ శాఖ ప్రత్యేక అధికారులను నియమించింది. అడిషనల్ డైరెక్టర్లు కె.విజయ్ కుమార్, బి.నర్సింహారావు, జెడిఎలు ఎస్.గీత, వి. ఆశా కుమారి, వై.సుచరిత, బి.బాలు, ఎం. శైలజ, డిడిఎలు ఎం.చంద్రశేఖర్, ఎం.కనుకరాజ్‌లకు వ్యవసాయ శాఖ డైరక్టర్ డాక్టర్ బి.గోపి బాధ్యతలను అప్పగించారు. ఒక్కొక్క తరువాయి 2లో

# పరిపాలనను పట్టాలెక్కించాలి

అందరూ కలిసి పనిచేస్తేనే జిహెచ్‌ఎంసి భవిష్యత్ బాగు



● కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ ఏరియా ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి ● గుడ్ గవర్నెన్స్ నుంచి స్మార్ట్ గవర్నెన్స్‌కు మారాలి ● రాష్ట్రంలో చెరువులు, నాళాలను ఆక్రమణల నుంచి కాపాడుకోవాలి ● క్యూర్ పరిధిలో డిజిటల్ బస్సులు, ఆటోల స్థానంలో ఇవి వెహికల్స్ ● హైదరాబాద్ నగరంలో చెత్త నిర్వహణ అత్యంత సంక్లిష్టం ● జోనల్ కమిషనర్లు ప్రతిరోజూ ఫీల్డులో ఉండాల్సిందే ● మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అర్బన్ డెవలప్‌మెంట్ అధికారులతో సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న కోర్ అర్బన్ రీజియన్ ఎకానమి ఏరియాను ప్రణాళికబద్ధంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని, వచ్చే ఐదేళ్లకు యాక్షన్ ప్లాన్ రూపొందించుకోవాలని సంబంధిత అధికారులను రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఆదేశించారు. పరిపాలనను పట్టాలెక్కించాలనేదే ప్రభుత్వ ఆలోచన అని, అందరూ కలిసి పనిచేస్తేనే నగరం భవిష్యత్ బాగుంటుందని, కోర్ అర్బన్ రీజియన్‌ను ప్రక్షాళన చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. గుడ్ గవర్నెన్స్ నుంచి స్మార్ట్ గవర్నెన్స్‌కు మారాలన్నారు. హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలమెంట్ విభాగం అధికారులతో సిఎం రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. సమావేశంలో సిఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సమీక్షలో కొత్త జోనల్ కమిషనర్లకు సిఎం రేవంత్ రెడ్డి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ రాష్ట్రాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసుకోవాలనే తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ ను విడుదల చేసుకున్నామని, క్యూర్( క్యూర్) పరిధిలోని సిటీని 12 జోన్లు, 60 సర్కిళ్లు, 300 వార్డులుగా పునర్వ్యవస్థీకరించామని అధికారులకు వివరించారు. రాష్ట్రంలోని చెరువులు, నాలాలను ఆక్రమణల నుంచి కాపాడుకోవాలని, హైడ్రా, జిహెచ్ఎంసి, వాటర్ వర్క్స్ విభాగాలు నాలాల పూడిక తీత పనులు జనవరి నుంచి మొదలు పెట్టాలన్నారు. ఆన్ లైన్ టెక్నాలజీని ఉపయోగించి ప్రజలకు పారదర్శక సేవలు అందించాలని, జనన మరణ ధ్రువీకరణ, ట్రేడ్ లైసెన్సులు, ఇతర ధ్రువ పత్రాల జారీకి టెక్నాలజీని ఉపయోగించుకోవాలన్నారు. ఎక్కడ సమస్య తలెత్తినా పరిష్కరించేందుకు టోల్ ఫ్రీ నంబర్‌కు వీలయినంత త్వరగా స్పందించాలన్నారు. క్యూర్ పరిధిలో డీజిల్ బస్సులు, ఆటోల స్థానంలో ఈవీ వెహికిల్స్‌ను తీసుకురానున్నట్లు తెలిపారు. క్యూర్ ఏరియాలో విభాగాల అధికారులను సమన్వయం చేసే బాధ్యత స్పెషల్ సిఎస్ చూసుకుంటారన్నారు. జోన్‌ల వారీగా సంబంధిత సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత జోనల్ కమిషనర్‌లదేనని, హైదరాబాద్ నగరంలో తరువాయి 2లో



పోలీసుల పనితీరులో దేశంలోనే

## రాష్ట్రం నెంబర్ 1

● ఈ ఏడాది నేరాల సంఖ్య తగ్గాయ్.. శిక్షలు పెరిగాయ్ ● పోగొట్టుకున్న సొమ్ము, సెల్‌ఫోన్ రికవరీలో తొలిస్థానంలో తెలంగాణ ● పోలీస్ శాఖ వార్షిక నివేదికను విడుదల చేసిన డిజిపి శివధర్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

ఇండియా జస్టిస్ రిపోర్ట్ నివేదిక ప్రకారం పోలీసు పనితీరులో దేశంలోనే తెలంగాణ మొదటి స్థానం ఆక్రమించిందని డిజిపి బి.శివధర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ ఏడాది రాష్ట్రంలో నేరాలు తగ్గించడంతో పాటు ఆయా కేసుల్లో నిందితులకు శిక్షలు పడడంలో తెలంగాణ పోలీసులు సత్తా చాటారని రాష్ట్ర డిజిపి తెలిపారు. అదే విధంగా సైబర్ నేరాల్లో పోగొట్టుకున్న సొమ్మును, అలాగే పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లు రికవరీ చేయడంలో దేశంలోనే తెలంగాణ పోలీసులు నెంబర్ వన్‌గా నిలవడం గర్వకాణమన్నారు. రాష్ట్ర పోలీసు శాఖ వార్షిక నివేదికను తన కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పోలీసు అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్, అదనపు డిజిపి మహేష్ భగవత్, మాజీ డిజిపి సందీప్ శాండిల్యా, ఐజిలు చంద్రశేఖర్‌రెడ్డి, చారుసిన్హా, సంజయ్‌కుమార్, ఎం.రమేష్, అనీల్‌కుమార్‌లతో కలిసి డిజిపి విడుదల చేశారు. ఈ సందర్భంగా డిజిపి శివధర్‌రెడ్డి మాట్లాడుతూ..2025లో నేరాలు 2.33 శాతం తగ్గాయన్నారు. 2024లో 2,34,158 నేరాలు నమోదు కాగా ఈ ఏడాది 2,258,695 నమోదయ్యాయన్నారు. ఇక ఆయా కేసుల్లో గత ఏడాది 35 శాతం మంది నిందితులకు శిక్షలు పడగా ఈ ఏడాది 38 శాతానికి పెరిగిందన్నారు.హత్యలు, అత్యాచారాలు, దోపిడీ కోసం హత్యలు, దోపిడీలు, చోరీలు, కిడ్నాప్‌లు, వరకట్న మరణాలు, రోడ్డు ప్రమాద క్షతగాత్రుల సంఖ్య, చీటింగ్ కేసులు తగ్గాయన్నారు. నమ్మక ద్రోహం కేసులు మాత్రం పెరిగాయని డిజిపి స్పష్టం చేశారు. ఈ ఏడాది సర్పంచ్ ఎన్నికలు జరిగినా కొట్లాటలు, దొమ్మి కేసులు 42 శాతం తగ్గడం తెలంగాణ పోలీసులకు గర్వకారణమన్నారు. గత ఏడాది 324 కేసులు నమోదు కాగా ఈ ఏడాది 186 మాత్రమే నమోదయ్యాయన్నారు. డ్రగ్స్‌పై ఈగల్ టీం పనితీరు మెరుగ్గా ఉందని, ఈ ఏడాది రికార్డు స్థాయిలో రూ.94.39 కోట్ల డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారన్నారు. సైబర్ క్రైమ్ నేరాల్లో మోసపోయిన బాధితులకు సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు రూ.246 కోట్లు రికవరీ చేసి అప్పగించడం జరిగిందన్నారు. తద్వారా తరువాయి 2లో

## లోయలో పడిన బస్సు



ఏడుగురు దుర్మరణం

12 మందికి గాయాలు

ఉత్తరాఖండ్ అల్మోరా జిల్లాలో ఘటన

డెహ్రాడూన్ : ఉత్తరాఖండ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. అల్మోరా జిల్లాలో బస్సు లోయలో పడిపడింది. ఈ ఘటనలో ఏడుగురు మరణించగా, సుమారు 12 మంది గాయపడ్డారని పోలీసులు తెలిపారు. అల్మోరాలోని ద్వారహాట్ నుండి నైనిటాల్‌లోని రామ్‌నగర్‌కు వెళ్తున్న బస్సు భికియాసైన్ ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగిందని సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఎస్ఎస్‌పి) దేవేంద్ర పించా తెలిపారు. ఎస్ఎస్‌పి ప్రకారం ప్రమాద సమయంలో బస్సులో 18 నుండి 19 మంది ప్రయాణికులు ఉన్నారు. డ్రైవర్ వాహనంపై నియంత్రణ కోల్పోవడంతో అది భికియాసైన్‌కు ఆరు కిలోమీటర్ల తరువాయి 12లో

లేబర్ కోడ్‌ల అమలును వ్యతిరేకిస్తూ

## అసెంబ్లీలో తీర్మానం చేయాలి

● 12 అంశాలపై సభలో చర్చించాలని స్పీకర్‌ను కోరిన సిపిఐ శాసనసభాపక్ష నేత కూనంనేని సాంబశివరావు



ప్రజాపక్షం/హైదరాబాద్

కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్ల అమలు నోటిఫికేషన్, ఎల్ఐసిలో వంద శాతం ఎఫ్‌డిఐలకు కేంద్రం తీసుకున్న నిర్ణయాలను వ్యతిరేకిస్తూ, మహాత్మా గాంధీ నరేగా పునరుద్ధరణ, రాష్ట్రాలపై భారాలు మోపే 'విబి–జి రామ్ జి' చట్టాన్ని కేంద్రం ఉపసంహరించుకోవాలని శాసనసభలో తీర్మానం చేయాలని సిపిఐ శాసనసభాక్షనేత, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేనిసాంబశివరావు స్పీకర్‌ను కోరారు. ప్రస్తుత శీతాకాల తరువాయి 2లో

శాసనసభ, మండలిలో బిఆర్ఎస్

## డిప్యూటీ ఫ్లోర్ లీడర్ల నియామకం


ప్రజాపక్షం/హైదరాబాద్

శాసన సభలో బిఆర్ఎస్ శాసనసభాపక్ష ఉప నాయకులుగా (డిప్యూటీ ఫ్లోర్ లీడర్లు) తన్నీరు హరీశ్ రావు, పటోల్ల సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను నియమించారు. అలాగే శాసన మండలిలో బిఆర్ఎస్ శాసనమండలి పక్ష ఉప నేతలు (డిప్యూటీ ఫ్లోర్ లీడర్లు) ఎల్.రమణ, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, విప్‌గా దేశపతి శ్రీనివాస్‌ను నియమిస్తూ బిఆర్ఎస్ అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు మంగళవారం ప్రకటన విడుదల చేశారు.

హైదరాబాద్ – విజయవాడ మార్గాల్లో

## టోల్ ఫ్రీ చేయండి

కేంద్ర మంత్రి గడ్కరీకి మంత్రి కోమటిరెడ్డి లేఖ



ప్రజాపక్షం/హైదరాబాద్

సంక్రాంతి పండుగ నేపథ్యంలో హైదరాబాద్ విజయవాడ మార్గాల్లో విపరీతమైన వాహనాల రద్దీ ఉంటుందని..దీన్ని అధిగమించేందుకు వాహనాలకు టోల్ ఫ్రీ చేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కేంద్ర మంత్రి గడ్కరీకి మంగళవారం లేఖ రాశారు. తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో సంక్రాంతి అతిపెద్ద పండుగ అని, ఈ సందర్భంగా హైదరాబాద్ నుండి విజయవాడ మార్గంలో తరువాయి 12లో

'మహా' మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు

## అధికార బిజెపి–శివసేన కూటమి మైత్రికి బీటలు

బెంగాల్‌లో బంగ్లాదేశీయుల

## చొరబాటును ప్రోత్సహిస్తున్న మమత

కేంద్ర హోంశాఖమంత్రి అమిత్ షా ఆరోపణ

## బెంగాల్‌కు దుశ్శాసనుడు వచ్చారు!

అమిత్ షా పర్యటనపై మమతా బెనర్జీ ఫైర్ 05

54 లక్షల ఎకరాలకు

# సాగునీరందించండి

రెండేళ్ల వ్యవధిలో భారీ ప్రాజెక్టులు పూర్తిచేయండి



ఐటిసి ఎత్తిపోతలను బోరు బావులను పునరుద్ధరించండి

తాగు, సాగునీటి ప్రాజెక్టులపై రౌండ్‌టేబుల్ సమావేశంలో పలువురు వక్తలు డిమాండ్

ప్రజాపక్షం/హైదరాబాద్

తాగు, సాగు నీటి ప్రాజెక్ట్‌లను భారీ, మధ్యతరహా, మైనర్ ప్రాజెక్ట్‌లను పూర్తి చేసి 54 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని, రెండు సంవత్సరాల కాల వ్యవధిలో భారీ ప్రాజెక్ట్‌లను పూర్తి చేయాలని, ఐటిసి ఎత్తిపోతలను బోరు బావులను పునరుద్ధరించాలని పలువురు తెలిపారు. సిపిఐ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో 'తాగు, సాగు నీటి ప్రాజెక్టుల'పైన తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్యపద్మ అధ్యక్షతన హైదరాబాద్‌లోని మఖ్దూం భవన్‌లోని రాజ బహదూర్ గౌర్ హాల్‌లో మంగళవారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిధులుగా రిటైర్డ్ ఇంజనీర్ కె.విఠల్ రావు, ఎఐకెఎస్ జాతీయ ఉపాధ్యక్షులు సారంపల్లి మల్లారెడ్డి, సాగునీటి విశ్లేషకులు సాంబశివ రావు, ఎస్‌కెఎం రాష్ట్ర కన్వీనర్లు బిక్షపతి, జక్కుల వెంకటయ్య, పట్లోళ్ల నాగిరెడ్డి, విజయ్ ప్రసంగించగా, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, కౌలు రైతుల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పోజు సూర్యనారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రభలింగం, తరువాయి 2లో

మే 4 నుంచి

## టిజి ఇఎపి సెట్

9న ఇంజనీరింగ్ ప్రవేశపరీక్షలు

ఉన్నత విద్య ప్రవేశాలకు కామన్ ఎంట్రెన్స్ పరీక్షల తేదీలు ఖరారు..

ప్రజాపక్షం/హైదరాబాద్

రానున్న విద్యా సంవత్సరానికి గాను ఉన్నత విద్య ప్రవేశాలకు సంబంధించి నిర్వహించనున్న వివిధ కామన్ ఎంట్రెన్స్ పరీక్షల తేదీలను తెలంగాణ ఉన్నత విద్యా మండలి ఖరారు చేసింది. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. జెఎన్‌టియుహెచ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న టిజి ఇఎపిసెట్ (బిఇ, బిటెక్, బి ఫార్మసీ, ఫార్మాడి తది కోర్సులకు సంబంధించి ( అగ్రికల్చర్, ఫార్మా ) 2026 మే 4, 5, తేదీలు, ఇంజనీరింగ్‌కు సంబంధించి తరువాయి 2లో

బంగ్లాదేశ్ తొలి మహిళా ప్రధాని

## ఖలీదాజియా కన్నుమూత




అంత్యక్రియలకు భారత్ తరపున హాజరుకానున్న విదేశాంగ శాఖ మంత్రి జయశంకర్

**ఢాకా:** అనేక వ్యాధులబారినపడి దీర్ఘకాలంగా ఆరోగ్యం కోసం పోరాటం చేస్తున్న బంగ్లాదేశ్ తొలి మహిళా ప్రధాన మంత్రి ఖలీదాజియా కన్నుమూశారు. ఆమె వయసు 80 సంవత్సరాలు. మెరుగైన చికిత్సకోసం లండన్‌కు ఆమెను తరలించే ప్రయత్నం చేసినాగానీ సాధ్యం కాకపోవడంతో ఢాకాలోని ఎవర్ కేర్ ఆసుపత్రిలోనే నెలరోజులుగా ఆమె శ్వాసకోశ సంబంధమైన చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం ఆరు గంటలకు తుదిశ్వాస విడిచారు. ఆమె కుమారుడు, బిఎన్‌పి నాయకుడు తరువాయి 12లో

వెనిజులా ఓడరేవుపై

## సిఐఎ దాడులు!

మదురోను పదవీచ్యుతుణ్ణి చేసే పనిలో ట్రంప్




**వాషింగ్టన్:** వెనిజులా మాదక ద్రవ్యాల పడవలతో సంబంధం ఉన్న ఒక ''డాక్ ఏరియా' (అతిపెద్ద డ్రగ్స్ ఎగుమతి రేవు కేంద్రం) పై భారీ దాడులు చేసినట్లు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చెప్పారు. ఈ దాడి వెనిజులా భూభాగంలో జరిగిందా? అనే విషయం ట్రంప్ చెప్పకపోయినప్పటికీ, ఇప్పటివరకూ కరీబియన్, తూర్పు పసిఫిక్ జలాల్లో మోహరించి అంతర్జాతీయ జల్లాల్లో వెనిజులా పడవలపై దాడులు చేస్తున్న అమెరికా సైన్యం, ఇప్పుడు వెనిజులా భూతలంపై మొదటిసారి దాడి ప్రారంభించిందని తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## యెమెన్ రేవుపై సౌదీ అరేబియా బాంబు దాడులు

**దుబాయ్ :** యెమెన్ రేవుప్రాంత నగరం ముకల్లాపై సౌదీ అరేబియా మంగళవారం బాంబు దాడులు చేసింది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ నుండి వచ్చిన వేర్పాటువాద శక్తికి ఆయుధాలను తరలించడం కోసం యెమెన్ ప్రయత్నం చేసిందని సౌదీ అరేబియా పేర్కొంది. ఇటీవల వేర్పాటువాదులు యెవెన్‌కు వెళ్ళారని, వీరికి యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌తో సంబంధం ఉందని పేర్కొంది. యుఎఇ చర్చలు చాలా ప్రమాదకరమైనవని హెచ్చరించింది. ఐతే ఈ దాడుల విషయాన్ని యుఎఇ వెంటనే ధృవీకరించలేదు. ఈ దాడులతో ఈ ప్రాంతంలో సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ మధ్య కొత్త ఉద్రిక్తతలకు దారితీసింది. యుఎఇ తూర్పు తీరం ఫుజైరా నుండి యెమెన్‌కు ఈ ఆయుధాలతో నౌక వచ్చిందని సౌదీ ప్రభుత్వం చెబుతున్నది. ఇరాన్ మద్దతుగల హౌతీ ఉగ్రవాదులతో దశాబ్దకాలంగా జరుగుతున్న యుద్ధంలో ఈ రెండు దేశాలూ చెరోపక్షాన్ని సమర్థిస్తున్నాయి.

# ఆందోళన కలిగించిన 'యుద్ధాల' సంవత్సరం–2025

* వాణిజ్యమే కేంద్ర బిందువుగా రాజకీయాలు

**వాషింగ్టన్ :** ఆందోళన కలిగించిన, చరిత్రలో నిలిచి పోయే యుద్ధాల సంవత్సరంగా 2025 రాజకీయాలను అభివర్ణించారు ఒక ప్రపంచ సీనియర్ జర్నలిస్టు. ''ఒక జర్నలిస్టుగా నా కెరీర్‌లో 40 యుద్ధాల గురించి వార్తా కథనాలు రాశాను. కానీ 2025 సంవత్సరం అంతటి ఆందోళనకరమైన యుద్ధనామ సంవత్సరాన్ని చూడ లేదు'' అని బ్రిటిష్ బ్రాడ్ కాస్టింగ్ కార్పొరేషన్ (బిబిసి) జర్నలిస్టు జాన్ సింప్సన్ తన సంవత్సరాంతపు ప్రపంచ నివేదికలో స్పష్టం చేశారు.
అనేక యుద్ధాలు చూశా, అవన్నీ తారాస్థాయికి చేరుకున్నాయి. ఆ తర్వాత ఆవిరైపోయాయి, కానీ 2025లో అనేకచోట్ల బహుశా ప్రాదేశిక సమస్యలవల్ల యుద్ధాలు చెలరేగాయి, ఇంతటి ఆందోళనకరమైన సంవత్సరాన్ని ఇంతవరకూ నేను చూడలేదు. ఈ యుద్ధాల్లో చాలా భౌగోళిక రాజకీయ చిక్కులు కనిపిస్తున్నాయి. జెలెన్స్కీ తాజాగా ఉక్రేన్‌లో యుద్ధం ప్రపంచ యుద్ధంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయని హెచ్చరించారు, 60 సంవత్సరాలుగా ప్రపంచంలో యుద్ధాలను గమనిస్తున్నా, ఆయన చెప్పిన మాటలు నిజమవుతాయని నాకు అనిపిస్తోంది'' అని జాన్ సింప్సన్ ఆందోళన వ్యక్తం చేశారు. యుద్ధాలు, ప్రజాపోరాటాలు, ప్రజాందోళనలు, అవినీతిపై ప్రజా ప్రతిఘటనతోపాటు ప్రకృతి వైపరీత్యాల వల్ల వేలకోట్ల డాలర్ల ఆర్థిక నష్టాన్ని ప్రపంచదేశాలు చవిచూశాయి. ఇప్పటికీ కూడా కాప్–2025 సదస్సు గతంకంటే హీనంగా ఒక నామమాత్రపు చర్చావేదికగా మారిపోయింది. ఆయన విశ్లేషణకు అందనంగా ఇంకా అనేక అంశాలున్నాయి.

ఉక్రేన్‌లో మూడేళ్ళుగా యుద్ధం జరిగినప్పటికీ 2025లో మాత్రం నాటో కూటమి, యూరోపియన్ యూనియన్ రష్యాతో తలపడేందుకు ప్రత్యక్షంగా తెర మీదకు వచ్చింది. సైన్యాన్ని, ఆయుధాలను పెంచుకోవాలని యూరప్ దేశాలు నిర్ణయించుకున్నాయి. ఉక్రేన్‌కు అండగా ఉండాలని, రష్యాను ఓడించాలని కంకణం కట్టుకున్నాయి. తాము దాదాపు యుద్ధంలో ఉన్నామని యూరోపియన్ యూనియన్ దేశాలు భావిస్తున్నాయి. పుతిన్ మాత్రం యూరప్‌పై తాము మొదట యుద్ధం చేయబోమని ప్రకటించారు. వారికి యుద్ధం కావాలంటే అది అత్యంత వినాశకరంగా ఉంటుందని కూడా ఆయన కొద్ది గంటల క్రితమే పెద్ద హెచ్చరిక చేశారు. ఒకవైపు యుద్ధ ప్రయత్నాలు జరుగుతుంటే, మరోవైపు కంటి తుడపు శాంతి యత్నాలు జరుగుతున్నాయి.
పుతిన్ చెప్పినట్టే తెలిసో తెలియకో యూరప్ దేశాలు యుద్ధాన్ని రెచ్చగొట్టే పనే చేస్తున్నాయి. మరో వైపు ట్రంప్ అమెరికా ఆధిపత్య నిరూపణకు సొంత దుకాణం తెరిచారు. క్వాలిటీ పీపుల్ మాత్రమే అమెరికాలో ఉండాలనే నినాదంతో నేరాలు అరికట్టే పేరుతో వలస ప్రజలను తరిమికొట్టడంలో పాక్షిక విజయం సాధించారు.




నాలుగు సంవత్సరాలుగా (2022 ఫిబ్రవరి 24) ఉక్రేన్‌లో యుద్ధం జరుగుతోంది, ఈ యుద్ధంలో 14000 మంది మరణించారని ఐక్యరాజ్యసమితి ప్రకటించింది. దాదాపు రెండు సంవత్సరాలు పశ్చిమ ఆసియాలో యుద్ధం జరిగింది, ఇప్పటికీ ఆ యుద్ధం తాలూకూ ఉల్లంఘనలు జరుగుతూనే ఉన్నాయి, ఈ యుద్ధంలో 74000 మంది మరణించారు. మరో 1.50 లక్షలమంది తీవ్రంగా గాయపడ్డారు. మరో 10,000 మంది జాడతెలియకుండా పోయారు. వారంతా శిథిలాల్లో చిక్కుకుని ఉన్నారు.
మధ్య ఐదురోజులుపాటు స్వల్పయుద్ధం జరిగింది. థాయ్‌లాండ్–కాంబోడియా మధ్య గడచిన ఆరునెలల్లో మూడుసార్లు యుద్ధం చెలరేగింది. ఇప్పుడు తాజాగా మళ్ళీ శాంతి ఒప్పందం కుదిరింది. ఆ తాలూకూ సమస్యలు ఇక చల్లారిపోతాయన్న నమ్మకం లేదు. సూడాన్‌లో మూడు సంవత్సరాలుగా అంతర్యుద్ధం కొనసాగుతూనే ఉంది. ఇప్పటివరకూ 1,50,000 మంది ప్రజలు మరణించారు. 1.20 కోట్ల మంది ప్రజలు బలవంతంగా ఇళ్ళు వదలి వెళ్ళిపోయారు, నిరాశ్రయులయ్యారు. సరిహద్దు దేశాలైన రువాండా–కాంగో మధ్య ఘర్షణలు కొనసాగుతూనే ఉన్నాయి. రువాండా ప్రభుత్వం మద్దతుతో ఎం–23 ఉగ్రవాదులు కాంగో ప్రాంతాన్ని ఆక్రమించేందుకు దీర్ఘకాలంగా ప్రయత్నాలు కొనసాగుతూనే ఉన్నాయి. వేలాది మంది ఈ ప్రాంతంలో మరణించారు. ఈ వార్తలు సరిగ్గా ప్రపంచానికి తెలియడంలేదు. మరో వైపు వెనిజులాపై అగ్ర రాజ్యం అమెరికా భీకర పోరాటానికి తెరతీసింది. ప్రత్యక్షంగా కయ్యానికి కాలు దువ్వుతోంది. కరీబియన్ జలాల్లో వేలాది మంది నావికాదళాన్ని, విమాన వాహక నౌకలను మోహరించింది. వెనిజులా అధ్యక్షుడు నికొలస్ మదురోను అదనుచూసి అధికారం నుండి దింపేసి ఆ దేశ వనరులను ఆక్రమించేందుకు డోనాల్డ్ ట్రంప్ ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఇక పరోక్షంగా చైనాపై అమెరికా ఆధిపత్యంకోసం పోరాటం, మధ్య వాణిజ్య యుద్ధం కొనసాగుతూనే ఉంది. 2025లో ఈ పరోక్షయుద్ధం చాలా ప్రత్యక్షంగా ప్రపంచం ముందు సాక్షాత్కారమైంది.
మయన్మార్‌లో ఐదు సంవత్సరాలుగా అంతర్యుద్ధం కొనసాగుతోంది. వేలాదిమంది ఆ దేశంలో మరణిస్తున్నారు. ఆ దేశం నుండి ప్రపంచానికి వార్తలు తెలియడంలేదు. లక్షలమంది ప్రజలు పొరుగుదేశాలకు పారిపోతూ ఉండటం ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. ఈ అంతర్యుద్ధాన్ని అణచిపెట్టి మయన్మార్ సైనిక పాలకులు ప్రపంచాన్ని వంచించడంకోసం నకిలీ ప్రజాస్వామ్యాన్ని ఆ దేశంలో ఆవిష్కరింపజేసేందుకు నమ్మకద్రోహం చేస్తున్నారు. బూటకపు ఎన్నికల ప్రక్రియకు తెరలేపారు. ఇక బంగ్లాదేశ్‌లో మతోన్మాదం విజృంభించింది. అక్కడ కూడా ఉగ్రవాద స్థావరాలు మెల్లిగా వేళ్లానుకుంటున్నాయి. బంగ్లాదేశ్ ప్రజాస్వామ్యదేశం దశ నుండి తిరిగి ఒక మతవాద దేశం స్థాయికి వెనక్కువెళ్ళే పరిస్థితులు కనిపిస్తున్నాయి. కానీ బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ నాయకుడు తారిక్ రెహ్మాన్ సర్వమతాలను ఆ దేశంలో సమీకృతం చేసి సామరస్యత నెలకొల్పే వ్యక్తిగా రాజకీయ తెరమీద కనిపిస్తున్నారు. కానీ ప్రస్తుత అపరిపక్వ దశలో తారిక్ రెహ్మాన్ బంగ్లాదేశ్‌లో ఒంటరిపోరాటం చేయాలి. ఆయన ఒంటరి పోరాటంలో విజయం సాధిస్తారా? లేక మతోన్మాదులకు లొంగిపోతారా? మతోన్మాదులే పైచేయి సాధిస్తారా? బంగ్లాదేశ్‌లో ఇతర మత రాజ్యాల జోక్యం వల్ల ఆ దేశం తన దిశను తాను నిర్దేశించుకోలేక పోతుందా? వంటివన్నీ భవిష్యత్తులో తేలాల్సిన విషయాలే. ఇన్నాళ్ళుగా మన్నుతిన్నపాములా ఉన్న బంగ్లాదేశ్ ఇప్పుడు కొత్త మార్పులతో నిత్యం వార్తల్లోకి వచ్చింది.
ఇంకోవైపు వాణిజ్యమే ప్రపంచ దేశాల మధ్య సంబంధాలను తీర్చిదిద్దే కొత్త దశ ట్రంప్ యుగంలో ప్రారంభమైంది. నిజం చెప్పాలంటే 2025 సంవత్సరం మొత్తం అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంపు చుట్టూ ప్రదక్షిణాలు చేసింది. అమెరికా ఆదాయం పెంచుకునే మార్గాలకోసం టారిఫ్‌లతో దాదాపు అన్ని దేశాలను ఆయన బెదరగొట్టారు. చివరకు యూరప్ దేశాలకూ ఆగ్రహం రప్పించారు. తానే యుద్ధాలను ఆపుతున్నానని పదే పదే చెబుతున్న ట్రంప్ యుద్ధాలకు ఆజ్యం పోసే నాయకుడుగా, ఖనిజాల కబళాన్వేషణ, మార్కెట్ ఆధిపత్య అన్వేషణ చేసే స్వార్థపరుడుగా అవతరించారు. చైనా ఒక్కటే ట్రంప్‌ను దీటుగా ప్రతిఘటించి నిలబడింది. అమెరికాపై ప్రతీకార సుంకాలు విధించి ప్రత్యక్ష హెచ్చరికలు చేయడంతో ఆయన దిగివచ్చి చైనాతో వాణిజ్య చర్చలకు వచ్చారు.
అనేక చిన్న చిన్న దేశాల ఎన్నికల్లో ట్రంప్ ప్రత్యక్ష జోక్యం చేసుకున్నారు. ఆయనకు అనుకూలంగా ఉన్న ప్రభుత్వాలను ఏర్పాటు చేసుకోవడానికి ఆ దేశాలలో నాయకులకు బాహాటంగా మద్దతు ఇచ్చారు. చిన్న చిన్న దేశాలలో వనరుల దోపిడీకి మార్గాన్వేషణ ఆయన ప్రారంభించారు. వందకుపైగా దేశాలలో జరిగిన ఎన్నికల్లో మితవాదులదే పైచేయిగా మారింది.

## పుతిన్ అధికార నివాసాలపై ఉక్రేన్ దాడులు

### మోదీ, ట్రంప్ సహా పలు దేశాల ఆందోళన
### కట్టుకథలేనంటున్న జెలెన్స్కీ



**మాస్కో :** అధ్యక్షుడు పుతిన్ అధికార నివాసాలు ధ్వంసం చేసేందుకు డ్రోన్లతో దాడులు చేసిందని రష్యా ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేసింది. తమ గగనతల రక్షణ వ్యవస్థలు ఈ ప్రయత్నాలను విచ్ఛిన్నం చేశాయని తెలిపింది. ఎవరికీ ఎలాంటి ప్రాణనష్టం, ఆస్తినష్టం జరగలేదని పేర్కొంది. నొవ్‌గొరోడ్ రీజియన్‌లో మాస్కో–సెయింట్ పీటర్స్‌బర్గ్ మధ్యలోఉన్న పుతిన్ అధికార నివాసంపై దాడులు చేసేందుకు ఉక్రేన్ 91 దీర్ఘశ్రేణి డ్రోన్లను ప్రయోగించిందని రష్యా విదేశాంగమంత్రి సెర్గీ లోవరోవ్ మంగళవారం ప్రకటించారు. ఆదివారం రాత్రి, సోమవారం ఉదయం ఈ డ్రోన్లు ప్రయోగించారని ఆయన చెప్పారు. దాడులు జరిగిన సమయంలో పుతిన్ ఆ అధికార నివాసంలో ఉన్నారా? లేరా? అనే తదుపరి సమాచారాన్ని లోవరోవ్ చెప్పలేదు. ఈ ఘటనపై భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ సహా పలు దేశాలు స్పందించాయి. పుతిన్ అధికార నివాసంపై దాడి యత్నంపట్ల అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంలో తనకు చాలా కోపంగా ఉందని ఆయన అన్నారు. పుతిన్ అధికార నివాసంపై దాడి యత్నం వార్తలపట్ల మోదీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. చైనా విదేశీమంత్రిత్వశాఖ కూడా స్పందిస్తూ, ఈ యుద్ధ పరిస్థితులు విస్తరించకుండా చూడాలని ఉక్రేన్ తరపున వాదించే దేశాలకు విజ్ఞప్తి చేసింది. భవిష్యత్ శత్రుత్వానికి ఆజ్యం పోయకుండా దూరంగా ఉండాలని, నివారణ చర్యలు తీసుకోవాలని కోరింది. ఒక రాజకీయ పరిష్కారం కుదిరేందుకు వీలుగా చర్యలు తీసుకోవాలని కోరింది. ఉక్రేన్ మాజీ ప్రధానమంత్రి నికొలాయ్ అజరాయ్ టాస్ వార్తాసంస్థతో మాట్లాడుతూ, ఈ దాడులను బట్టి చూస్తే అసలు దేశంలోని ప్రభుత్వమే శాంతి చర్చలకు పెద్ద ఆటంకంగా ఉందని అర్థమవుతోందన్నారు. ఈ విషయంతో తనకు సంబంధం లేదని జెలెన్స్కీ తప్పించుకునే ప్రయత్నం హాస్యాస్పదంగా ఉందని, దీనిలో అసలు అర్థమే లేదన్నారు. ఉక్రేన్ పార్లమెంటు సభ్యుడు ఆర్ట్యోమ్ ద్మిత్రక్ స్పందిస్తూ, జెలెన్స్కీని టెర్రరిస్టుగా పరిగణించాలన్నారు.

**ఇది ట్రంప్ మొహంపై చెంపదెబ్బ : రష్యా**

పుతిన్ అధికార నివాసంపై దాడిని రష్యా విదేశీమంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి మరియా జఖరోవా ఉక్రేన్ ఒక టెర్రరిస్టు దాడిగా పేర్కొన్నారు. పాశ్చాత్య దేశాలు జెలెన్స్కీకి ఈ ఉగ్రవాద దాడులు చేసేందుకు పూర్తి మద్దతు ఇస్తున్నాయని, వీటికి అంతే లేకుండా పోయిందని విమర్శించారు. పుతిన్ నివాసంపై దాడి శాంతి చర్చలకు నాయకత్వం వహిస్తున్న ట్రంప్ మొహంపై నేరుగా చెంపదెబ్బ కొట్టినట్టే ఉందన్నారు. ఉక్రేన్‌లో శాంతి చర్చలకు విఘాతం కలిగించేందుకు ఒక కోవర్టు తరహాలో జెలెన్స్కీ చాలా అనుకూలమైన పద్ధతుల్లో తనకు తెలియదంటూ ఈ విషయం నుండి దూరంగా జరిగివెళ్ళారని విమర్శించారు.

## సాగునీరందించండి

(మొదటి పేజీ తరువాయి)

కొల్లూరి రాజయ్య, నెట్టెం నారాయణ, రాష్ట్ర ఫైనాన్స్ కార్యదర్శి డి.జి.నరేంద్ర ప్రసాద్, మాధవ రెడ్డి సుధాకర్ గౌడ్, అల్వాల్ రెడ్డి, సి.హెచ్ దశరథ, నిమ్మల నరసింహ, రామకృష్ణా రెడ్డి, రాంరెడ్డి మల్లా రెడ్డితో పాటు పది ఉమ్మడి జిల్లాల నుండి తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.
రాష్ట్రంలో 43 శాతం ప్రాంతం కృష్ణ బేసిన్‌లో, 56 శాతం ప్రాంతం గోదావరి బేసిన్‌లో ఉన్నదని తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 73 ప్రాజెక్టులలో 34 భారీ ప్రాజెక్టులు, 39 మధ్యతరహా ప్రాజెక్టులు చేపట్టి, అందులో 42 ప్రాజెక్టులను (10 భారీ ప్రాజెక్టులు, 32 మధ్య తరహా ప్రాజెక్టులు) పూర్తి చేశారని, మిగిలిన 31 ప్రాజెక్టులు (24 భారీ, ఏడు మధ్య తరహా ప్రాజెక్టుల) నిర్మాణం కొనసాగుతుందని వక్తలు వివరించారు.
ఈ 73 భారీ, మధ్య తరహా ప్రాజెక్టులకు అదనంగా రెండు ఆధునికీకరణ ప్రాజెక్టులు నాగార్జునసాగర్, నిజాంసాగర్, ఒకటి వరద కట్టల (ఖమ్మం , వరంగల్) ప్రాజెక్టులను చేపట్టారని తెలిపారు. రాష్ట్రంలో 637 ఎత్తిపోతల ప్రాజెక్ట్‌లు ఉండగా ఇందులో 385 మాత్రమే పని చేస్తున్నాయని, కొత్తగా నెలికల్, కేశవాపురం (నల్లగొండ జిల్లా) పిప్రీ(నిర్మల్ జిల్లా) మూడు కొత్త లిఫ్టు పథకాలను మంజూరు చేశారని, మరో 37 నిర్మాణంలో కొనసాగుతున్నాయని, వీటికి బడ్జెట్‌ను కేటాయించి పూర్తిచేయాలని రౌండ్ టేబుల్ డిమాండ్ చేసింది.

**సాగునీటి మొత్తం సామర్థ్యం -127.57 లక్షల ఎకరాలు..**

భారీ, మధ్యతరహా, చిన్న తరహా సాగునీటి ప్రాజెక్టుల కింద రాష్ట్రంలో సాగునీటి మొత్తం సామర్థ్యం 127.57లక్షల ఎకరాలు. ఇప్పటివరకు ఏర్పాటైన సాగునీటి సామర్థ్యం 73.57 లక్షలు ఎకరాలు. మిగిలిన సాగునీరు 54 లక్షల ఎకరాలకు ఇవ్వాల్సి ఉంది. గోదావరి నదిలో 967.94 టిఎంసిలను వినియోగించుకునేందుకు తెలంగాణ రాష్ట్రానికి హక్కు ఉంది. కృష్ణా నదిలో నీటి లభ్యతలో 75 శాతం ఆధారంగా 811 టిఎంసిలు నికర, మిగులు జలాలతో కలిపి బచావత్ ట్రిబ్యునల్ తీర్పు ప్రకారం 1976 సం.లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కు కేటాయించారు. ఈ తీర్పు ప్రకారమే మిగులు జలాలను 2000 సంవత్సరం వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ వినియోగించుకునే అవకాశం కల్పించిందని, రెండవసారి ఏర్పాటైన బ్రిజేష్ కుమార్ తీర్పు ప్రకారం నికర మిగులు జలాలను కూడా నీటి లభ్యతలో 65 శాతం ఆధారంగా పంపిణీ చేయడం వల్ల ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు 1005 టిఎంసిలు కేటాయించారని తెలిపారు. బ్రిజేష్ కుమార్ చేసిన నీటి పంపిణీ అన్యాయంగా ఉందని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సుప్రీం కోర్టులో అప్పీల్ చేసిందని గుర్తుచేశారు. 2005 సంవత్సరంలో ప్రారంభించిన పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల, కల్వకుర్తి ఎత్తిపోతల, నెట్టెంపాడు ఎత్తిపోతల, బీమా ఎత్తిపోతల ఫెజ్ 1, 2, కోయిల్ సాగర్ ఎత్తిపోతల, ఎస్ఎల్‌బిసి, డిండి ఎత్తిపోతల ప్రాజెక్ట్‌లకు కావాల్సిన నీటిని సాధించుకోవాల్సి ఉన్నదన్నారు.

**యుద్ధప్రాతిపదికన జల వివాదాన్ని పరిష్కరించాలి**

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య కృష్ణా జల వివాదాన్ని యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని రౌండ్ టేబ్ల్ సమావేశం డిమాండ్ చేసింది. పెండింగ్‌లో ఉన్న భారీ, మధ్యతరహా ప్రాజెక్టులను పూర్తి చేసి 54 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని, ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయాలని , నిధులను కేటాయించాలని తెలిపింది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మేడిగడ్డ బ్యారేజీలో 7వ బ్లాక్‌లో పిల్లర్స్ కుంగిపోవడానికి కారణాలను తెలుసుకునేందుకు భూగర్భ సంబంధిత పరీక్షలను నిర్వహించి, ఆ పరీక్షలో తేలిన విషయాల ఆధారంగా తగిన నిర్ణయం తీసుకోవాలని, జాతీయ డ్యామ్ భద్రత అథారిటీ చేసిన సూచనల మేరకు చర్యలను వేగవంతం చేయాలని రౌండ్ టేబుల్ సమావేశం సూచించింది.
ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టుపై డిపిఆర్‌ను ప్రకటించాలని తక్కువ ఖర్చుతో కాగ్ రిపోర్టు ప్రకారం గోదావరి జిలాలను వినియోగించుకోవాలన్నది. తుమ్మిడిహెట్టి నుండి మేడిగడ్డ ఆనకట్ట స్థలం మార్చే క్రమంలో చేసిన సర్వే, ఆనకట్టల అంచనాల విషయంలో అవకతవకలకు పాల్పడిన ముఖ్యమంత్రి, మంత్రులు బ్యూరోక్రాట్స్, ఇంజనీర్లపైన చర్యలు తీసుకోవాలని తెలిపిన జస్టిస్ పిసి గోష్ కమిషన్ నివేదికను వెంటనే సమీక్షించి, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేసింది.

**రౌండ్ తీర్మానాలు**

శ్రీశైలంలో డెడ్ స్టోరేజ్ 835 అడుగుల నుండి 854 అడుగులకు పెంచుతూ జిఓ 69/1996ను అమలు చేయాలి. కృష్ణా, గోదావరి జలాల వినియోగంలో సమర్థవంతంగా చర్యలు తీసుకుని అమలు చేయాల్సిన వారు, పాలమూరు రంగారెడ్డి తదితర ప్రాజెక్టులకు జలాలను సాధించలేదని, ప్రస్తుత పాలకులపై ఆరోపిస్తూ, తప్పుడు, అబద్ధ ప్రచారాలతో ప్రజలను మభ్య పెట్టడానికి ప్రయత్నించడం సరికాదని రౌండ్ టేండ్ సమావేశం తీర్మానించింది. ఆంధ్రప్రదేశ్‌కు 512 టిఎంసిలు, తెలంగాణకు 299 టిఎంసిలు వినియోగించుకోవాలని నాడు ఎపి సిఎం వై ఎస్ జగన్‌తో సంతకాలు చేసుకుని, ఏనాడూ 299 టిఎంసిల నీటిని వినియోగించుకోలేని పరిస్థితిని కూడా పరిశీలించాలని, సాగునీటి ప్రాజెక్టుల అక్రమ నిర్మాణాలపై నికరమైన చర్యలు తీసుకోవాలని రౌండ్ టేండ్ సమావేశం స్పష్టం చేసింది. తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజ్ నిర్మించి అదిలాబాద్, కాళేశ్వరం ఆయకట్టుకు నీరు ఇచ్చేందుకు ప్రయత్నించాలని రిటైర్డ్ ఇంజనీర్ కె.విఠల్ రావు ప్రతిపాదించిన బోరేపల్లి వరాజనం అంశాన్ని కూడా విశ్లేషించి, మెరుగైన ప్రాజెక్ట్‌ను ముందుకు తీసుకెళ్లాలని రౌండ్‌టేబల్ సమావేశం రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. కేశవాపూర్, నల్లగొండలో ప్రతిపాదించిన ఎనిమిది జలాశయాలను పూర్తి చేసి హైదరాబాద్ నగరానికి తాగునీటిని అందించాలని, మల్లన్నసాగర్‌ను మరొక నిజాం సాగర్‌గా మారకుండా చర్యలు తీసుకోవాలి. ప్రాణహిత–చేవెళ్ల పథకంలో అతి తక్కువ సాగునీటి వసతి ఉన్న రంగారెడ్డి జిల్లా ప్రధానమైనదిగా భావించాలి. దీనికి ప్యాకేజ్ 25, 26, 27 కింద రెండు లక్షల 40 వేల ఎకరాలకు సాగునీటిని అందించాలి. మల్లన్నసాగర్ ద్వారా చేవెళ్ల దగ్గర ఎత్తిపోతల విషయంలో గత ప్రతిపాదనను చర్చించి సరైన నిర్ణయం తీసుకోవాలని తీర్మానం చేశారు.

## అందుబాటులోనే యూరియా

(మొదటి పేజీ తరువాయి)

ప్రత్యేక అధికారికి నాలుగైదు జిల్లాలను కేటాయించారు. యూరియా పక్కదారి పట్టకుండా పకడ్బందీగా పంపిణి చేసేవిధంగా ప్రత్యేక అధికారులు జిల్లాలో పర్యటించి మానిటరింగ్ చేయనున్నారు. యూరియా పంపిణి కేంద్రాల వద్ద రైతులు గంటల తరబడి క్యూ లైన్‌లో నిలబడకుండా పర్యవేక్షించనున్నారు. కాగా పైలట్ ప్రాజెక్టు కింద యూరియా యాప్ కొనసాగుతున్న ఐదు జిల్లాలో కాకుండా మిగతా జిల్లాలో కూడా యూరియా సక్రమంగా పంపిణి చేసేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ ఆదేశించింది. రబీ2025–26 సీజన్ (అక్టోబర్ నుండి మార్చి వరకు)కు గాను కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి వివిధ రకాల ఎరువులను మొత్తం 20.10 లక్షల మెట్రిక్ టన్నులు కేటాయించగా, అందులో 10.40 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా మాత్రమే కేటాయించినట్టు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు తెలిపారు. అక్టోబర్ నెల నుండి ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వం నుండి రాష్ట్రానికి 5.60 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా రావాల్సి ఉండగా, ఇప్పటికే 5.84 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా అయిందని, కేటాయించిన పరిమాణం కంటే 24 వేల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా అధికంగా జరిగిందని వివరించారు. రబి 2025–26 సీజన్‌లో ఇప్పటి వరకు రైతులు 3.71 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను కొనుగోలు చేశారన్నారు. ప్రతిపక్ష నాయకుల మాటలు విని, భయాందోళనకు గురై అవసరానికి మించి యూరియా కొనుగోలు చేయకుండా, అవసరమైన మేరకే రైతులు వినియోగించుకోవాలని తుమ్మల నాగేశ్వర్‌రావు సూచించారు. యూరియా అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని, రైతులకు ఇబ్బందులు లేకుండా యూరియా సరఫరాపై ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తుందని తెలిపారు. అన్ని జిల్లాల్లో తగినంత యూరియా నిల్వలు ఉన్నాయని, రైతులకు సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు మంత్రికి వివరించారు.

**జిల్లాల వారీగా యూరియా నిల్వలు :**

ఆదిలాబాద్ (2,610 మెట్రిక్ టన్నులు) 57,998 సంచులు, కుమురంభీమ్ ఆసిఫాబాద్ (4,333 మెట్రిక్ టన్నులు) 96,297 సంచులు, మంచిర్యాల (3,911 మెట్రిక్ టన్నులు), 86,917 సంచులు, నిర్మల్ (7,622 మెట్రిక్ టన్నులు), 1,69,367 సంచులు. నిజామాబాద్ (13,131 మెట్రిక్ టన్నులు) 2,91,808 సంచులు. కామారెడ్డి (9,799 మెట్రిక్ టన్నులు), 2,17,765 సంచులు.కరీంనగర్ (8,387 మెట్రిక్ టన్నులు), 1,86,374 సంచులు.పెద్దపల్లి (9,996 మెట్రిక్ టన్నులు), 2,22,135 బ్యాగులు.జగిత్యాల (7,296 మెట్రిక్ టన్నులు), 1,62,141 సంచులు. రాజన్న సిరిసిల్ల (2,903మెట్రిక్ టన్నులు) 64,517 బ్యాగులు. మెదక్ (5,508 మెట్రిక్ టన్నులు), 1,22,402 బ్యాగులు. సంగారెడ్డి (4,766 మెట్రిక్ టన్నులు) 1,05,901 సంచులు. సిద్ధిపేట (10,980 మెట్రిక్ టన్నులు), 2,44,008 బ్యాగులు. వరంగల్ (9,375మెట్రిక్ టన్నులు), 2,08,337 బ్యాగులు. హన్మకొండ (6,826మెట్రిక్ టన్నులు), 1,51,694 సంచులు. మహబూబాబాద్(7,043 మెట్రిక్ టన్నులు), 1,56,510 బ్యాగులు. ములుగు (3,218 మెట్రిక్ టన్నులు), 71,505 సంచులు. జయశంకర్ భూపాలపల్లి (4,137మెట్రిక్ టన్నులు), 91,931 సంచులు. జనగామ( 2,881మెట్రిక్ టన్నులు), 64,026 సంచులు. ఖమ్మం (13,936 మెట్రిక్ టన్నులు) 3,09,681 సంచులు. భద్రాద్రి కొత్తగూడెం(6,390 మెట్రిక్ టన్నులు) 1,42,005 సంచులు. రంగారెడ్డి (4,761మెట్రిక్ టన్నులు), 1,05,810 సంచులు. వికారాబాద్(4,063మెట్రిక్ టన్నులు), 90,284 సంచులు. మేడ్చల్‌మల్కాజిగిరి (3,278మెట్రిక్ టన్నులు), 72,837 సంచులు. మహబూబ్‌నగర్ (5,908 మెట్రిక్ టన్నులు), 1,31,280 సంచులు. నారాయణపేట (3,895మెట్రిక్ టన్నులు), 86,552 సంచులు. నాగర్ కర్నూల్ (3,216మెట్రిక్ టన్నులు), 71,458 సంచులు. వనపర్తి (5,399 మెట్రిక్ టన్నులు), 1,19,987 సంచులు. జోగులాంబ గద్వాల్ (8,125మెట్రిక్ టన్నులు), 1,80,553. నల్లగొండ (13,936 మెట్రిక్ టన్నులు).

## టిజి ఇఎపి సెట్

(మొదటి పేజీ తరువాయి)

2026 మే 9,10,11 తేదీల్లో ఎంట్రెన్స్ పరీక్షలు జరగనున్నాయి. కాకతీయ విశ్వవిద్యాలయం నిర్వహించనున్న టిజి ఈడిసెట్ (బిఇడి) ప్రవేశ పరీక్ష మే 12న జరగనుంది. మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో జరగనున్న టిజి ఐసెట్ (ఎంబిఎ, ఎంసిఎ) ప్రవేశాలకు గాను మే 13, 14 తేదీలో ఎంట్రెన్స్ పరీక్ష నిర్వహించనున్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించనున్న బిఇ, బిటెక్, బి.ఫార్మాసీ రెండవ సంవత్సరం ప్రవేశాలకు గాను టిజి ఇసెట్ పరీక్షలు మే 15న జరగనుంది.
ఉస్మానియా విశ్వవిద్యాలయం నిర్వహించనున్న టిజి లాసెట్ (3,5 సంవత్సరాలు)లతో పాటు ఎల్ఎల్ఎం కు సంబంధించి మే 18న ఎంట్రెన్స్ పరీక్ష నిర్వహించనున్నారు.
జెఎన్‌టియుహెచ్ నిర్వహించనున్న ఎంఇ, ఎంటెక్, ఎం.ఫార్మాసీ, ఎం.ఆర్క్ , ఫార్మాడి ఎంట్రెన్స్ పరీక్షలు 2026 మే 28 నుంచి 31 తేదీల్లో జరగనున్నాయి. శాతవాహన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో జరగనున్న టిజి పిఇసెట్ (బిపిఇడి యుజిడి ఇడి) ప్రవేశాలకు గాను 2026 మే 31, నుంచి జూన్ 3వ తేదీ వరకు జరగనున్నాయి.

## అసెంబ్లీలో తీర్మానం చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

సమావేశాలు కనీసం పది పని రోజుల పాటు నిర్వహించాలని, సభకు సంబంధించిన ఎజెండాను ముందుగా అందజేయాలన్నారు. ఈ మేరకు కూనంనేని సాంబశివ రావు శాసనసభ శీతాకాల సమావేశాలలో చర్చించాల్సిన అంశాలను సిపిఐ తరపున బిఎసి పరిశీలనకు ప్రతిపాదిస్తూ శాసనసభ స్పీకర్, శాసనసభ కార్యక్రమ సలహా సమితి (బిఎసి) చైర్మన్ గడ్డం ప్రసాద్ కుమార్‌కును కోరారు. ప్రతి ఏటా కనీసం 50 రోజుల పాటు శాసనసభ సమావేశాలను నిర్వహించాలని, సభకు సంబంధించి అన్ని కమిటీ నియామకాలను పూర్తిచేయాలని, పార్లమెంటు తరహాలో మినీ పార్లమెంటుగా పిలిచే స్థాయీ సంఘాల (స్టాండింగ్ కమిటీల) ఏర్పాటుకు చొరవ చూపాలని కోరారు. అలాగే శాసనసభ సమావేశంలో నదీ జలాలు, ప్రాజెక్టుల తాజా స్థితి, అసంఘటిత కార్మికులు, కనీస వేతనాలు, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనం అమలు చేస్తూ, ఏజెన్సీలను రద్దు చేసి, ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసేలా శాసనసభలో తీర్మానం చేయాలని కూనంనేని సాంబశివ రావు సూచించారు. గుడిసెలు వేసుకున్న పేదల స్థలాలకు పట్టాలు,ఇందిరమ్మ గృహాలను నిర్మించాలని, సిగాచి పరిశ్రమలో పేలుడు ఘటన, సింగరేణి కార్మికులు,ఆర్‌టిసి ఉద్యోగుల సమస్యలు, కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికలు, రిటైర్డ్ ఉద్యోగులకు బకాయిలు, ప్రభుత్వ ఉద్యోగులకు పిఆర్‌సి, బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు చేసేందుకు కార్యాచరణ తదితర అంశాలను ప్రతిపాదిస్తూ కూనంనేని సాంబశివ రావు స్పీకర్‌కు లేఖ అందజేశారు.

## రాష్ట్రం నెంబర్ 1

(మొదటి పేజీ తరువాయి)

24,498 మంది బాధితులకు ఊరట కలిగించన్నారు. ఇది దేశ వ్యాప్త రికార్డు అని గుర్తు చేశారు.సైబర్ క్రైమ్ మీద 31,397 అవగాహన సదస్సులు నిర్వహించామన్నారు.ఆర్‌బివిఆర్ ఆర్ తెలంగాణ పోలీసు అకాడమీలో 12,555 మందికి శిక్షణ పొందారు. నాలుగు జాతీయ లోక్ అదాలత్‌ల ద్వారా 7,22,487 కేసులు పరిష్కరించామన్నారు. జాతీయ, అంతర్జాతీయ సదస్సులు, కార్యక్రమాలను కూడా దిగ్విజయంగా చేశామన్నారు. ఏ ఏడాది 507 మంది మావోయిస్టులు పోలీసుల ముందు లొంగిపోయారన్నారు. కొత్తగా మరో 45,137 సిసిటివిలను ఏర్పాటు చేశామన్నారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా 12,09,782 సిసిటివి కెమెరాలు ఉన్నాయన్నారు.
ఆత్మహత్యల నివారణకై ఎస్‌హెచ్‌ఒలకు కౌన్సిలింగ్: మహేష్ భగవత్
పోలీసు శాఖలో సిబ్బంది ఆత్మహత్యలపై అద్యాయనం చేశామన్నారు. ఈ మేరకు రాష్ట్రంలోని సుమారు 750 మంది ఎస్‌హెచ్‌ఒలకు ప్రత్యేకంగా కౌన్సిలింగ్ ఇచ్చామన్నారు. ప్రతి సిబ్బంది వ్యక్తిగత వివరాలను తెలుసుకోవాలని, వారికున్న ఇబ్బందులపై చర్చించాలని, అవసరమైతే వైద్య సహాయం కూడా అందించాలని ఎస్‌హెచ్‌ఒలకు ఆదేశాలు జారీ చేశామన్నారు. సిబ్బందికి తల్లిదండ్రులుగా ఎస్‌హెచ్‌ఒలు మెలగాలన్నారు.
పెరిగిన రోడ్డు ప్రమాదాలు తగ్గిన మృతులు
2025 సంవత్సరంలో రోడ్డు ప్రమాదాల కేసులు గత ఏడాది 2024తో పోలిస్తే 5.68 శాతం పెరిగినట్లు డిజిపి వెల్లడించారు. అయితే ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య మాత్రం గణనీయంగా తగ్గిందన్నారు. 2025లో మొత్తం 557 మంది మృతులు తగ్గి, ఇది 7.9 శాతం తగ్గుదలగా నమోదైందన్నారు. గణాంకాల ప్రకారం 2025లో మొత్తం 24,826 రోడ్డు ప్రమాదాల కేసులు నమోదయ్యాయి. ఈ ప్రమాదాల్లో 6,499 మంది మృతి చెందగా, 14,768 మంది గాయపడ్డారు. ముఖ్యంగా గాయపడిన వారి సంఖ్యలో భారీ తగ్గుదల కనిపించింది. గత ఏడాదితో పోలిస్తే 6,896 మంది తక్కువగా గాయపడటం నమోదై, ఇది 31.8 శాతం తగ్గుదలగా ఉంది. ఇదే సమయంలో 2024 సంవత్సరంలో మొత్తం 23,491 రోడ్డు ప్రమాదాల కేసులు నమోదయ్యాయి. ఆ ఏడాదిలో 7,056 మంది ప్రాణాలు కోల్పోగా, 21,664 మంది గాయపడ్డారు.
రోడ్డు భద్రత చర్యలు, తక్షణ వైద్య సేవలు, కఠిన అమలు చర్యల వల్ల మృతులు, గాయాల సంఖ్య తగ్గినట్లు అధికారులు విశ్లేషిస్తున్నారు. ఇదిలా ఉండగా, జీరో ఎఫ్‌ఐఆర్‌ల అమలుపై కూడా ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు డిజిపి వెల్లడించారు.

## పట్టాలెక్కించాలి

(మొదటి పేజీ తరువాయి)

చెత్త నిర్వహణ అత్యంత సంక్లిష్టమైన సమస్య అని, జోనల్ కమిషనర్లు ప్రతీ రోజు ఫీల్డ్‌లో ఉండాల్సిందేనన్నారు. సిటీలో ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలని నిర్ణయించినట్లు సిఎం వెల్లడించారు. సిటీలో కాలుష్య నియంత్రణకు అవసరమైన పూర్తిస్థాయి ప్రక్షాళన చేపడుతున్నామన్నారు. చెరువులు, నాలాలు, చెత్త డంపింగ్ ఏరియాల వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని, నెలకు మూడు రోజులు శానిటేషన్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. రోడ్లపై ఎక్కడా చెత్త కనిపించడానికి వీల్లేదని, రోడ్లపై గుంతలు కనిపించొద్దన్నారు. కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్, అపార్ట్‌మెంట్ అసోసియేషన్‌లతో కమ్యూనికేషన్ ఉండేలా చూసుకోవాలన్నారు. దోమల నివారణ, అంటువ్యాధులు ప్రబలకుండా జోనల్ కమిషనర్ చర్యలు చేపట్టాలని, ప్రతీ పది రోజులకోసారి గార్బేజ్ క్లియరెన్స్ డ్రైవ్ నిర్వహించాలని సిఎం సూచించారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## మంత్రి దామోదర రాజ నర్సింహ్మాకు నిమ్స్ ఉద్యోగుల కృతజ్ఞతలు

ప్రజాపక్షం/హైదరాబాద్ : 'ఆర్జిత సెలవుల నగదు రూపంలో మార్పిడికి అనుమతి ఇస్తూ ప్రభుత్వం జిఓ230ని జారీ చేయడం పట్ల నిజాం ఇన్స్టిట్యూ ట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్)ఉద్యోగ వర్గాలు హర్షం వ్యక్తం చేశారు. తమ విజ్ఞప్తిని మన్నించి, ఇచ్చిన మాట ప్రకారం సమస్యను పరిష్కరించిన వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను నిమ్స్ ఉద్యోగ సంఘాల నాయకులు మంగళవారం ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ఆఫీసులో కలిసి పుష్ప గుచ్ఛం అందించి, ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. తమ కష్టాన్ని గుర్తించి, ఎన్నో ఏళ్ల నిరీక్షణకు తెరదించినందుకు మంత్రికి రుణపడి ఉంటామని తెలిపారు. ఈ నిర్ణయంతో వేలాది మంది నిమ్స్ ఉద్యోగులకు ఆర్థికంగా లబ్ది చేకూరనుందని ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పేషెంట్లకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. పేషెంట్ల పట్ల సహనంతో సానుభూతితో వ్యవహరించాలన్నారు.

# గ్లోబల్ టూరిజం హబ్‌గా తెలంగాణ

**'టూరిజం అండ్ ఇట్స్ విజన్ – 2026' వర్క్‌షాప్‌లో మంత్రి జూపల్లి కృష్ణారావు**




ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ పర్యాటక రంగం దేశానికే దిక్సూచిగా మారాలని, అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో పర్యాటకులను ఆకర్షించేలా వినూత్న మార్పులు తీసుకురావాలని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పిలుపునిచ్చారు. మంగళవారం తారామతి బరాదరిలో తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ (టిజిటిడిసి) ఆధ్వర్యంలో నిర్వహించిన 'టూరిజం అండ్ ఇట్స్ విజన్ 2026' మేధోమథన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం టిజిటిడిసి రూపొందించిన 'టేబుల్ క్యాలెండర్' 2026ను ఆవిష్కరించారు. ఈ సదస్సులో పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, ఎండి క్రాంతి వల్లూరు, నిథమ్ డైరెక్టర్ వెంకటరమణ, ఆర్కియాలజీ డైరెక్టర్ డాక్టర్ అర్జున్ రావు, తదితరులు పాల్గొని, పర్యాటక అభివృద్ధిపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. 'ప్రస్తుతం ప్రపంచం ఒక గ్లోబల్ విలేజ్‌గా మారింది. పర్యాటక రంగంలో మనం కొత్తగా ఎఐ అద్భుతాలు సృష్టించాల్సిన అవసరం లేదు. మనకు ప్రకృతి ప్రసాదించిన వనరులు, వారసత్వ సంపద పుష్కలంగా ఉన్నాయి. వాటికి మెరుగులు దిద్ది, సరైన పద్ధతిలో ప్రపంచానికి పరిచయం చేస్తే చాలు. దేశ, విదేశీ పర్యాటకులు సైతం తెలంగాణ వైపు చూసేలా మన ప్రణాళికలు ఉండాలి 'అని దిశానిర్దేశం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లోని అద్భుతాలను నగరవాసులకు, రాష్ట్ర విశిష్టతలను దేశ, అంతర్జాతీయ పర్యాటకులకు చేరువ చేయడమే మన లక్ష్యం కావాలి' అని స్పష్టం చేశారు. పర్యాటకులకు తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలతో పాటు గిరిజన జీవన శైలి, ఆహారపు అలవాట్లు, ఆచారాలను పరిచయం చేయాలి. అదేవిధంగా ప్రకృతితో మమేకమై ఎక్కడో కొండకోనల్లో జీవిస్తున్న ఆదివాసీలు, గిరిజనులకు నగరంలోని చారిత్రక కట్టడాలు, వారసత్వ సంపద, ఆకాశహర్మ్యాలు, మెట్రో రైళ్లు నగరవాసుల ఆధునిక జీవన శైలిని తెలియజేసే విధంగా కార్యచరణ రూపొందించాలని అన్నారు. పర్యాటక ప్రదేశాలకు కేవలం వచ్చి వెళ్లడం కాకుండా, పర్యాటకులు అక్కడ కనీసం రెండు రోజులు బస చేసేలా ఆకర్షణీయమైన వాతావరణాన్ని సృష్టించాలి. కనీస వసతి సదుపాయాల కల్పనపై దృష్టి సారించాలి. కేవలం సందర్శన మాత్రమే కాదు.. వసతి, భోజనం, రవాణా వంటి మౌలిక సదుపాయాల్లో నాణ్యత పెరగాలి. ఐటీ కారిడార్లు, భారీ మాల్స్, విద్యాసంస్థల్లో మన పర్యాటక ప్రచార చిత్రాలు పర్యాటకులను ఆకర్శించేలా ఉండాలి. సంస్కృతిని ప్రతిబింబించే కళారూపాలు, వినూత్న స్కిట్స్ ద్వారా పర్యాటకులను ఆకట్టుకోవాలి. హాస్పిటాలిటీలో తెలంగాణను దేశంలోనే అగ్రస్థానంలో నిలపాలి, కేరళ లాంటి రాష్ట్రాలతో మనం పోటీ పడాలి. ఆ దిశగా కార్యచరణ ఉండాలి' అని దిశానిర్దేశం చేశారు. భాషా సమస్యలు, నైపుణ్యం కలిగిన గైడ్ల కొరతను అధిగమించాలని సూచించారు. పర్యాటక శాఖలో సమూల సంస్కరణలు తీసుకురావడానికి నేను పూర్తి మద్దతు ఇస్తాను. అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది సమన్వయంతో పని చేసి తెలంగాణ పర్యాటక రంగాన్ని అద్భుతంగా తీర్చిదిద్దాలి అని ఉద్ఘాటించారు. ఈ వర్క్ షాపులో వివిధ జిల్లాల నుంచి వచ్చిన పర్యాటక శాఖ అధికారులు, హరిత హోటల్ యూనిట్ మేనేజర్లు, నిథమ్, హెరిటేజ్ విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. పర్యాటక అ భివృద్ధికి సహకారం, భాగస్వామ్యం, విలువైన సలహాలు, సూచనలు అందించిన, అధికారులు, సి బ్బందికి ప్రశంస పత్రాలనుఈ సందర్భంగా అందజేశారు.



## ప్రజా సంక్షేమం, గ్రామాల అభివృద్ధికి పట్టుదలతో పని చేయండి

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చాడ వెంకట రెడ్డి
- సిపిఐ మద్దతుతో ఎన్నికైన సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులను సన్మానించిన సిపిఐ నేతలు

ప్రజాపక్షం/కరీంనగర్: నిత్యం ప్రజా సమస్యల పరిష్కారం కోసం గ్రామాల్లో ప్రజల మధ్య ఉండి వారి సమస్యలను పరిష్కరించడంతో పాటు గ్రామాల అభివృద్ధికి పాటుపడాలని రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం కరీంనగర్‌లోని సిపిఐ జిల్లా కార్యాలయం బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సిపిఐ మద్దతుతో గెలుపొందిన సర్పంచ్ కొయ్యడ సృజన్ కుమార్‌ను, ఉప సర్పంచ్‌లు పైడిపల్లి వెంకటేష్, చింతపూల అనిల్ కుమార్‌తో పాటు, వార్డు సభ్యులను సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్‌తో కలిసి ఆయన ఎన్నికైన వారినీ శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ, గ్రామాలు అభివృద్ధి చెందితేనే మానవ మనుగడ బాగుపడుతుందని, గెలిచిన వారు గ్రామాల్లో ముఖ్యంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం నిత్యం వారి మధ్యలో ఉండి పని చేయాలని, గ్రామాల అభివృద్ధి కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుండి వచ్చే నిధులతో గ్రామ సీమలను అభివృద్ధి పరచుకోవాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు అందించేందుకు ముందుండాలని సూచించారు. ఎన్నికల్లో గెలుపు, ఓటములు సహజమని, గెలిచినవారు పొంగిపోకుండా ఓడిపోయిన వారు కృంగిపోకుండా ప్రజల మధ్య ఉండి పని చేస్తే భవిష్యత్తులో ప్రజలు గుర్తిస్తారని చాడ వెంకటరెడ్డి అన్నారు. కమ్యూనిస్టు పార్టీ ప్రజాప్రతినిధులు అంటేనే ప్రజల కోసం పనిచేసే వారు అనే విధంగా మంచి పేరు తెచ్చుకోవాలని, గెలిచిన వారంతా ఈ పదవులతోనే సరిపెట్టుకోకుండా భవిష్యత్తులో మరిన్ని ఉన్నతమైన పదవులను పొందేందుకు ప్రజల మధ్య ఉండి ప్రజల కోసమే పని చేయాలని వెంకటరెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అందె స్వామి పొనగంటి కేదారి, జిల్లా కార్యవర్గ సభ్యులు కసిరెడ్డి సురేందర్ రెడ్డి, బోయిని అశోక్, నాగెల్లి లక్ష్మారెడ్డి, బత్తుల బాబు, గూడెం లక్ష్మి, పిట్టల సమ్మయ్య, బోయిని తిరుపతి జిల్లా కౌన్సిల్ సభ్యులు అందె చిన్న స్వామి, పైడిపల్లి రాజు, బూడిద సదాశివ, బి.యుగేందర్, చొక్కల్ల శ్రీశైలం, గజ్జి అయిలయ్య తదితర నాయకులు పాల్గొన్నారు.

## స్పీచ్ పాథాలజిస్ట్ పోస్టుల ఫస్ట్ ప్రొవిజనల్ మెరిట్ లిస్ట్ విడుదల

మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు

ప్రజాపక్షం/హైదరాబాద్ : ఉద్యోగాల భర్తీలో మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు మరింత వేగం పెంచింది. ఇటీవలే 1284 ల్యాబ్ టెక్నీషియన్ పోస్టుల భర్తీ ప్రక్రియను పూర్తి చేసిన బోర్డు, తాజాగా స్పీచ్ పాథాలజిస్ట్ పోస్టుల ఫస్ట్ ప్రొవిజనల్ మెరిట్ లిస్ట్‌ను విడుదల చేసింది. ఈ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు అందరి వివరాలను మంగళవారం వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసింది. అభ్యర్థి అకాడమిక్ క్వాలిఫికేషన్‌లో సాధించిన మార్కులు, వెయిటేజీ ద్వారా సాధించిన మార్కులు, వారి స్థానికతకు సంబంధించిన అంశాలు సహా అన్ని వివరాలను వెబ్‌సైట్‌లో http://mhsrb.telangana.gov.in అందుబాటులో ఉంచామని, వీటిపై అభ్యంతరాలు ఉంటే తెలపాలని బోర్డు కోరింది. అభ్యంతరాలను జనవరి 5వ తేదీ సాయంత్రం 5 గంటల లోపల నమోదు చేయాలని సూచించింది. అభ్యంతరాలను అభ్యర్థి లాగిన్ ద్వారా మాత్రమే నమోదు చేయాలని, ఆఫ్‌లైన్‌లో పంపించిన అభ్యంతరాలను పరిగణలోకి తీసుకోబోమని బోర్డు స్పష్టం చేసింది. మల్టీ జోన్I పరిధిలో ఎలాంటి పోస్టులు నోటిఫై చేయనందున, ఆ జోన్‌కు చెందిన అభ్యర్థులను పోస్టుల కోసం పరిగణలోకి తీసుకోవడం లేదని బోర్డు స్పష్టం చేసింది.

## టిసిఎ రిట్ పిటిషన్‌పై హైకోర్టులో వాదనలు పూర్తి

**తీర్పు రిజర్వ్ చేసిన ధర్మాసనం**

ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ (టిసిఎ) దాఖలు చేసిన రిట్ పిటిషన్ పై తెలంగాణ హైకోర్టులో సోమవారం వాదనలు జరిగాయి. న్యాయమూర్తి జస్టిస్ నాగేశ్ భీమపాక అధ్యక్షతన ఈ కేసు విచారణ జరిగింది. ఈ వ్యవహారంలో టిసిఎ, హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సిఎ), భారత క్రికెట్ నియంత్రణ మండలి (బిసిసిఐ), విశాఖ ఇండస్ట్రీస్ పక్షాలుగా ఉన్నాయని, ధర్మాసనం తీర్పును రిజర్వ్ చేసిందని టిసిఎ ప్రధాన కార్యదర్శి ధరమ్ గురువారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. హెచ్‌సిఎ నిర్వహించిన కాకా వెంకటస్వామి మెమోరియల్ ఇంటర్ డిస్ట్రిక్ట్ టీ20 లీగ్ బిసిసిఐ ఆమోదిత క్యాలెండర్‌లో భాగం కాదని, బిసిసిఐ నియమావళి రూల్ 30 ప్రకారం ముందస్తు అనుమతి లేకుండానే ఈ టోర్నమెంట్ నిర్వహించారని టిసిఎ తరఫు న్యాయవాదులు కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. అదేవిధంగా, ఈ టోర్నమెంట్ నిర్వహణ బిసిసిఐ రాజ్యాంగంలోని పలు నిబంధనలకు విరుద్ధంగా ఉందని, ముఖ్యంగా రూల్ 30 (అనుమతుల నిబంధనలు), రూల్ 38 (కాన్ఫ్లిక్ట్ ఆఫ్ ఇంట్రెస్ట్) అంశాలపై ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయని టిసిఎ పేర్కొందని ఆయన వెల్లడించారు. 2021 జూలై 11న బిసిసిఐ జారీ చేసిన ఆదేశాల ప్రకారం, హైదరాబాద్ నగరం వెలుపల క్రికెట్ అభివృద్ధి విషయంలో టిసిఎతో సంప్రదింపులు జరపాల్సి ఉండగా, ఆ ఆదేశాలను హెచ్‌సిఎ పాటించలేదని వాదనలు వినిపించాయి. ఈ కేసులో టిసిఎకి ఉన్న లోకస్ స్టాండీ అంశంపై కూడా వాదనలు జరిగాయి. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు, బాంబే హైకోర్టు, తెలంగాణ హైకోర్టు గతంలో ఇచ్చిన ఆదేశాలు, అలాగే బిసిసిఐ టిసిఎ ప్రతినిధ్యాలపై గతంలో చేసిన పరిశీలనలను కోర్టు ముందు ప్రస్తావించారు. టిసిఎ తరఫున సీనియర్ న్యాయవాది రాజా శ్రీపతి రావు, ఆయనకు సహాయంగా అడ్వకేట్ ఎస్. సురేందర్ రెడ్డి వాదనలు వినిపించారు. 2021 డిసెంబర్ 18న టిసిఎ బిసిసిఐకి ఇచ్చిన ప్రతినిధ్యాన్ని పరిశీలించి, బిసిసిఐ రాజ్యాంగంలోని రూల్ 31 ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని కోర్టు ఆదేశించాలని వారు అభ్యర్థించారు. అన్ని పక్షాల వాదనలు విన్న అనంతరం, గౌరవ హైకోర్టు ఈ వ్యవహారంలో ఉత్తర్వులను రిజర్వ్ చేసింది.

## టిజిఇఎపి సెట్ కన్వీనర్‌గా తెలంగాణకు చెందిన ప్రొఫెసర్‌ను నియమించాలి


ప్రజాపక్షం/హైదరాబాద్ : టిజి ఇఎపిసెట్ కన్వీనర్‌గా నియమించిన సీమాంధ్ర ప్రాంతానికి చెందిన ప్రొఫెసర్ విజయ కుమార్ రెడ్డిని వెంటనే తొలగించి అర్హత కలిగిన తెలంగాణ ప్రాంతానికి చెందిన ప్రొఫెసర్‌ని కన్వీనర్‌గా నియమించాలని బిసి జనసభ అధ్యక్షులు రాజారామ్ యాదవ్ డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్య వ్యవస్థలో జరుగుతున్న పరిణామాలు రాష్ట్ర ప్రజలను ముఖ్యంగా విద్యార్థులు, తల్లిదండ్రులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి దశాబ్దానికి పైగా గడుస్తున్నప్పటికీ జెఎన్‌టియుహెచ్‌లో అనేక మంది సీనియర్, అర్హత కలిగిన తెలంగాణ ప్రొఫెసర్లు ఉన్నా, వారిని పక్కన పెట్టి ఆంధ్రప్రదేశ్ ప్రాంతానికి చెందిన వ్యక్తిని ఇఎపి సెట్ కన్వీనర్‌గా నియమించడం తెలంగాణ ఆత్మగౌరవానికి, రాష్ట్ర ప్రయోజనాలకు తీవ్రమైన అవమానంగా మారిందని ప్రజలు భావిస్తున్నరన్నారు. ఇఎపిసెట్ కన్వీనర్ నియామకాలు, నిర్వహణపై తక్షణమే స్వతంత్ర, నిష్పక్షపాత విచారణ చేపట్టాలని, వ్యవస్థను దుర్వినియోగం చేశారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని విచారణ పూర్తయ్యే వరకు బాధ్యతల నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రయోజనాలు, తెలంగాణ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, తెలంగాణకు చెందిన అర్హులైన సీనియర్ ప్రొఫెసర్‌ను కన్వీనర్‌గా వెంటనే నియమించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.


## సంక్రాంతికి మరో 11 ప్రత్యేక రైళ్లు



ప్రజాపక్షం/హైదరాబాద్ : సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండటంతో దక్షిణ మధ్య రైల్వే 11 ప్రత్యేక రైళ్లను ప్రకటించింది. ఈ ప్రత్యేక రైళ్లు కాకినాడ టౌన్, వికారాబాద్, పార్వతీపురం, సికింద్రాబాద్ మధ్య జనవరి 7 నుంచి 12, 2026 మధ్య వివిధ తేదీల్లో నడుస్తాయి. కొన్ని రైళ్లు సా యంత్రం లేదా రాత్రి బయలుదేరి మరుసటి రోజు గమ్యస్థానానికి చేరుకుంటా యి. ఈ రైళ్లలో ఎసి, స్లీపర్, జనరల్ బోగీలు ఉంటాయి. కొన్ని రైళ్లకు టికెట్ బు కింగ్ ఈ రోజు ఉదయం 8 గంటల నుంచి ప్రారంభమైంది. సంక్రాంతికి స్వగ్రామాలకు వెళ్లే వారికి ఈ ప్రత్యేక రైళ్లు చాలా ఉపయోగంగా ఉంటాయని రైల్వే అధికారులు తెలిపారు. ప్రయాణానికి ముందు రైలు సమయాలు చూసుకుని టికెట్ బుక్ చేసుకోవాలని సూచించారు.

## ఐఎఎల్ తరుపున బార్ కౌన్సిల్‌కు దుస్సా జనార్ధన్ నామినేషన్






ప్రజాపక్షం/ హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్‌కు జరుగుతున్న ఎన్నికల్లో ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఎఎల్) తరుపున ప్రస్తుత బార్ కౌన్సిల్ సభ్యుడు దుస్సా జనార్ధన్ నామినేషన్ వేశారు. హైకోర్టు ప్రాంగణంలో బార్ అసోసియేషన్‌లో ఆయన నామినేషన్ దాఖలు కార్యక్రమానికి ఐఎఎల్ ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్ హాజరయ్యారు. ఎన్నికల్లో దుస్సా జనార్ధన్‌కు మొద టి ప్రాధాన్యత ఓటును వేయాలని న్యాయవాదులకు ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఎల్ నాయకులు బి.శ్రీనివాస్, కె.వి.ఎల్., శేషగిరి రావు, కె.రామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.


## జిఓ 252లో కొన్ని సవరణలు చేయండి

**మంత్రి పొంగులేటికి టియుడబ్ల్యుజె ప్రతినిధి బృందం అభ్యర్థన**



ప్రజాపక్షం/హైదరాబాద్ : జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డుల విషయంలో, కొత్త మార్గదర్శకాలతో ఇటీవల ప్రభుత్వం జారీ చేసిన జిఓ 252లో కొన్ని సవరణలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టియుడబ్ల్యుజె) కోరింది. టియుడబ్ల్యుజె రాష్ట్ర అధ్యక్షులు కె.విరాహత్ అలీ నేతృత్వంలోని యూనియన్ ప్రతినిధి బృందం సచివాలయంలో రాష్ట్ర రెవెన్యూ, సమాచార, పౌరసంబంధాలు, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసి జిఓపై చర్చించి సవరణల ను సూచిస్తూ వినతిపత్రాన్ని అందించింది. ఈ సందర్భంగా విరాహత్ అలీ మాట్లాడుతూ 252 జిఓను క్షుణ్ణంగా అధ్యయనం చేసి, జర్నలిస్టుల నుండి వ్యక్తమవుతున్న అభ్యంతరాలు, జిఓలో లోటుపాట్లపై చర్చించి, కొన్ని సవరణలు అవసరమనే అభిప్రాయానికి వచ్చినట్లు మంత్రికి తెలిపారు. గతంలో అక్రిడిటేషన్ కార్డులతో డెస్క్ జర్నలిస్టులందరికీ కాకుండా కొందరికి మాత్రమే న్యాయం జరిగేదని, ప్రస్తుతం అలా కాకుండా బస్ పాస్‌లతో సహా ప్రభుత్వం కల్పించే ప్రతి సంక్షేమ పథకం రిపోర్టర్లు, డెస్క్ జర్నలిస్టులనే తేడా లేకుండా, ఎలాంటి వివక్ష లేకుండా ప్రతి డెస్క్ జర్నలిస్టుకు వర్తింపజేసేలా జిఓలో సవరించాలని ఆయన కోరారు. కేబుల్ టీవీ ఛానెల్స్‌కు సంబంధించి, జిఓలో పేర్కొన్న అస్పష్టతను సరిచేయాలన్నారు. గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని ఇతర ప్రధాన నగరాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులకు మండలానికి ఒకటి కాకుండా, సదరు మండలంలో ప్రధాన డేట్‌లైన్‌లను గుర్తిం చి, వాటి ప్రకారం అక్రిడిటేషన్ కార్డులు జారీ చే సేందుకు జిఓను సవరించాలని కోరారు. చిన్న పత్రికలకు సర్క్యులేషన్ ఆధారంగా జిల్లాల్లో కూడా అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయాలన్నా రు. ప్రధాన పత్రికలు, శాటిలైట్ న్యూస్ ఛానెల్స్ కు కార్డుల కుదింపు జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఢిల్లీ కేంద్రంగా పనిచేస్తున్న ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులకు, వీడియో జర్నలిస్టులకు, కెమెరా జర్నలిస్టులకు సంబంధిత కార్యాలయాల సిఫార్సుల మేరకు అందరికీ అక్రిడిటేషన్ కార్డులు జారీచేసే విధంగా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో ఉర్దూ అధికార భాషా అయినందున ఇతర భాషల సర్క్యులేషన్‌లతో, గ్రేడింగ్‌లతో వాటిని పోల్చకుండా, ఉర్దూ పత్రికలు సర్క్యులేట్ అవుతున్న ప్రాంతాలను గుర్తించి, ప్రత్యేక కేటగిరి క్రింద జిల్లా, మండల స్థాయిల్లో ఉర్దూ జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు ఇచ్చేలా జిఓలో పొందుపర్చాల ని కోరారు. వెటరన్, ఫ్రీలాన్స్ జర్నలిస్టులు అక్రిడిటేషన్ కార్డులు పొందడానికి, జిఓలో పేర్కొన్న వృత్తి అనుభవాన్ని కొంత తగ్గిస్తూ సవరించాలని మంత్రిని ఆయన కోరారు. టియుడబ్ల్యుజె అభ్యర్థనపై మంత్రి శ్రీనివాస్ రెడ్డి స్పందిస్తూ, త్వరలో జర్నలిస్టు సంఘాల ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించి, ఏమైనా లోటుపాట్లు ఉంటే సరి చేసుకుందామని హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన ప్రతినిధి బృందంలో టియుడబ్ల్యుజె రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి కల్కూరి రాములు, కార్యదర్శులు కె.శ్రీకాంత్ రెడ్డి, వి.యాదగిరి, కోశాధికారి ఎం.వెంకట్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు ఎ.రాజేష్, ఎండి.గౌస్, హెచ్‌యుజె అధ్యక్షుడు శివ శంకర్ గౌడ్, రాష్ట్ర చిన్న, మధ్య తరహా పత్రికల సంఘం అధ్యక్షులు యూసుఫ్ బాబు, ప్రధా న కార్యదర్శి అశోక్ తదితరులు ఉన్నారు.

**టియుడబ్ల్యుజె సూచనలను పరిశీలిస్తాం**



జిఓ 252పై తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం లిఖిత పూర్వకంగా చేసిన సూచనలను పరిశీలిస్తామని మంగళవారం సచివాలయంలో తనను కలిసిన టియుడబ్ల్యుజె ప్రతినిధి బృందానికి రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలు శాఖ కమిషనర్ ప్రియాంక హామీ ఇచ్చారు. అ సెంబ్లీ సమావేశాల తర్వాత సమావేశాన్ని నిర్వహించి జర్నలిస్టు సంఘాల అభిప్రాయాలు స్వీకరిస్తామని ఆమె తెలిపారు.

## జనవరి 3న అసెంబ్లీ ముట్టడి

- నేడు ఎస్‌వికెలో రౌండ్ టేబుల్ మీటింగ్
- ఆటో సంఘాల జెఎసి పిలుపు



ప్రజాపక్షం/హైదరాబాద్: ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారం కోసం జనవరి మూడో తేదీన జరిగే అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆటో డ్రైవర్ సోదరులందరికీ ఆటో జెఎసి విజ్ఞప్తి చేసింది. సిఐటియు రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం ఆటో జెఎసి నేతలు నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ. ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని కాంగ్రెస్ మేనిఫెస్టోలో హామీ ఇచ్చిందని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత దాని విషయం మర్చిపోయారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఫ్రీ బస్సు పథకాన్ని అమల్లోకి తెచ్చి ఆటో డ్రైవర్ల పొట్ట కొట్టిందని వారు ఆరోపించారు. ఆటో డ్రైవర్లను ఆదుకునే దానికోసం నష్ట పరిహారం ఇస్తామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి ప్రకటన చేశారని గుర్తు చేశారు. కానీ ఇప్పటివరకు దానిపైన ఎటువంటి సహకార చర్యలు తీసుకోలేదని విమర్శించారు. డ్రైవర్స్‌కు సంవత్సరానికి రూ. 12,000 ఇస్తానని ఇచ్చిన హామీని ఇప్పటివరకు అమలు చేయలేదని వారు పేర్కొన్నారు ప్రభుత్వం ఒక యాపు తీసుకొస్తామని ప్రకటన చేసిందని దానికి అను గుణంగా ఎలాంటి ప్రయత్నం కూడా చేయలేదని వారు ఆరోపించారు. ఆటో డ్రైవర్లకు గిరాకీ తగ్గేదానికి కారణమైన రాపిడో బైక్స్ నిషేధించమని కోరితే దాని గురించి ఒక ప్రకటన కూడా చేయలేదని, ఆటో డ్రైవర్ల సంస్థ పరిష్కారం కోసం ఆటో సంఘాల జెఎసి జనవరి మూడో తేదీ చలో అసెంబ్లీ కార్యక్రమానికి పిలిపిస్తుందని, చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని రాష్ట్రంలోని ఆటో డ్రైవర్లు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని జెఎసి విజ్ఞప్తి చేసింది. చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేసే దానికోసమ్ రౌండ్ టేండ్ మీటింగ్ బుధవారం ఎస్‌వికెలో నిర్వహిస్తున్నామని డ్రైవర్ల అందరూ పాల్గొని విజ్ఞప్తి చేశారు. ప్రెస్ మీట్ సమావేశంలో బి.వెంకటేష్ అశోక్ (ఎఐటియుసి) పుప్పాల శ్రీకాంత్,కె.అజయ్ బాబు (సిఐటియు), మారయ్య రామకృష్ణ (బిఆర్‌టియు) ప్రవీణ్, లింగం గౌడ్ ( టియుసిఐ) దయానంద్ రాజశేఖర్ రెడ్డి (ఐఎన్టియుసి) సత్తిరెడ్డి (టిఏడిఎస్) కొండారెడ్డి( టిఎన్‌టియుసి), గడ్డం శ్రీనివాస్ ( గట్స్), (జాగృతి) యూనియన్ నుంచి తదితరులు పాల్గొన్నారు.



## గ్రామీణ అభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర కీలకం

**మంత్రి వాకిటి శ్రీహరి**

ప్రజాపక్షం/హైదరాబాద్ : ముదిరాజ్‌ల ఐక్యత చాటేలా పరేడ్ గ్రౌండ్‌లో సభ ఏర్పాటు చేయాలని మంత్రి వాకిటి శ్రీహరి పిలుపునిచ్చారు. ముదిరాజ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో మంగళవారం జరిగిన ముదిరాజ్ సర్పంచుల సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి వాకిటి శ్రీహరి ఈ సన్మాన సభలో మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ సమాజ అభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలమైనదన్నారు. ప్రజాప్రతినిధులలో సర్పంచులకు మాత్రమే రాజ్యాంగం చెక్ పవర్ కల్పించిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు.ఇప్పుడు సర్పంచులుగా గెలిచిన వారందరూ భవిష్యత్తులో ఎంఎల్‌ఎలుగా, ఎంపిలుగా గెలుపొందాలని ఆశాభావం వ్యక్తం చేశారు. తాను 26 ఏళ్లకే మక్తల్ మేజర్ గ్రామపంచాయతీకి కాంగ్రెస్ పార్టీ నుండి ఎన్నికైన ఏకైక సర్పంచ్ అయ్యానని గుర్తు చేశారు. ముదిరాజ్‌ల ఆలోచన విధానంలో మార్పు వచ్చిందంటే మీరే నిదర్శనమన్నారు. పండుగ సాయన్న స్ఫూర్తితో, కానిస్టేబుల్ ఉద్యమ స్ఫూర్తితో, మహాత్మా జ్యోతిరావు పూలే ఆలోచన విధానంతో,అంబేద్కర్ ఇచ్చిన వాటాతో రాజకీయంగా ముదిరాజ్‌ల్లో అభివృద్ధికి కృషి చేయాలనీ పిలుపునిచ్చారు. జనాభా దామాషా ప్రకారం ముదిరాజులు ఎక్కువగా ఉన్నారు అందుకు అనుగుణంగా అసెంబ్లీలో, పార్లమెంటులో ప్రాతినిథ్యం పెరగాలన్నారు. ఒకవేళ సందర్భంలో మంత్రి పదవి కావాలా లేక బిసి డి నుండి బిసి ఎ చేర్చాలని అడిగితే క్షణం ఆలోచించకుండా మంత్రి పదవి వొదులుకుంటాన్నారు. ఒకవైపు బిసి బిడ్డగా మంత్రిగా అన్ని వర్గాల అభివృద్ధి కోసం పాటుపడుతూనే నా జాతి కోసం ఆలోచిస్తానన్నారు. మంత్రిగా ముదిరాజ్ బిడ్డగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని బిసి ఎలో ముదిరాజులను చేర్చేలా ఒప్పిస్తానన్నారు. త్వరలోనే ముదిరాజుల ఐకత్య చాందుకు పరేడ్ గ్రౌండ్‌లో సభ ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న మల్కాజిగిరి పార్లమెంటు సభ్యుడు ఈటెల రాజేందర్, మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్,ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్,మాజీ ఎంఎల్‌సి కాసాని జ్ఞానేశ్వర్,ముదిరాజ్ సామాజికవర్గ నాయకులు పాల్గొన్నారు.


**సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్**
మెట్రో జోన్, మింట్ కాంపౌండ్ : : హైదరాబాద్ -63.

ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నెం. eMZ-21 (EXTN-II) & eMZ-27(Extn-I) of 2025-26
టెండర్ నోటీస్ నెం. 31/25-26 (పేపర్ నోటిఫికేషన్)

అర్హతగల ఏజెన్సీల నుండి 11kv OH కండక్టర్‌ను UG కేబుల్‌తో భర్తీ చేయడానికి టెండర్లు ఆహ్వానించబడ్డాయి. a) జనరల్ కేటగిరీ eMZ-21/25-26 (Extn-II) కింద 33/11 KV చంచల్‌గూడ SS నుండి వెలువడే 11 KV చంచల్‌గూడ ఫీడర్, b) జనరల్ కేటగిరీ eMZ-22/25-26 (EXTN-II), కింద 33/KV మలక్‌పేట్ గంజ్ SS నుండి వెలువడే 11KV పాల్టన్ ఫీడర్ మరియు c) 33/11 KV ఫీవర్ హాస్పిటల్ SS నుండి eMZ-27/26 (Extn-I) జనరల్ కేటగిరీ కింద వెలువడే 11 KV ఫీవర్ హాస్పిటల్ ఫీడర్ అసలు పనులకు T & D కింద మెరుగుదలలు. దీనికి సంబంధించి మరిన్ని వివరాలను www.tender.telangan.gov.in మరియు www.tgsouthernpower.org వెబ్‌సైట్‌లలో చూడవచ్చు.

సం/- చీఫ్ ఇంజనీర్, ఆపరేషన్ మెట్రోజోన్, హైదరాబాద్.
DIPR R.O. No. : 12775-PP/CL/ADVT/1/2025-26, Date: 30-12-2025

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్** GHMC
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం, శేరిలింగంపల్లి సర్కిల్-49, ఎస్ఎల్‌పి జోన్ :: జిహెచ్ఎంసి

'ఇ' ప్రొక్యూర్‌మెంట్ నోటీసు

NIT No. 43/EE/CIR-49/SLPZ/GHMC/1-2/2025-26 తేది: 29.12.2025

పని కేటగిరి: సివిల్ మరియు ఇతర పనులు, అంచనా విలువ: రూ. 24.85 లక్షలు, బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం: 02.01.2026న మ.03.00గం.ల నుండి 09.01.2026న మ.03.00గం.ల వరకు, అధికారి పేరు & చిరునామా: ఇఇ, సిఐఆర్-49, ఎస్ఎల్‌పిజెడ్, జిహెచ్ఎంసి. 9000115410.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-49, జిహెచ్ఎంసి.
DIPR R.O. No. : 12752-PP/CL/ADVT/1/2025-26, Date: 30-12-2025

## గడ్డిపల్లి కెవికెలో ఉచిత శిక్షణ కోసం దరఖాస్తులు

**ప్రజాపక్షం/గరిడేపల్లి :** సేంద్రీయ వ్యవసాయంపై షెడ్యూల్ (ఎస్‌సి) కులాలకు చెందిన అభ్యర్థుల నుంచి ఉచిత శిక్షణ అందించేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు గడ్డిపల్లి కెవికె సీనియర్ సైంటిస్ట్, హెడ్ ఇంచార్జి డి నరేష్ తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రంలో హైదరాబాద్‌కు చెందిన నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్ (నార్మ్) ఆర్థిక సహకారంతో జనవరి 5 నుంచి 9వ తేదీ వరకు 40 మంది షెడ్యూల్ (ఎస్‌సి) కులాల యువకులు, రైతులకు సేంద్రీయ వ్యవసాయ పద్ధతులపై ఐదు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన షెడ్యూల్ కులాల యువకులు, రైతులు మీ పేరు, గ్రామం, ఆధార్ కార్డు, కుల ధృవీకరణ పత్రాన్ని జతపరిచి తమ పేర్లను నేరుగా కెవికె నందు నమోదు చేసుకోవాలని కోరారు. రైతులకు భోజనం, రవాణా చార్జీలు సదుపాయం కలదన్నారు. రైతులు ఆధార్ కార్డు, పట్టా పాసుబుక్ జిరాక్స్ కాపీలను జతపరుస్తూ తమ పేరును మృత్తిక శాస్త్రవేత్త ఏ కిరణ్ సెల్ 7893989055 నంబర్‌కు సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

## పేదింటి ఆడబిడ్డలకు కాంగ్రెస్ అండ



**ప్రజాపక్షం/దేవరకొండ:** ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం అని దేవరకొండ ఎంఎల్ఎ నేనావత్ బాలునాయక్ అన్నారు. మంగళవారం దేవరకొండ పట్టణంలోని సాయిశివ గార్డెన్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నుండి మంజూరు అయిన కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన 407 మంది లబ్ధిదారులకు రూ. 4కోట్ల7 లక్షలఅరవేల512 విలువగల చెక్కులను లబ్ధిదారులకు ఎంఎల్ఏ బాలునాయక్ అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఒకవైపు ఆర్థికంగా ఒడిదుడుకులను ఎదుర్కొంటూనే రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ముందకు తీసుకువెళ్లడం జరుగుతుందన్నారు.

## స్వర్ణగిరి ఆలయంలో మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే బీర్ల ప్రత్యేక పూజలు





**ప్రజాపక్షం/యాదాద్రి :** తెలంగాణ రాష్ట్ర ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే శ్రీ బీర్ల అయిలయ్య వైకుంఠ ఏకాదశి సందర్భంగా శ్రీ స్వర్ణగిరి వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. ముక్కోటి వైకుంఠ ఏకాదశీ పురస్కరించుకుని యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం స్వర్ణగిరి ఆలయంలో శ్రీ వెంకటేశ్వర స్వామివారిని ఉత్తర ద్వారం గుండా రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ట్రస్ట్ సభ్యులు వారికి ప్రత్యేక స్వాగతం పలికి ఆలయంలోనికి స్వాగతించారు. ముందుగా జల నారాయణ స్వామిని కోనేటిలో దర్శించుకున్నారు. ఆ తర్వాత ఉత్తర ద్వారం నుండి ఆలయంలోకి ప్రవేశించి శ్రీ వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ తర్వాత ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం చేయగా ఆలయ అధికారులు, స్వామి వారి చిత్రపటంతో పాటు లడ్డు ప్రసాదం అందజేశారు.

# భారతగడ్డపై సిపిఐ వీరోచిత పోరాటం

జనవరి 18న ఖమ్మంలో జరిగే సిపిఐ భారీ బహిరంగ సభ జయప్రదం చేయండి

సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి పిలుపు



**ప్రజాపక్షం/మోతెకొండూర్ :** భారత దేశ గడ్డపై భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జనవరి 18న ఖమ్మంలో జరిగే భారీ బహిరంగ సభకు జిల్లా వ్యాప్తంగా ఉన్న పార్టీ సభ్యులు సానుభూతి పరులు పాల్గొని జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం మోటకొండూరు మండల కౌన్సిల్ సమావేశానికి దామోదర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ 1925 డిసెంబర్ 26న కాన్పూర్‌లో ఆవిర్భవించిన భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ భారత గడ్డపై ఎన్నో వీరోచిత పోరాటాలు నిర్వహించిన ఘన చరిత్ర ఉందని, భూమికోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తికై నిరంకుశ నైజాం నవాబులను గద్దె దించడానికి మహోత్తర తెలంగాణ సాయుధ పోరాటంలో నాలుగున్నర వేల మంది ప్రాణ త్యాగాలతో మూడు వేల గ్రామాలను విముక్తి చేసి పది లక్షల ఎకరాల భూమిని పంచిన చరిత్ర సిపిఐదని అన్నారు. భారతదేశంలో సిపిఐ 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఖమ్మంలో నిర్వహించే బహిరంగ సభలో పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన పోరాటాలు ఉద్యమాలను స్మరించుకుంటూ భవిష్యత్తులో నిర్వహించే ఉద్యమాల పట్ల ప్రజలను సంసిద్ధం చేయడానికి బహిరంగ సభ నిర్వహిస్తున్నామని జనవరి 18న ఖమ్మంలో జరిగే భారీ బహిరంగ సభకు జిల్లా వ్యాప్తంగా ఉన్న పార్టీ సభ్యులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఇటీవల నిర్వహించిన గ్రామపంచాయతీ ఎన్నికలలో మోటకొండూరు మండలంలోని వివిధ గ్రామాలలో వార్డు మెంబర్లుగా గెలిచిన సభ్యులను సమావేశంలో ఘనంగా సన్మానించారు. మండల రాధమ్మ అధ్యక్షత వహించిన సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బోలగాని సత్య నారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండీ ఇమ్రాన్, మండల కార్యదర్శి గాదెగాని మాణిక్యం, సహాయ కార్యదర్శులు ఆలేటి బాలరాజు, ముస్కు పెంటా రెడ్డి, మండల కార్యవర్గ సభ్యులు బీరకాయల మల్లేష్, బొల్ల శీను, ఎండీ శంశోద్దీన్, పైళ్ల రామ్ రెడ్డి, బుడిగే సుదర్శన్ సూర్యనారాయణ, నల్ల రాములు, బిక్షం, వెంకన్న, గణేష్ పాల్గొన్నారు.

## ఖరీఫ్‌లో 62,887 మంది రైతుల నుండి ధాన్యం కొనుగోలు

సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** ఈ సంవత్సరం ఖరీఫ్ ధాన్యం సేకరణలో భాగంగా సూర్యాపేట జిల్లాలో 62887 మంది రైతుల నుండి 3లక్షల 27,579.280 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ 202526 ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం సేకరణకు గాను సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా ఐకెపి, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, మెప్మా, ఎఫ్‌పిఓల ఆధ్వర్యంలో 348 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జిల్లా వ్యాప్తంగా 62,887 మంది రైతుల ద్వారా 2లక్షల 27,320.560 మెట్రిక్ టన్నుల సన్న ధాన్యం, లక్ష 258.720 మెట్రిక్ టన్నుల దొడ్డు ధాన్యం మొత్తం కలిపి మూడు లక్షల 27,579.280 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం ప్రకటించిన మద్ధతు ధరకు కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. ఇందుకుగాను రైతులకు ప్రభుత్వం ప్రకటించిన మద్ధతు ధర కింద రూ.782.59కోట్లు చెల్లించడం జరిగిందని, అలాగే బోనస్ కింద మరో రూ.113.65కోట్లు చెల్లిస్తున్నట్లు ప్రకటించారు. జిల్లాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లను పూర్తి చేసినందుకు గాను ఆయన సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది, ఎస్‌హెచ్‌జి, మెప్మా, పిఏసిఎస్ సిబ్బందిని అభినందించారు.

## యూరియా పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు ఉండొద్దు

రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీనివాస్



**ప్రజాపక్షం/ నల్లగొండ:** రబీ సీజన్‌కి సంబంధించి యూరియా పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్ అన్నారు. ఈ రబీ సీజన్లో రైతులకు యూరియా సరఫరా, యూరియాపై ఏర్పాటు చేసిన ఫర్టిలైజర్ బుకింగ్ యాప్‌పై మంగళవారం ఉదయాదిత్య భవన్ లో ఏర్పాటుచేసిన శిక్షణ కార్యక్రమం మరియు సమావేశానికి హాజరయ్యారు.జిల్లాలో యూరియాకు ఎలాంటి కొరత లేదని, రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన అన్నారు. యూరియా కోసం రైతులు గతంలో లాగా క్యూ లైన్ లలో నిలబడాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం తీసుకువచ్చిన ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ రైతులకు ఎంతో సౌకర్యంగా ఉందని తెలిపారు.ఉదయం 6 గంటల నుండే యూరియా అమ్మకాలు ప్రారంభించాలని,యూరియా సరఫరా సక్రమంగా నిర్వహించేందుకు మండల,డివిజన్ స్థాయిలో ప్రత్యేక అధికారులను నియమించడం జరిగిందని తెలిపారు.డీలర్ రైతులు యాప్ ద్వారా బుక్ చేసుకొన్న ఐడి నెంబర్ ఆధారంగా యూరియాను పంపిణీ చేయాలని, ఒకవేళ ఎవరైనా రైతు యాప్లో బుక్ చేసుకోకుండా నేరుగా ఫర్టిలైజర్ కేంద్రానికి వచ్చినట్లయితే రైతులకు సహకరించి యాప్ లో బుక్ చేసుకునే విధంగా చూడాలన్నారు.జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్, జిల్లా సహకార అధికారి పత్యానాయక్,దేవరకొండ ఆర్‌డిఓ రమణా రెడ్డి,పౌరసరఫరాల జిల్లా అధికారి వెంకటేష్,మార్క్ఫెడ్ డిఎం జ్యోతి,వ్యవసాయ సహాయ సంచాలకులు,వ్యవసాయ అధికారులు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల సీఈవోలు,తహసిల్దార్లు తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

## ఇరు కుటుంబాల మధ్య భూతగాదా

రాళ్ళు, కత్తులు, గొడ్డళ్లు, కర్రలతో పరస్పర దాడి

ఇరువర్గాలకూ తీవ్రగాయాలు



**ప్రజాపక్షం/సూర్యాపేట (ఆత్మకూర్(ఎస్)) :** ఇరు కుటుంబాల మధ్య తలెత్తిన భూతగాదా తలెత్తడంతో రాళ్ళు, కత్తులు, గొడ్డంలు, కర్రలతో ఇరువర్గాల వారు పరస్పరం దాడి చేసుకోగా తీవ్రగాయాలైన సంఘటన సూర్యాపేట నియోజక వర్గంలోని ఆత్మకూర్(ఎస్) మండలం పాతర్లపహాడ్ గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. ఈ దాడికి సంబంధించిన వీడియో సోషల్‌మీడియాలో పెద్దఎత్తున వైరల్ అవుతుంది. దీనిని చూసిన వారి ఇంత పాశవికంగా దాడి చేసుకోవడంపై మనుషులా పశువులా అంటూ చర్చించుకుంటున్నారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... పాతర్లపహాడ్ గ్రామంలోని ఒకే కుటుంబానికి చెందిన రక్త సంబంధీకులైన కుంచం మైసయ్య రమేష్‌ల నడుమ పొలం గెట్ల వివాదం తలెత్తింది. దీని పరిష్కారం కోసం ఇరువురు గ్రామంలోని పెద్దమనుషులను ఆశ్రయించి పరిష్కారం కూడా చేసుకున్నారు. కాగా పెద్దమనుషుల తీర్మానాన్ని వ్యతిరేకించిన మైసయ్య తిరిగి భూవివాదానికి దిగడంతో రమేష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పెద్దమనుషులు సైతం పోలీసులను త్వరగా సమస్య పరిష్కరించాలని కోరారు. ఈలోపే ఇరు కుటుంబాల వారు పరస్పరం దూషనలకు దిగి రాళ్ళను విసురుకున్నారు. అనంతరం కత్తులు, గొడ్డంలు, కర్రలతో దాడి చేసుకున్నారు. దీంతో గ్రామంలో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. ఈ దాడిలో వెంకటరమణ అనే మహిళకు తీవ్ర గాయాలు కాగా కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. మరికొంత మందికి గాయాలు కాగా సూర్యాపేట జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

# పని ప్రదేశాల్లో మహిళల రక్షణే ధ్యేయం

అడిషనల్ కలెక్టర్ సీతారామారావు




**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** స్త్రీలను పనిచేసే ప్రదేశాల్లో గౌరవించడం మన సాంప్రదాయమని అదనపు కలెక్టర్ కె సీతారామారావు అన్నారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన పని ప్రదేశంలో లైంగిక వైధింపుల నివారణ, నిషేదం, పరిష్కార చట్టంపై అవగాహన, శిక్షణ కార్యక్రమం సందర్భంగా అదనపు కలెక్టర్ ముఖ్య అతిధిగా పాల్గొని ప్రసంగించారు. పనిచేసే చోట మహిళలకు సురక్షితమైన వాతావరణం కల్పించడం, వారి గౌరవానికి భంగం కలగకుండా చూడటం ప్రతి సంస్థ బాధ్యత అన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో పనిచేస్తున్న మహిళలు తమ హక్కుల పట్ల, చట్టాలపట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఆయన సూచించారు. 10 మంది కంటే ఎక్కువ సిబ్బంది ఉన్న ప్రతి కార్యాలయంలో తప్పనిసరిగా అంతర్గత ఫిర్యాదుల కమిటి (ఐసిసి)ని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మహిళలు ఏదైనా వేధింపులకు గురైతే నిర్భయంగా ఫిర్యాదు చేయాలని కోరారు. 2013 చట్టం ప్రకారం వేధింపులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉందని, మహిళలకు పని ప్రదేశాల్లో ఆత్మగౌరవంతో కూడిన వాతావరణాన్ని అందించడమే ఈ చట్టం ముఖ్య ఉద్ధేశమని వివరించారు. తదుపరి పోశో యాక్ట్ 2013 చట్టం కమిటి చైర్మన్, డిప్యూటి సిఇఓ శిరీష మాట్లాడుతూ మహిళ ఉద్యోగుల పట్ల గౌరవంగా ఉండాలన్నారు. మహిళలను తక్కువగా, చులకనగా చూడటం, సైగలు చేయడం, అసభ్యకరంగా తాకటం, సెల్‌ఫోన్‌లలో అసభ్య మేసెజ్‌లు పంపిస్తే ఇబ్బంది పడకుండా మానసికంగా లోలోపల కుమిలిపోకుండా ధైర్యంగా కమిటి ముందుకు వచ్చి ఫిర్యాదు చేయవచ్చన్నారు. అట్టి ఫిర్యాదులను స్వీకరించి రహస్యంగా ధర్యాప్తు జరిపించి బాధితులకు న్యాయం చేయటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ అధికారి నరసింహారావు, కమిటి సభ్యులు దయానందరాణి, శంకర్ నాయక్, జిల్లా ట్రెజరీ అధికారి రవి కుమార్, కలెక్టరేట్ పరిపాలన అధికారి సుదర్శన్ రెడ్డి, టిఎన్‌జిఓస్ జనరల్ సెక్రటరీ దున్న శ్యామ్ పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయాలి



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ :** విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసేందుకు వైజ్ఞానిక ప్రదర్శన ఎంతగానో ఉపయోగపడుతుందని సూర్యాపేట జిల్లా విద్యాధికారి అశోక్ అన్నారు. మంగళవారం హుజూర్‌నగర్‌లోని వివిఎం పాఠశాల్లో 53వ జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన పోటీలను ఆయన మార్కెట్ చైర్‌పర్సన్ రాధిక అరుణ్ కుమార్ దేశ్ముఖ్‌తో కలిసి ప్రారంభించారు. రెండు రోజుల పాటు జరగనున్న వైజ్ఞానిక ప్రదర్శన తిలకించేందుకు జిల్లాలోని వివిధ పాఠశాలల నుండి విద్యార్థులు, ఉపాధ్యాయులు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ సైదానాయక్, చత్రు నాయక్, మాజీ మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్, వైస్ చైర్మన్ సంపత్‌రెడ్డి, మాజీ ఎంపిపి శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# డంపింగ్ యార్డు తొలగించాలని గ్రామస్థుల ధర్నా



**ప్రజాపక్షం/చిట్యాల :** నల్లగొండ జిల్లా చిట్యాల మున్సిపాలిటి పరిధిలోని 1వ వార్డులో గల శివనేనిగూడెం గ్రామ శివారులో ఏర్పాటు చేసిన చెత్త డంపింగ్ యార్డును మున్సిపల్ అధికారులు వెంటనే తొలగించాలని డిమాండ్ చేస్తూ గ్రామస్థులు మంగళవారం మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం ముందు చెత్తను డంప్ చేసి నిరసనను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన అఖిల పక్ష నాయకులు పాల్గొని మాట్లాడుతూ డంపింగ్ యార్డు కారణంగా గ్రామ ప్రజలు అనేక రోగాల బారిన పడుతున్నారని, దుర్వాసనతో అతలాకుతలం అవుతున్నారని అన్నారు. చెత్తను తగులపెడుతుండటం వల్ల దట్టమైన పొగ గ్రామాన్ని అలముకొంటుందన్నారు. అనేక సంవత్సరాలుగా చెత్త డంపింగ్ యార్డును తొలగించాలని విజప్తులు చేసినా అధికారులు నిమ్మకు నీరెత్తని విధంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మధ్య కాలంలో డంపింగ్ కేంద్రాన్ని తొలగింపు విషయంలో జిల్లా కలెక్టర్, శాసన సభ్యులు, మాజీ శాసనసభ్యులను కలిసినా హామీలు ఇచ్చారే తప్ప పని జరగడం లేదన్నారు. ఈ విషయంపై మున్సిపల్ కమీషనర్ దండు శ్రీను మాట్లాడుతూ డంపింగ్ యార్డు తరలింపు విషయంపై పై అధికారులకు నివేదిక పంపడం జరిగిందని రెండు, మూడు రోజులలో చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళనకారులు తమ నిరసనను విరమించుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రుద్రవరం లింగస్వామి, రుద్రవరం సునీల్, బొబ్బలి సుధాకర్‌రెడ్డి, యాదయ్య, నరేష్, నాగిళ్ళ స్వామి పాల్గొన్నారు.

## పేకాట రాయుళ్ల అరెస్టు

రూ.2,650 నగదు,ఐదు స్మార్ట్ ఫోన్లు స్వాధీనం :

వివరాలు వెల్లడించిన డిఎస్‌పి కె శివరాంరెడ్డి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** బహిరంగ ప్రదేశంలో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి అరెస్టు చేయడం జరిగిందని నల్లగొండ డిఎస్‌పి కె శివరాంరెడ్డి తెలిపారు.జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ ఆదేశానుసారం వన్‌టౌన్ పరిధిలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న, వ్యక్తులపై నిఘా పెట్టడం జరిగింద జరిగిందన్నారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ ఈ క్రమంలో మంగళవారం నల్లగొండ పట్టణంలోని మిర్యాలగూడ రోడ్డులో ఉన్న గరుడాద్రి కాలనీలో కొంతమంది వ్యక్తులు బహిరంగ ప్రదేశంలో డబ్బులు పెట్టి జూదం ఆడుతున్నారని సమాచారం రాగా పట్టణ వన్ టౌన్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్ రెడ్డి సిబ్బందిసం యుక్తంగా వెళ్లి పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను పట్టుబడి చేయడానికి ప్రయత్నించగా,అందులో ఒక వ్యక్తి పోలీస్ వారిని గ్రహించి పారిపోవడం జరిగినదని తెలిపారు. మిగిలిన ఐదుగురిని చాకచక్యంగా పట్టుబడి చేసి వారి వద్ద నుంచి 2650 రూపాయల నగదు, ఐదు స్మార్ట్ ఫోన్లు, పేకాట ఆడటానికి ఉపయోగించిన 103 పేక ముక్కలను స్వాధీనం చేసుకుని, ఆరుగురి వ్యక్తులపై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు.

## చట్టసభల్లో బిసి రిజర్వేషన్లు 50 శాతం సాధించడమే లక్ష్యం



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** చట్టసభల్లో బిసి రిజర్వేషన్లు 50 శాతం స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు సాధించేంత వరకు పోరాటం చేయాల్సిన అవసరం ఉందని బిసి హక్కుల సాధన సమితి సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు దంతాల రాంబాబు అన్నారు. మంగళవారం ఆయన సూర్యాపేట జిల్లా కేంద్రంలో తహశీల్దార్ కార్యాలయం ముందు బిసి హక్కుల సాధన సమితి ఆందోళనలో జరిగిన ధర్నాను ఉద్దేశించి ప్రసంగించారు. త్వరలో జరగనున్న మున్సిపల్, ఎంపిటిసి, జడ్‌పిటిసి ఎన్నికల్లో బిసిలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాలని ఇక ముందు జరిగే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లోగా దేశవ్యాప్తంగా చట్టసభల్లో అసెంబ్లీ పార్లమెంట్‌కు బిసి కులాల వారికి 50 శాతం రిజర్వేషన్ సాధించే వరకు పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బిసి హక్కుల సాధన సమితి జిల్లా నాయకులు దేశగాని హేమలత, కడియం శ్రీనివాస్, కోలగాని వీరన్న పాల్గొన్నారు.

## 2025వ సంవత్సరంలో 8 దఫాలుగా మొబైల్ మేళా

సూర్యాపేట జిల్లా ఎస్‌పి కె నరసింహ్మా

**ప్రజాపక్షం/సూర్యాపేట :** 2025వ సంవత్సరంలో 8వ దఫా మొబైల్ మేళా నిర్వహించి రికవరీ చేసిన మొబైల్స్‌ను బాధితులకు అందించామని జిల్లా ఎస్‌పి కె నరసింహ తెలిపారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో సెల్‌ఫోన్ రికవరీ మేళా ఏర్పాటు చేసి జిల్లాలో ప్రజలు వివిధ రూపాల్లో పోగొట్టుకున్న సుమారు రూ.20లక్షల విలువైన 104 ఫోన్లను గుర్తించి రికవరీ చేసి జిల్లా ఎస్‌పి చేతుల మీదుగా సంబంధిత మొబైల్ ఫోన్ల యజమానులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు శాఖ ప్రజల రక్షణలో నిరంతరాయంగా కృషి చేస్తుందన్నారు. ఫోన్‌లను గుర్తించడంలో సిబ్బంది పటిష్టంగా పనిచేస్తున్నారని చెప్పారు. ప్రజల రక్షణలో కుటుంబాలకు దూరంగా ఉంటూ పనిచేస్తున్న పోలీసుల సేవలను ప్రజలు గుర్తించాలని కోరారు. పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న సైబర్ వారియర్స్, టెక్ టీం సిబ్బంది, రిసెప్షన్ సిబ్బంది నిరంతర శ్రమ ఫలితంగానే మొబైల్ ఫోన్లను రికవరీ చేసి ఇవ్వగలుగుతున్నామన్నారు. మొబైల్ చోరీకి గురైనా, పోగొట్టుకున్నా అందులో ఉన్న సమాచారం పోతుందని తెలిపారు. పోయిన మొబైల్స్‌ను గుర్తించడానికి సిఇఐఆర్ పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని, ఈ పోర్టల్ ద్వారా మంచి ఫలితాలు రాబట్టడం జరిగిందని వివరించారు. జిల్లాలో వివిధ రూపాల్లో వినియోగదారులు పోగొట్టుకున్న మొబైల్ ఫోన్స్‌ను సిఇఐఆర్ అప్లికేషన్ ద్వారా రికవరీ చేసి బాధితులకు అప్పగించడంలో కృషి చేస్తున్న ఐటి కోర్ సిబ్బందిని, పోలీస్ స్టేషన్ సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్‌పి రవీందర్ రెడ్డి, డిసిఆర్‌బి డిఎస్‌పి రవి, ఐటి కోర్ ఆర్‌ఎస్‌ఐ రాజశేఖర్ సిబ్బంది ఉన్నారు.




# దొంగతనం కేసు చేధించిన పోలీసులు

ఇద్దరు నిందితుల అరెస్ట్, 10తులాల బంగారం స్వాధీనం

సిఐ బీసన్న వివరాలు వెల్లడి




**ప్రజాపక్షం/డిండి:** డిండి మండలం వీరబోయిన పల్లి గ్రామంలో మూడు సంవత్సరాల క్రితం జరిగిన 10.5 తులాల బంగారం దొంగిలించిన కేసును డిండి పోలీసులు చేధించారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిఐ బీసన్న మాట్లాడుతూ డిండి మండలంలోని వీరబోయినపల్లి గ్రామానికి చెందిన తుమ్మల పద్మ భర్త వెంకటయ్య(48) తేది 15/02/2022 రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి అక్రమంగా చొరబడి బీరువాలో ఉన్న 10.5తులాల బంగారాన్ని దొంగిలించనట్లు తెలిపారు. ఆ సమయంలో కుటుంబ సభ్యుల మధ్య అంతర్గత తగాదాలు కొనసాగుతుండడంతో, కుటుంబ సభ్యులే బంగారం తీసి ఉంటారని భావించి గ్రామ పంచాయతీ నిర్వహించగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయలేదు. తేది 16/12/2025న వీరబోయినపల్లి గ్రామంలోనే బాధితురాలి ఇంట్లోకి నిందితుడు జంగ పరశురాములు మరోసారి దొంగతనం చేయడానికి ప్రయత్నించగా కుటుంబ సభ్యులు అతడిని గమనించి గుర్తుపట్టారు. ఈ సందర్భంగా గతంలో జరిగిన బంగారం దొంగతనానికి కూడా ఇతడే కారణమై ఉండవచ్చని అనుమానంతో డిండి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో మొత్తం ఘటన వెలుగులోకి వచ్చింది. బాధితుల ఫిర్యాదు మేరకు డిండి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి విచారణ చేపట్టగా నిందితులైన జంగా పరశురాములు తండ్రి లక్ష్మయ్య, కేతావత్ నరసింహా తండ్రి చత్రపతిలు నేరాన్ని తామే చేసినట్లు విచారణలో అంగీకరించడంతో వారి వద్ద నుండి 10 తులాల బంగారాన్ని స్వాధీనం చేసుకొని, నిందితులను రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు. ఈ కేసును సత్వరంగా, సమర్ధవంతంగా చేధించిన డిండి ఎస్ఐ బాలకృష్ణ, హెడ్ కానిస్టేబుల్ సైదులు, కానిస్టేబుల్ శ్రవణ్, వెంకటేష్‌లను జిల్లా ఎస్పి అభినందించారు.

## సిసిఐ కొనుగోలు కేంద్రంలో దళారులదే రాజ్యం...

అధికారులు చర్యలు తీసుకోవాలని రైతుల నిరసన



**ప్రజాపక్షం/డిండి:** సిసిఐ కొనుగోలు కేంద్రంలో దళారుల రాజ్యం నడుస్తుందని రైతుల పత్తి కొనుగోలు కేంద్రంలో కొనకుండా ఆంక్షలు పెడుతున్నారని తక్షణమే సిసిఐ సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని బిఆర్‌ఎస్ మండల నాయకులు, ఎర్రగుంటపల్లి సర్పంచ్ మల్‌రెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. మంగళవారం డిండి మండల పరిధిలోని బ్రహ్మణపల్లి తిరుమల కాటన్ మిల్లు వద్ద రైతులతో కలిసి ఆందోళన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సిసిఐ అధికారులు పత్తి కొనుగోలు విషయంలో దళారుల దగ్గర కమిషన్ తీసుకొని పత్తి కొనుగోలు చేస్తున్నారని, రైతులు పండించి తీసుకువచ్చిన పత్తిని మాత్రం లేనిపోని ఆంక్షలు విధించి పత్తి కొనుగోలు చేయడం లేదని అన్నారు. దళారుల వద్ద కమిషన్లకు అలవాటుపడిన అధికారులు రైతుల వద్ద ఏ మాత్రం కమీషన్లు రావని, రైతులు తీసుకువచ్చిన పత్తిని కొనుగోలు చేయకుండా పక్కకు పెడుతున్నారని తక్షణమే సిసిఐ ఉన్నతాధికారులు సంబంధిత మిల్లు యాజమాన్యం, సిసిఐ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## న్యూ ఇయర్ వేడుకలకు ఢిల్లీలో ట్రాఫిక్ నిబంధనలు

**న్యూఢిల్లీ:** నూతన సంవత్సర వేడుకల సందర్భంగా న్యూఢిల్లీలో ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేస్తున్నారు. రహదార్లపై వాహన రద్దీ నియంత్రించడం కోసం ఢిల్లీ పోలీసులు బుధవారం నుండి అమలు చేసే ట్రాఫిక్ ఆంక్షల వివరాలను మంగళవారం ప్రకటించారు. పలు ప్రాంతాలలో వాహనాల పార్కింగ్‌లపై ఆంక్షలు, వాహనాలను దారి మళ్లించడం, ప్రత్యేక పార్కింగ్ ఏర్పాట్లు వంటి చర్యలు తీసుకున్నారు. కన్నాట్‌ప్లేస్‌లో ఇప్పుడున్న పార్కింగ్‌లకు అదనంగా ప్రత్యేక పార్కింగ్ ఏర్పాట్లు చేశారు. కన్నాట్‌ప్లేస్, ఆ పరిసర ప్రాంతాలకు కొత్త సంవత్సరం సందర్భంగా డిసెంబరు 31వ తేదీన భారీ సంఖ్యలో ప్రజలు వచ్చే అవకాశం ఉందని పోలీసులు అంచనావేసి ఈ ఏర్పాట్లు చేశారు.గుంపులు, పాదచారులసంఖ్య చాలా విపరీతంగా ఉంటుందని కూడా అంచనావేశారు. డిసెంబరు 31వ తేదీ రాత్రి ఏడు గంటల నుండి ఈ ట్రాఫిక్ ఆంక్షలు అమలులోకి వస్తాయి. నిర్దేశిత ప్రాంతాలవరకూ తప్ప అంతకుమించినస్థాయిలో ఏ వాహనాన్నీ ముందుకు వెళ్ళకుండా పోలీసులు ఆంక్షలు విధించారు.

నాగ్‌పూర్ పురపాలక ఎన్నికల్లో

## కాంగ్రెస్, ఎన్‌సిపి (ఎస్‌పి) వేర్వేరుగా పోటీ



**నాగ్‌పూర్:** మహా వికాస్ అఘాడీ (ఎంవిఎ) భాగస్వాములైన కాంగ్రెస్, ఎన్‌సిపి (ఎస్‌పి) నాగ్‌పూర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో విడివిడిగా పోటీ చేయనున్నాయి. మిత్రపక్షమైన కాంగ్రెస్ 15 సీట్లు కేటాయించలేదని శరద్ పవార్ నేతృత్వంలోని పార్టీ ఆరోపించింది. నాగ్‌పూర్ ఎన్‌సిపి (ఎస్‌పి) అధ్యక్షుడు దునేశ్వర్ పేథే మంగళవారం మాట్లాడుతూ సోమవారం రాత్రి వరకు కాంగ్రెస్ నాయకులతో చర్చలు జరిగాయని తెలిపారు. అయితే, ఆ తర్వాత నాయకులు తమ ఫోన్ కాల్స్‌కు స్పందించడం మానేశారని, ఇది వారు పొత్తు పెట్టుకోవడానికి ఇష్టపడటం లేదని సూచిస్తోందని ఆయన పిటిఐ వీడియోస్‌తో అన్నారు. ఎన్‌సిపి (ఎస్‌పి) మొదట 25 సీట్లు డిమాండ్ చేసిందని, చివరికి 15 సీట్లలో పోటీ చేయడానికి అంగీకరించిందని, అయినప్పటికీ కాంగ్రెస్ తమ డిమాండ్‌ను పట్టించుకోలేదని పేథే చెప్పారు. కాంగ్రెస్ బిజెపికి సహాయం చేయాలనుకుంటోందని, అందుకే మాతో పొత్తు పెట్టుకోవద్దని నిర్ణయించుకుందనిపిస్తోందని ఎన్‌సిపి (ఎస్‌పి) నాయకుడు ఆరోపించారు. 2017లో జరిగిన 151 మంది సభ్యులున్న నాగ్‌పూర్ పౌర సంస్థ ఎన్నికల్లో బిజెపి 108 సీట్లు, కాంగ్రెస్ 28, బిఎస్‌పి 10, శివసేన (అవిభక్త) 2, ఎన్‌సిపి (అవిభక్త) ఒక సీటు గెలుచుకున్నాయి. మహారాష్ట్రలోని 29 మున్సిపల్ కార్పొరేషన్లకు జనవరి 15న ఎన్నికలు జరగనున్నాయి, మరుసటి రోజు ఓట్ల లెక్కింపు జరుగుతుంది. నామినేషన్ల దాఖలుకు మంగళవారం చివరి తేదీ కాగా, జనవరి 2 ఉపసంహరణకు చివరి తేదీ, అభ్యర్థుల తుది జాబితాను జనవరి 3న ప్రచురిస్తారు.

## గిరిజన సమాజాభివృద్ధికి విద్యే కీలకం

- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- గుమ్లా జిల్లాలో జరిగిన సభలో ముర్ము ప్రసంగం
- జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల నుండి భారీ సంఖ్యలో హాజరైన గిరిజనులు



**గుమ్లా (జార్ఖండ్) :** గిరిజన సమాజాభివృద్ధి విద్య ప్రాముఖ్యతను మంగళవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గట్టిగా నొక్కిచెప్పారు. వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను పొందడానికి విద్యావంతులు ప్రజలకు సహాయం పడాలని ఆమె అర్థించారు. జార్ఖండ్‌లోని గుమ్లా జిల్లాలో జరిగిన అంతర్‌రాజ్య జనసాంస్కృతిక్ సమాగం సమారోహ్‌కార్తీక్ జాత్ర (అంతర్‌రాష్ట్ర జానపద సాంస్కృతిక సభలో రాష్ట్రపతి ముర్ము ప్రసంగించారు. ఈ సభకు అధిక సంఖ్యలో గిరిజన రాష్ట్రమైన జార్ఖండ్ సహా ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రం నుండి కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా ముర్ము ప్రసంగిస్తూ గిరిజన వర్గాల సమగ్రాభివృద్ధికి కేంద్రం కృషి చేస్తోందని, తద్వారా అభివృద్ధి సమాజంలోని చిట్టచివరి వ్యక్తికి కూడా చేరుతుందని ఆమె వివరించారు. విద్య అభివృద్ధికి కీలకమని, విద్య వ్యక్తిత్వాన్ని కూడా మెరుగుపరుస్తుందన్నారు. అంతేకాకుండా, విద్య అభివృద్ధికి అవకాశాలను సృష్టిస్తుందని, సమ్మిళిత వృద్ధికి, సామాజిక న్యాయం కోసం ఒక మాధ్యమంగా మారుతుందని తెలిపారు. చదువుకున్న తర్వాత చాలామంది పట్టణాలలో స్థిరపడతారని, వారి గ్రామాలకు తిరిగి వెళ్లడానికి ఇష్టపడరనే విషయాన్ని తాను గమనించానన్నారు. మనం మన గ్రామాలను సందర్శించి ప్రభుత్వ పథకాలు, వాటి ప్రయోజనాల గురించి అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకతను ముర్ము నొక్కిచెప్పారు. ప్రభుత్వం తన పనిని తాను చేసుకుంటూ పోతుందని, కానీ విద్యను పొందిన తర్వాత మనం కూడా మనవంతు సహకారం అందించాలని కోరారు. ప్రజలు వాటి గురించి తెలుసుకున్నప్పుడే ప్రభుత్వ పథకాలు విజయవంతం అవుతాయని ముర్ము చెప్పారు. ఈ ప్రభుత్వం గిరిజన సమాజం సమగ్ర వృద్ధిని విశ్వసిస్తుందన్నారు. అభివృద్ధిని సమాజంలోని చివరి వ్యక్తి వరకూ తీసుకెళ్లడానికి కృషిచేస్తుందన్నారు. ప్రభుత్వం బిర్సాముండా పేరుతో అనేక పథకాలను ప్రారంభించిందన్నారు. గిరిజన ప్రజలకు మాత్రమే కాకుండా ఇప్పటికీ ప్రాథమిక సౌకర్యాలు లేని వారికి కూడా ప్రయోజనం చేకూర్చడానికి వారికి గృహనిర్మాణం, తాగునీరు, రోడ్లు, పాఠశాలలు వంటి అన్ని సౌకర్యాలు కల్పించేలా ప్రభుత్వం ఒక మిషన్ మోడ్‌లో పనిచేస్తుందన్నారు. గుమ్లాలో జరిగిన విశ్వవిద్యాలయం డిమాండ్‌పై ముర్ము మాట్లాడుతూ తాను ప్రయత్నాలు చేస్తానని అభయమిచ్చారు. అయితే రాష్ట్ర ప్రజల డిమాండ్‌ను నెరవేరుస్తుందనే ఆశాభావాన్ని ఆమె వ్యక్తంచేశారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మూడు రోజుల పర్యటన నిమిత్తం ఆదివారం రాత్రి జార్ఖండ్‌కు చేరుకున్నారు. రాష్ట్రపతి దౌప్రదిముర్ము సోమవారం 22వ తూర్పు సింగ్‌భమ్ జిల్లా జంషెడ్‌పూర్ నగర శివార్లలోని కరాండిహ్‌లోని డిషోమ్ జహర్తన్ ప్రాంగణంలో జరిగిన 22వ సంతాలీ భాషకు చెందిన ఓ ల్ చికి లిపి శతాబ్ది ఉత్సవాలలో ఆమె ప్రసంగించారు. అదే రోజు ఆమె నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ 15వ స్నాతకోత్సవానికి కూడా హాజరయ్యారు. మంగళవారం సాయంత్రం రాష్ట్రపతి ఢిల్లీకి వెళ్లనున్నారు. అంతకుముందు రోజు జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ ఆయన సతీమణి కల్పనా సోరెన్‌లతో కలిసి రాంచీలోని లోక్‌భవన్‌లో రాష్ట్రపతిని కలిశారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ సంతోష్‌కుమార్ గాంగ్వార్, ఛత్తీస్‌గఢ్ గవర్నర్ రామెన్ దేకా, ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయి ఉన్నారు.

మాజీ ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్‌కు

## అధికార నివాసం ఇవ్వలేదు

**న్యూఢిల్లీ:** జగదీప్ ధన్‌కర్ ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేసి ఆరునెలలు గడచినప్పటికీ ఇంతవరకూ ఆయనకు ప్రత్యామ్నాయ అధికార నివాసం కేటాయించలేదు! ఆయన సన్నిహితులు మంగళవారం ఈ విషయం చెప్పారు. ఆరోగ్య కారణాల రీత్యా జగదీప్ ధన్‌కర్ ఈ ఏడాది జులై 21వ తేదీన ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేశారు. వర్షాకాల సమావేశాల ప్రారంభం రోజునే ఆయన రాజీనామా సమర్పించారు. కొన్ని వారాల తర్వాత సెప్టెంబరులో ఉపరాష్ట్రపతి అధికార నివాసాన్ని ఆయన ఖాళీ చేశారు. దక్షిణ ఢిల్లీలోని ఛత్తర్‌పూర్ ప్రాంతంలో ఉన్న ఒక ప్రైవేటు ఫామ్‌హౌస్‌కు ఆయన మకాం మార్చారు.“కానీ ఇంతవరకూ ఆయనకు అధికార నివాసం కేటాయించలేదు” అని ఆయన సన్నిహితుడు ఒకరు ఆవేదన వ్యక్తం చేశారు. ఒక మాజీ ఉపరాష్ట్రపతి హోదాలో ధన్‌ఖర్‌కు నెలకు దాదాపు రూ.2 లక్షల వరకూ పెన్షన్ ఇస్తారు. ఎనిమిదో కేటగిరీ బంగళాను కూడా కేటాయించాలి. ఒక వ్యక్తిగత కార్యదర్శిని, ఒక అదనపు వ్యక్తిగత కార్యదర్శిని, ఒక వ్యక్తిగత సహాయకుణ్ణి, ఒక ఫిజీషియన్, ఒక నర్సింగ్ అధికారి, నలుగురు వ్యక్తిగత పనిసిబ్బందిని కూడా ఆయనకు కేటాయించాల్సి ఉంది. ఒక మాజీ ఉపరాష్ట్రపతి గనుక మరణిస్తే ఆయన భార్యకు ఏడో కేటగిరీకి చెందిన ఇంటిని సమకూరుస్తారు.

బెంగాల్‌లో బంగ్లాదేశీయుల

## చొరబాట్లను ప్రోత్సహిస్తున్న మమత

- అమిత్ షా ఆరోపణ
- రాష్ట్రంలో రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం మాదే!



**న్యూఢిల్లీ :** పశ్చిమ బెంగాల్‌లోని మమతా బెనర్జీ ప్రభుత్వం బంగ్లాదేశీయుల చొరబాట్లను ప్రోత్సహిస్తోందని, ఇది గత కొన్ని సంవత్సరాలుగా రాష్ట్ర జనాభా స్వరూపాన్ని ప్రమాదకరంగా మార్చిందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆరోపించారు. కోల్‌కతాలో మంగళవారం అమిత్ షా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ చొరబాట్లపై పశ్చిమ బెంగాల్ ప్రజలు ఆందోళన చెందుతున్నారని, 2026లో రాష్ట్రంలో మూడింట రెండు వంతుల మెజారిటీతో అధికారంలోకి వచ్చిన తర్వాత బిజెపి దీనిని అంతం చేస్తుందని అన్నారు. తాము చొరబాటుదారులను గుర్తించడమే కాకుండా, వారిని బయటకు తరిమేస్తామని, ప్రజలు తమ మనసు మార్చుకున్నందున ఏప్రిల్ 15, 2026 తర్వాత బెంగాల్‌లో కొత్త బిజెపి ప్రభుత్వం ఏర్పడుతుందని షా పేర్కొన్నారు. భారతదేశం—బంగ్లాదేశ్ సరిహద్దులో కంచె నిర్మాణాన్ని కేంద్రం పూర్తి చేయలేకపోవడానికి కారణం పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం అవసరమైన భూమిని అందించకపోవడమేనన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత తూర్పు సరిహద్దుల నుండి చొరబాట్లను ఆపి, బెంగాల్ పునరుజ్జీవనాన్ని నిర్ధారిస్తామని షా చెప్పారు. పశ్చిమ బెంగాల్‌లో బిజెపి మూడింట రెండు వంతుల మెజారిటీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని చెప్పారు. ‘సర్’ ప్రక్రియ కారణంగా మతువా సామాజికవర్గానికి చెందిన భయపడాల్సిన అవసరం లేదని షా అన్నారు. మతపరమైన హింసకు గురైన శరణార్థులందరికీ దేశంలో ఆశ్రయం కల్పిస్తామని హామీనిచ్చారు. మమతా బెనర్జీ కూడా మతువాలకు హాని చేయలేరు అని అన్నారు. భయం, హింస రాజకీయాలను స్థాపించడంలో టిఎంసి వామపక్షాలను మించిపోయిందని షా ఆరోపించారు. ఇప్పటివరకు 300 మందికి పైగా బిజెపి కార్యకర్తలు హత్యకు గురయ్యారని, 3,000 మందికి పైగా బిజెపి కార్యకర్తలు ఇప్పటికీ తమ ఇళ్లకు తిరిగి రాలేకపోతున్నారని, టిఎంసి జెండా పట్టుకుంటేనే వారినే అక్కడ ఉండనిస్తామని వారిపై ఒత్తిడి తెస్తున్నారని ఆరోపించారు. ప్రజాధనాన్ని స్వాహా చేసిన ఆరోపణలపై టిఎంసి అగ్ర నాయకులు జైళ్లకు వెళ్లారని, వారి ఇళ్లలో స్వాధీనం చేసుకున్న నగదు లెక్కించే యంత్రాలు వేడెక్కడం వల్ల పనిచేయడం మానేశాయని షా అన్నారు. ‘భయం, అవినీతి, దుర్పరిపాలన స్థానంలో సుపరిపాలనను తీసుకురావాలని బెంగాల్ ప్రజలు సంకల్పించారు’ అని ఆయన అన్నారు. పశ్చిమ బెంగాల్ ఆర్థిక వ్యవస్థ అపూర్వమైన పతనానికి గురైందని, 7,000 కంటే ఎక్కువ పరిశ్రమలు పారిపోయాయని షా ఆరోపించారు. ‘బెంగాల్ ప్రజలు కాంగ్రెస్, వామపక్షాలు, టిఎంసిలకు పాలించే అవకాశాలు ఇచ్చారు, ఇప్పుడు బిజెపికి కూడా ఒక అవకాశం ఇవ్వాలని కోరుతున్నాను అని ఆయన అన్నారు.

## బెంగాల్‌కు దుశ్శాసనుడు వచ్చారు!

- అమిత్ షా పర్యటనపై మమతా బెనర్జీ ఫైర్



**కోల్‌కతా :** బెంగాల్ పర్యటనలో భాగంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఘాటుగా స్పందించారు. బిజెపి నేతలను మహాభారతంలోని దుర్యోధన, దుశ్శాసన లాంటి పౌరాణిక పాత్రలతో పోల్చారు. బంగ్లాదేశ్ సరిహద్దులో కంచె ఏర్పాటు చేయడానికి తృణమూల్ ప్రభుత్వం భూమి ఇవ్వడం లేదన్న కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వ్యాఖ్యలను తిప్పికొట్టారు. సరిహద్దుల్లో కంచె నిర్మించేందుకు పెట్రాపోల్, అండాల్‌లో తమ ప్రభుత్వం భూమిని కేటాయించిందని గుర్తు చేశారు. బంకురా జిల్లాలో ఏర్పాటు చేసిన ర్యాలీలో పాల్గొన్న మమతా బెనర్జీ, అమిత్ షా నిప్పులు చెరిగారు. ‘శకుని శిష్యుడైన దుశ్శాసనుడు సమాచారం సేకరించేందుకు బంగాల్‌కు వచ్చారు. ఎన్నికలు రాగానే దుశాసన, దుర్యోధనలు ఇద్దరు కనిపిస్తారు. ఈరోజు వచ్చి మమతా బెనర్జీ భూమి ఇవ్వట్లేదని వారు చెబుతున్నారు. మరి పెట్రాపోల్, అండాల్‌కు భూమిని ఎవరు ఇచ్చారు? 14 ఏళ్ల క్రితం ఇక్కడ పరిస్థితులు ఎలా ఉన్నాయో ఒకసారి గుర్తు చేసుకోండి. ఈ సమయంలో బంకురాలో ఎంతో అభివృద్ధి జరిగింది. నీటి ఎద్దడిని అధిగమించాం. ఇంకా కేవలం బంగాల్ నుంచే ఆక్రమణదారులు వస్తున్నారని అన్నారు. మరి అదే నిజమైతే పహల్గాంలో దాడులు చేసింది మీరేనా? దిల్లీ ఉగ్రదాడి వెనుక ఎవరు ఉన్నారు?’ అని మమత ప్రశ్నించారు.

### ‘సర్’ వల్ల బెంగాల్‌లో 60మందికి పైగా మృతి

‘ఎఐ ఆధారంగా చేస్తున్న ఎస్ఐఆర్ ప్రక్రియ ఒక పెద్ద మోసం. ఓటర్ జాబితాలో నుంచి నిజమైన ఒక్క ఓటర్‌ను తొలగించినా ఎన్నికల సంఘాన్ని ముట్టడిస్తాం. ఎస్ఐఆర్ వల్ల బెంగాల్‌లో సుమారు 60మందికి పైగా మరణించారు. పత్రాలు వెరిఫికేషన్ పేరిట వృద్ధులను కార్యాలయాల చుట్టూ తిప్పుతున్నారు. ఇలాంటి వేధింపులను బంగాల్ ప్రజలు సహించరు. బంగాల్‌లో అధికారంలో వచ్చేందుకు బిజెపిని ప్రజలు అనుమతించరు. ఎన్నికల సమయంలో వారు బంగారు బంగాల్ చేస్తామని హామీ ఇచ్చారు. కానీ ఇతర రాష్ట్రాల్లో బంగాలీ మాట్లాడుతుంటే దాడులు చేస్తున్నారు’ అని మమతా బెనర్జీ ఆరోపించారు. 14 సంవత్సరాలుగా భయానికి, అవినీతికి పశ్చిమ బెంగాల్ గుర్తింపుగా మారిందన్న అమిత్‌షా వ్యాఖ్యలను మమతా తప్పుబట్టారు. 14 ఏళ్లలో బంగాల్‌లో నీటి సంక్షోభాన్ని పరిష్కారం చూపడంతో పాటు ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు.

## షా అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు...

- టిఎంసి సీనియర్ నేత, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బ్రాత్య బసు



**కోల్‌కతా :** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలలో మూడింట రెండు వంతుల మెజారిటీ సాధిస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని, నిరాధారమైన వాదనలు చేస్తున్నారని తృణమూల్ కాంగ్రెస్ ఆరోపించింది. టిఎంసి సీనియర్ నేత, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బ్రాత్య బసు మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ షా వ్యాఖ్యలు నిరాధారమైన వాదనలపై ఆధారపడి ఉన్నాయని, ఈ ఎన్నికలలో బిజెపి 50 సీట్ల మార్కును కూడా దాటదని పేర్కొన్నారు. ‘షా ఒక పర్యాటకునిలా వస్తూ పోతూ ఉంటారు. ఇలాంటి పర్యటనల వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదు’ అని బసు ఒక కార్యక్రమం సందర్భంగా అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి 50 సీట్ల మార్కును కూడా దాటదని, ఘోర పరాజయాన్ని చవిచూస్తుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో మహిళల భద్రతపై షా చేసిన వ్యాఖ్యలను సీనియర్ టిఎంసి నాయకురాలు, మంత్రి శశి పంజా విమర్శిస్తూ దుర్గా పూజ, క్రిస్మస్ వంటి పండుగల సమయంలో వేలాది మంది మహిళలు స్వేచ్ఛగా తిరుగుతూ ఉత్సవాల్లో పాల్గొనేటప్పుడు బెంగాల్‌ను సందర్శించాలని కేంద్ర హోంమంత్రిని కోరారు. ఒకవేళ ఏదైనా అవాంఛనీయ ఘటన జరిగితే, మా అధికార యంత్రాగం నేరస్థులను పట్టుకోవడానికి తక్షణ చర్యలు తీసుకుంటుందని, దానికి బదులుగా, బిల్కిస్ బానో అత్యాచార నిందితులకు మీ పార్టీ కార్యకర్తలు పూలమాలలు వేస్తారన్నారు. అఘాయిత్యాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న కుల్దీప్ సెంగార్, బ్రిజ్ భూషణ్‌లకు మీ పార్టీ రక్షణ కల్పిస్తుందని, అమిత్ జీ మహిళల భద్రతపై ఉపన్యాసాలు ఇవ్వకూడదని అని అన్నారు. దోషులుగా తేలిన అత్యాచార నిందితులకు కఠినమైన శిక్ష పడేలా చేసే అపరాజిత బిల్లు ఆమోదానికి కేంద్రంలోని షా, ఆయన పార్టీ అడ్డుపడుతున్నారని పంజా ఆరోపించారు.

## నిందితులకు ఉరి లేదా యావజ్జీవశిక్ష

- డెహ్రాడూన్‌లో జాత్యాహంకార దాడిలో మృతి చెందిన కుటుంబ సభ్యుల డిమాండ్




**అగర్తలా:** డెహ్రాడూన్‌లో జాత్యాహంకా ర దాడిలో అంజెల్ చక్మా (24) అనేక యువకుడు హత్యకు గురైన విషయం వి దితమే. అయితే ఆయన కుటుంబం, ఈ ఘటనలో ప్రమేయం ఉన్న నిందితులందరికీ మరణశిక్ష లేదా కనీసం యావజ్జీవ కారాగార శిక్ష విధించాలని డిమాండ్ చేసింది. ఉనకోటి జిల్లాలోని మచ్మారాకు చెందిన అంజెల్, అగర్తలాలోని హోలీ క్రా స్ స్కూల్‌లో తన గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన తర్వాత ఎంబిఎ చదవడానికి డెహ్రాడూన్‌కు వెళ్ళాడు. అక్కడ తన తమ్ముడు మైఖేల్ కళ్ల ముందే అతన్ని కత్తితో పొ డిచి చంపారు. ‘మేము అంజెల్‌ను తిరిగి పొందలేము, కానీ ఈ దారుణమైన హ త్యలో ప్రమేయం ఉన్నవారికి మరణశిక్ష లేదా కనీసం యావజ్జీవ కారాగార శిక్ష విధించాలని అతని కుటుంబం కోరుకుంటోంది. తాను ఒక భారతీయుడినని అ ంజెల్ పదే పదే చె ప్పినప్పటికీ, దుండగులు నిర్దాక్షిణ్యం గా అతని వీపుపై రెండుసార్లు కత్తితో పొడిచి, మెడ విరిచారు. దీంతో 17 రోజుల పాటు మృ త్యువుతో పోరాడి అతను మరణించాడు“ అని అంజెల్ మే నమామ మోమెన్ చక్మా అన్నారు. ఈశాన్య రాష్ట్రాల ప్రజలు జాతి విద్వేష నేరాలను ఎదుర్కోకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కులం, మతంతో సంబంధం లేకుండా మ చ్మారా ప్రజలు మంగళవారం అంజెల్ జ్ఞాపకార్థం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిం చి, అతని కుటుంబానికి న్యాయం చేయాలని కోరినట్లు మోమెన్ చెప్పారు. మణిపూర్‌లో పనిచేస్తున్న బిఎస్ఎఫ్ జవాన్ అయిన తన తండ్రి తరుణ్ ప్రసాద్ చక్మాకు, తనకు ఉద్యోగం రాగానే స్వ చ్ఛంద పదవీ విరమణ తీసుకోమని అంజెల్ చెప్పాడని మోమెన్ అన్నారు. డిసెంబర్ 26న జరిగిన ఈ దురదృష్టకర ఘటనతో కుటుంబం మంచి జీవితం గడపాలనే కల పూర్తిగా చెల్లాచెదురైందని సంఘటన జరిగిన వెంటనే డెహ్రాడూన్‌కు వెళ్లిన మోమెన్ అన్నారు.

గణతంత్ర వేడుకలకు సన్నాహాలు

## 2,406 మంది ఎన్‌సిసి కేడెట్లకు శిక్షణ

**న్యూఢిల్లీ:** వచ్చేనెల గణతంత్ర దినోత్సవ వేడుకలలో పాల్గొనే ఎన్‌సిసి (నేసనల్ కేడెట్ కోర్) కేడెట్‌లకు శిక్షణా శిబిరం మంగళవారం న్యూఢిల్లీలో ప్రారంభమైంది. ఈసారి ఉత్సవాలలో 28 రాష్ట్రాలు, ఎనిమిది కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన 898 మంది బాలికలు సహా మొత్తం 2,406 మంది కేడెట్స్ నెలరోజులపాటు జరిగే ఈ శిక్షణా కార్యక్రమాల్లో పాల్గొంటారు. అదేవిధంగా మొత్తం 25 మిత్ర దేశాల నుండి కేడెట్స్, అధికారులు కూడా ఈ ఉత్సవాల్లో పాల్గొంటారు. దేశాలమధ్య యువతరాన్ని పరస్పరం సాంస్కృతిక అధ్యయనాల నిమిత్తం మార్పిడి చేసుకునే కార్యక్రమాల్లో భాగంగా విదేశీ కేడెట్స్, అధికారులు కూడా గణతంత్ర వేడుకల్లో పాల్గొంటారని న్యూఢిల్లీలో అధికారులు చెప్పారు. ఢిల్లీ కంటోన్మెంట్‌లోని కరియప్ప పరేడ్ గ్రౌండ్‌లో క్యాంప్—2026 ప్రారంభమైంది. “సర్వ ధర్మపూజ” చేయడంతో ఈ శిక్షణా శిబిరాన్ని ప్రారంభించినట్లు సీనియర్ అధికారి ఒకరు చెప్పారు. ఇంత భారీ సంఖ్యలో ఎన్‌సిసి కేడెట్స్ గణతంత్ర ఉత్సవాల్లో పాల్గొనడం ఇదే మొదటిసారి అని రక్షణ మంత్రిత్వశాఖ ఒక ప్రకటనలో తెలియజేసింది. నెలరోజులు జరిగే ఈ శిక్షణలో అనేకమైన ఇంటర్—డైరెక్టరేట్ పోటీలు, ఈవెంట్లు జరుగుతాయి. ఉత్తమ కేడెట్‌ల ఎంపిక పోటీలు కూడా జరుగుతాయి. చిన్నపాటి ఆయుధాలను ఫైరింగ్ చేయడం, కర్తవ్యపథ్‌లో వేడుకల సందర్భంగా మార్చింగ్ చేయడం, ఫ్లాగ్ ఏరియా నిర్దేశకాలు వంటి అంశాల్లో ఈ శిక్షణ ఉంటుంది. ప్రతిష్టాత్మకమైన ఈ శిక్షణా శిబిరంలో పాల్గొనేందుకు వివిధ రాష్ట్రాల నుండి ఎంపికైన విద్యార్థులకు ప్రారంభ కార్యక్రమం సందర్భంగా లెఫ్టినెంట్ జనరల్ వీరేంద్ర వత్స్ (ఎన్‌సిసి డైరెక్టర్ జనరల్) స్వాగతం పలికారు. వారికి అభినందనలు తెలియజేశారు.ఈ వేడుకల సందర్భంగా కేడెట్స్ అతున్నతస్థాయి ప్రమాణాలతో కూడిన సౌశీల్యాన్ని, సమగ్రతను, నిరాపేక్ష సేవలను, మైత్రీస్ఫూర్తిని, కులాలు, మతాలు, ప్రాంతాలు, భాషలకు అతీతంగా ఉమ్మడి బృంద సేవా కార్యక్రమాలను చేసి చూపించాలని విజ్ఞప్తి చేశారు. ఐక్యత, క్రమశిక్షణలను ఈ వేడుకల ద్వారా కేడెట్లు ప్రపంచానికి చాటి చెప్పాలని కోరారు.

‘మహా’ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల సీట్ల పంపకాల చర్చలు విఫలం..

## అధికార బిజెపి-శివసేన కూటమి మైత్రికి బీటలు

- జనవరి 15న జరుగనున్న ఎన్నికల్లో ‘ఒంటరి పోరు’కు నిర్ణయం

**ముంబయి :** మహారాష్ట్ర మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల పొత్తుకు సంబంధించిన సీట్ల పంపకాలలో విభేదాలు తలెత్తి అధికార బిజెపి, శివసేనల కూటమి మైత్రికి బీటలు వారాయి. ఇరు పార్టీల మధ్య ఛత్రపతి శంభాజీనగర్, పుణే మున్సిపల్ కార్పొరేషన్ల సీట్ల పంకాల చర్చలు విఫలమై జనవరి 15న జరుగనున్న ఎన్నికలకు ఒంటరి పోరాటాన్ని మిగిల్చాయి. బిజెపి శివసేన రెండు పార్టీలు మహారాష్ట్ర అధికార మహాయుతిలో భాగస్వాములుగా ఉన్న విషయం తెలిసిందే. అయితే ఈ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలకు సంబంధించిన సీట్ల పొత్తు చర్చలు విఫలమై ఇరుపార్టీల నేతల ఎడమొహం పెడమొహానికి బీజం వేసిందనడంలో అతిశయోక్తిలేదు. ఈ కారణంగా ఇరుపార్టీల నేతలు ఒకరిపై మరొకరు నిందలు వేసుకోవడం అందరి దృష్టినీ అటువైపు మరల్చింది. ఛత్రపతి శంభాజీనగర్‌లో శివసేన ఎమ్మెల్యే, కేబినెట్ మంత్రి సంజయ్ శిర్సాత్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో బిజెపికి పెరుగుతున్న బలం కారణంగా ఏర్పడిన ‘అహంకారం’ కారణంగానే ఆ పొత్తును తెంచుకుందని అన్నారు. స్థానిక ఎన్నికలకు బిజెపితో పొత్తు పెట్టుకోవాలని శివసేన పార్టీ నిరంతరం పట్టుబడుతోందని, ఈ ప్రాంత ఓటర్లు కూడా అదే అభిప్రాయాన్ని పంచుకున్నారని సంజయ్ శిర్సాత్ చెప్పారు. అయితే కొంతమంది స్థానిక బిజెపి నాయకులు ఉద్దేశపూర్వకంగా కూటమిని విచ్ఛిన్నం చేశారని, ఆ పొత్తు ముగిసినందుకు తాము ఎంతగానే బాధపడుతున్నామని శివసేన మంత్రి ఇక్కడ విలేకరులకు వెల్లడించారు. వివాదాస్పద సీట్లపై ప్రతిష్ఠంభనను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో చర్చలు జరిపినప్పటికీ ఉద్దేశపూర్వకంగానే ఈ అంశాన్ని పునరుద్ధరించారని ఆయన ఆరోపించారు. బిజెపి ఒకవైపు తన సొంత అభ్యర్థులను సిద్ధం చేసుకుంటూనే మరొకవైపు సీట్ల పంపకాల చర్చలను కొనసాగించిందని, శివసేనను ‘చీకటిలో ఉంచి’ ప్రయోజనం పొందిందని మండిపడ్డారు. శిర్సాస్ మాట్లాడుతూ శివసేన ఇప్పుడు తన అభ్యర్థులందరినీ నామినేషన్ ఫారాలను దాఖలు చేయాలని కోరిందని, అడ్డంకుల గురించి ఆందోళన వ్యక్తం చేసిందని శిర్సాత్ తెలిపారు. శివసేనపై బురద చల్లవద్దని హెచ్చరిస్తూ ఒకవేళ అలాంటి దాడిచేస్తే శివసేన కూడా అదేరీతిలో సమాధానం చెబుతుందని హెచ్చరించారు. కాగా, శివసేన ఆరోపణలను తోసిపుచ్చిన బిజెపి మంత్రి అతుల్ సేవ్ శివసేన నాయకులు పదేపదే తమ వైఖరిని మార్చుకుంటున్నారని ఆరోపించారు. బిజెపి కార్పొరేటర్లు వరుసగా గెలుస్తున్న స్థానాలను శివసేన నాయకులు కోరుతున్నారని, వారి అహంకారమే రెండు పార్టీల మధ్య విభజనకు దారితీసిందని అతుల్‌సేవ్ వ్యాఖ్యానించారు. పొత్తుపట్ల బిజెపి ఇంకా ఆసక్తిగానే ఉందని, అయితే నామినేషన్లకు కొన్ని గంటల సమయం మాత్రమే మిగిలి ఉన్నందున శివసేన ముందుకు రావాల్సి ఉంటుందని బిజెపి మంత్రి అతుల్ సేవ్ కోరారు. బిజెపి నాయకుడు, రాజ్యసభ ఎంపి భగవత్ కరాడ్ కూడా ఇలాంటి అభిప్రాయాలనే వ్యక్తం చేశారు.

## బెంగాలీ మాట్లాడే వారిపై దాడులు ఆపండి

- ప్రధాని మోదీకి కాంగ్రెస్ నాయకుడు అధిర్ రంజన్ చౌదరి విజ్ఞప్తి



**న్యూఢిల్లీ:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కాంగ్రెస్ నాయకుడు అధిర్ రంజన్ చౌదరి మంగళవారం కలిశారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో బెంగాలీ మాట్లాడే ప్రజలపై జరుగుతున్న ‘దాడుల’ సమస్యను, పశ్చిమ బెంగాల్‌లోని వెనుకబడిన మతువా సమాజం ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించారు. పశ్చిమ బెంగాల్ మాజీ కాంగ్రెస్ అధ్యక్షుడైన చౌదరి, ఇటువంటి ‘దాడులను’ ఆపడానికి ప్రధానమంత్రి జోక్యం చేసుకోవాలని కోరారు. ఈ దాడులు రాష్ట్రంలో మత ఉద్రిక్తతలకు, హింసకు దారితీయవచ్చని ఆయన అన్నారు. సమావేశం అనంతరం అధిర్ విలేకరులతో మాట్లాడుతూ వలస కార్మికుల సమస్యను, అలాగే మతువా సమాజం ఎదుర్కొంటున్న సమస్యలను కూడా తాను ప్రస్తావించినట్లు ఆ మాజీ ఐదుసార్లు ఎంపి తెలిపారు. ప్రధానమంత్రి స్పందన గురించి అడగగా, పరిస్థితిని గమనిస్తున్నానని, ఇలా జరగకూడదని హామీ ఇచ్చారని చెప్పారు. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు జరిగిన ఈ సమావేశం రాజకీయ ప్రాముఖ్యత గురించి అడగగా, ఎలాంటి రాజకీయ ప్రాముఖ్యత లేదన్నారు. కొన్ని రోజుల క్రితం ఢిల్లీకి వచ్చాను, యాదృచ్ఛికంగా ఆయనను కలిసే అవకాశం లభించిందని చెప్పారు. చౌదరి మోదీకి ఒక లేఖను అందజేశారు, అందులో దేశంలోని కొన్ని ప్రాంతాలలో బెంగాలీ మాట్లాడే ప్రజలను ‘చొరబాటుదారులుగా’ చూస్తున్నారని ఆరోపించారు. ‘వారు బెంగాలీ భాషలో మాట్లాడటమే వారి ఏకైక నేరం. సంబంధిత అధికారులు వారిని పొరుగున ఉన్న బంగ్లాదేశ్‌కు చెందిన వ్యక్తులుగా తరచుగా తప్పుగా భావించి, చొరబాటుదారులుగా పరిగణిస్తున్నారు’ అని ఆయన లేఖలో పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్‌లోని అనేక ప్రాంతాలలో ముస్లిం జనాభా అధికంగా ఉందని, అవి బంగ్లాదేశ్‌తో సరిహద్దును పంచుకుంటున్నాయని, దేశంలోని ఇతర ప్రాంతాలలో ఇటువంటి దాడుల ఫలితంగా ఈ ప్రాంతాలలో వర్గాల మధ్య మత ఉద్రిక్తతలు పెరుగుతున్నాయని చెప్పారు. కాంగ్రెస్ నాయకుడికి సన్నిహిత వర్గాల ప్రకారం, బిజెపి పాలిత రాష్ట్రాల్లో బెంగాలీ మాట్లాడే ప్రజలను లక్ష్యంగా చేసుకుంటున్నారనే ఆరోపణల సమస్యను ఆయన ప్రస్తావించారు. దేశంలోని ఇతర ప్రాంతాల నుండి వచ్చిన వలస కార్మికులపై వివక్ష, హింస, వేధింపులకు వ్యతిరేకంగా అన్ని రాష్ట్ర ప్రభుత్వాలను సున్నితంగా వ్యవహరించేలా చేయాలని ఆయన ప్రధానమంత్రిని కోరారు. పశ్చిమ బెంగాల్‌లోని ముర్షిదాబాద్ జిల్లాలోని జంగీపూర్ ప్రాంతానికి చెందిన 30 ఏళ్ల వలస కార్మికుడు జ్యువెల్ రానా, బుధవారం ఒ డిశాలోని సంబల్‌పూర్‌లో బీడి విషయంలో జరిగిన వాగ్వాదంలో హత్యకు గురయ్యాడు. ముంబయిలో ఇద్దరు వలస కార్మికులను బంగ్లాదేశ్ నుండి వచ్చిన అక్రమ వలసదారులు అనే అనుమానంతో అరెస్టు చేశారు. పశ్చిమ బెంగాల్ వలసదారుల సంక్షేమ బోర్డు కూడా 10 నెలల్లో, ముఖ్యంగా బిజెపి పాలిత రాష్ట్రాల్లో వేధింపులకు సంబంధించి 1,143 ఫిర్యాదులు అందినట్లు తెలిపింది.

ప్రజాపక్షం
బుధవారం, 31 డిసెంబరు

# వెనిజులాపై ట్రంప్ యుద్ధ సన్నాహం

దక్షిణ అమెరికాలో వామపక్ష పరిపాలనలోని వెనిజులాపై దురాక్రమణ యుద్ధానికి అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సన్నాహాలు ముమ్మరం చేస్తున్నట్లు తాజా పరిణామాలు సూచిస్తున్నాయి. అమెరికాకు మాదక ద్రవ్యాల అక్రమరవాణాను అరికట్టే పేరుతో నాలుగు మాసాలుగా సముద్రాల్లో యుద్ధ నౌకలను మోహరించి వెనిజులా నుంచి క్రూడ్ ఆయిల్‌తో వెళుతున్న ఓడల ను అడ్డగించటం, స్వాధీనం చేసుకుంటూ వెనిజులాపై దిగ్బంధం అమలు చేస్తున్న ట్రంప్ ఆదేశాలపై తాజాగా సరుకులు నింపే ఓడరేవుపై అమెరికా యుద్ధ విమానాలు బాంబులు పేల్చాయి. అంతర్జాతీయ న్యాయచట్టాలను ధిక్కరించి కారకాస్ భూభాగంపై తొలిసారి జరిగిన ఈ దాడి యుద్ధ విస్తరణను సూచిస్తున్నది.

ఇరాక్‌లో అణు, క్రిమి ఆయుధాలున్నాయనే అమెరికా ఆరోపణను ఐరాస అణుశక్తి సంస్థ తనిఖీలు నిరాకరించినా అదే తప్పుడు ఆరోపణతో ఆ దేశంపై దురాక్రమణ యుద్ధానికి ఒడిగట్టిన రీతిలోనే, ఇప్పుడు అమెరికాలోకి మత్తుమందుల స్మగ్లింగ్ ఆరోపణతో వెనిజులాపై ట్రంప్ ఒత్తిడి పెంచుతున్నాడు. ఆయన లక్ష్యం వెనిజులా ఆయిల్ నిక్షేపాలను సొంతం చేసుకోవటం, అందుకు అడ్డుగా ఉన్న అధ్యక్షుడు నికోలస్ మదురోను కూలద్రోసి తైనాతీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయటం. తాము నిషేధించిన వెనిజులా ఆయిల్ టాంకర్లు బయటకు వెళ్లకుండా 'సంపూర్ణ దిగ్బంధం' ప్రకటిస్తూ డిసెంబర్ 16న ట్రంప్ తన సొంత సోషల్ మీడియా ట్రూత్‌లో పెట్టిన పోస్టులో ...''ఆయిల్, ఆయిల్''అని 8సార్లు ప్రస్తావించారు. అందువల్ల మత్తుపదార్థాల స్మగ్లింగ్ ఆరోపణకు కరేబియన్‌లో అమెరికా యుద్ధ సన్నాహాలకు సంబంధం ఏమైనా ఉందా? అది సాకు మాత్రమే. ప్రపంచంలో కనుగొనబడిన ఆయిల్ నిక్షేపాల్లో 18శాతం వెనిజులా భూభాగంలో ఉన్నాయి. ''అమెరికా నుంచి వెనిజులా లోగడ అపహరించిన ఆయిలు, భూమి, ఇతర ఆస్తులు అమెరికాకు తిరిగి ఇవ్వాలని'' ట్రంప్ డిమాండ్ చేశారు. ''అపహరించిన ఆయిలు క్షేత్రాలు'' అంటే సుమారు 20 ఏళ్లక్రితం అధ్యక్షుడు హుగో ఛావెజ్ జాతీయం చేసిన ఆయిలు పరిశ్రమ అని అర్థం. 1999లో అమెరికా నియంత్రణ నుంచి స్వతంత్ర పంథా ఎంచుకున్న వెనిజులాలో వామపక్ష ప్రభుత్వాన్ని కూలద్రోయటం ఆయిలు నిక్షేపాల స్వాధీనాన్ని మించిన సామ్రాజ్యవాద ఇతర లక్ష్యాలను నెరవేర్చుతుంది. పశ్చిమార్ధగోళంపై అమెరికా ఆధిపత్య శిబిరాన్ని పునర్నిర్మాణం చేయటానికి ట్రంప్ ప్రయత్నిస్తున్నాడు. ఆయన సుంకాల యుద్ధాలు, ఆంక్షలు విధించే విధానాలు, కొత్త జాతీయ భద్రత వ్యూహం – ఇవన్నీ ఉత్తర, దక్షిణ(లాటిన్) అమెరికాలో అమెరికా గుత్తపెట్టుబడికి ఎదురులేకుండా చేయటం, హైటెక్ ఆర్థిక వ్యవస్థకు అవసరమైన మార్కెట్లు, ప్రకృతి వనరులపై అజమాయిషీకి హామీ కల్పించేందుకు ఉద్దేశించినవే. ఇందులో భాగంగానే ఎన్నికలు జరుగుతున్న లాటిన్ అమెరికా దేశాల్లో జోక్యం చేసుకుంటూ తాను బలపరిచిన అధ్యక్ష అభ్యర్థికి ఓటు వేస్తేనే ఆర్థిక సహాయం అనే బ్లాక్ మెయిలు అమలు జరుపుతున్నాడు ట్రంప్. అర్జెంటైనా, బొలీవియా, ఈక్వెడార్, పరాగ్వే, పెరూ, తాజాగా చిలీ, హోండూరస్‌లలో అమెరికా మిత్ర ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చాయి.

ఈ నేపథ్యంలో ట్రంప్ ఇప్పుడు వెనిజులా గొంతునొక్కే పనిలో ఉన్నారు. ఇది సఫలమైతే పనిలో పనిగా క్యూబాను కూడా దెబ్బతీయవచ్చు. క్యూబాకు వెనిజులా ప్రధాన ఇంధన వనరు గా ఉంది. మాదక ద్రవ్యాల స్మగ్లింగ్ సాకుగాచూపి నాలుగు నెలలుగా వెనిజులాపై కవ్వింపు చర్యలకు పాల్పడుతున్న ట్రంప్ ప్రభుత్వం తాజాగా దాని ఓడరేవుపై దాడి చేసింది. పడవులకు మాదక ద్రవ్యాలు ఎత్తుతున్నారన్న సాకుతో ఈ దాడి జరిగింది. ఈ దాడికి ట్రంప్ స్వయంగా సిఐఎకు అధికారమిచ్చారు. అధ్యక్షుడు మదురో ట్రంప్ యుద్ధోన్మాదాన్ని ఖండిస్తూ, సామ్రాజ్యవాదం, ఫాసిస్టు మితవాదులు వెనిజులాను వలసగా మార్చుకుని దాని ఆయిలు, గ్యాస్, బంగారం తదితర సంపదను కొల్లగొట్టచూస్తున్నారని పేర్కొన్నారు.

ట్రంప్ యుద్ధోన్మాదంపట్ల అమెరికన్ ప్రజల్లో ఆగ్రహం ఉన్నా అది వ్యక్తం కావటం లేదు. చట్టరీత్యా నిరోధించేందుకు కాంగ్రెస్‌లో కొందరు ప్రయత్నిస్తున్నారు. కమ్యూనిస్టుపార్టీ ఆఫ్ అమెరికా ఒక ప్రకటనలో, ''కార్పొరేట్ శక్తులకు లాభాలు చేకూర్చేందుకై ఆయిలు కోసం అనంతమైన మరో యుద్ధం ఈ ప్రాంతానికీ, ప్రపంచానికీ ప్రమాదం'' అని హెచ్చరించింది. ప్రపంచంలో యుద్ధాలను తానే ఆపుతున్నానని గొప్పలు చెప్పుకుంటున్న అధ్యక్షుడు ట్రంప్ తమ స్వార్థానికై వెనిజులాపై యుద్ధానికి దిగటాన్ని ప్రపంచంలోని శాంతికాముకులందరూ ఖండించాలి.

# 'పాలమూరు–రంగారెడ్డి' చుట్టూ రాజకీయ చక్రం!



ఉజ్జిని రత్నాకర్ రావు
9490952646

పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పొలిటికల్ ఎజెండాగా మారింది! ఈ పథకంపై జనవరి 2, 3 తేదీలలో అసెంబ్లీ వేదికగా చర్చ జరుగుతున్న నేపథ్యంలో రాజకీయ ప్రెస్టేజీలకు పోకుండా.. గత ప్రభుత్వం 9 సంవత్సరాలలో పూర్తి చేయలేదనే.. ఆరోపణలు పక్కకుపెట్టి ప్రస్తుతం అధికారంలోనున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకా ఏమాత్రం ఆలస్యం చేయకుండా ప్రాజెక్టుకు అన్ని అనుమతులు పొందుతూ.. పూర్తిస్థాయిలో నిధులను కేటాయిస్తూ రాబోవు రెండు సంవత్సరాల కాలంలో పూర్తి చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు.

**పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు రూపకల్పన:**

ఈ పథకానికి 2015 జూన్ 11న ఆనాటి సిఎం కెసిఆర్ మహబూబ్ నగర్ జిల్లా భూత్పూర్ మండలం కరివేనా దగ్గర పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఉమ్మడి మహబూబ్ నగర్, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల్లో 12.30 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరందించటానికి రూ. 35,200 కోట్ల అంచనా వ్యయంతో రూపొందించారు. శంకుస్థాపన సందర్భంగా జరిగిన బహిరంగసభలో మూడు సంవత్సరాలలో పూర్తి చేసి పాలమూరును శస్యశ్యామలం చేస్తామని వాగ్దానం చేశారు. ఈ ప్రాంతం నుండి కరువుతో వలసలకు పోతున్న జిల్లా ప్రజలు కృష్ణా జలాలు త్వరలో అందబోతున్నాయని హర్షధ్వానాలతో సంతోషాన్ని వ్యక్తం చేస్తూ తెలంగాణ ఉద్యమ నాయకుని వాగ్దానాలు అమలు చేస్తారని ఆశతో ఎదురుచూస్తూ వచ్చారు. కానీ, నేటికీ పదిన్నర సంవత్సరాలు పూర్తవుతుంది. పాలకుల మాటలు ఎండమావిగానే ఈనాటికి నెరవేరకపోవడంతో జిల్లా ప్రజలు పాలకులపై తీవ్ర ఆగ్రహం వెలిబుచ్చుతున్నారు.

**పాలమూరు చుట్టూ రాజకీయాలు :**

గత కొన్ని రోజులుగా రాష్ట్ర రాజకీయాలు పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు చుట్టే తిరుగుతున్నాయి. అధికార ప్రతిపక్ష పార్టీలు విమర్శలు, ప్రతి విమర్శలు చేసుకుంటున్నాయి. మూడేళ్లలో పూర్తి చేయాల్సిన ప్రాజెక్టు పనులు పదిన్నర సంవత్సరాలైనా ఎందుకు పూర్తి కాలేదనేది పాలకులకు అంతుపట్టని విషయం. రాజకీయంగా మైలేజీ పొందడం కోసం ఆరాటం తప్ప ప్రాజెక్టు పూర్తి చేయాలని తపన గత, ప్రస్తుత ప్రభుత్వానికి లేదనేది సత్యం. వలసలకు పేరుగాంచిన పాలమూరు ప్రజలకు సాగు, త్రాగు నీరందించే ప్రాజెక్టుల పట్ల తీవ్ర నిర్లక్ష్యం కొనసాగుతుంది. అధికారంలో ఉన్నన్ని రోజులు పూర్తి చేయకుండా గత బిఆర్ఎస్ ప్రభుత్వం రైతులను నట్టేట ముంచిందని అధికార కాంగ్రెస్ పార్టీ అంటుంటే.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోనికి వచ్చి రెండేండ్లయినా తట్టెడు మట్టి తీయలేదని బిఆర్ఎస్ పార్టీ అంటుంది. రెండు పార్టీల వాదనలోనూ నిజం లేకపోలేదు. ఎందుకంటే పడకేసిన ప్రాజెక్టు పనులు మన కళ్లెదుటే కనిపిస్తున్నాయి. ఈ ప్రాజెక్టు నిర్మాణంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ సిఎం ప్రతిపక్షనేత కెసిఆర్, కాంగ్రెస్–బిఆర్ఎస్ నేతల మధ్య హాట్‌హాట్‌గా మాటల యుద్ధం నడుస్తుంది. ఈ ప్రాజెక్టులో చేపట్టవలసిన పనులు! ఐదు రిజర్వాయర్లు, పంప్ హౌస్‌లు, ప్రధాన కాలువలు, డిస్ట్రిబ్యూటర్ కెనాల్స్ వగైరా పనులను 18 ప్యాకేజీలుగా విభజించి గుత్తేదారులకు అప్పగించారు. బిఆర్ఎస్ ప్రభుత్వం దిగిపోయే నాటికి రూ.27వేల కోట్లు ఖర్చుచేసి 9 సం.ల కాలంలో 40 శాతం పనులు మాత్రమే పూర్తి చేశారు.

**ఇంకా జరుగవలసిన పనులు:** 9 సంవత్సరాల బిఆరెఎస్ అధికారంలో ఉండి అప్రోచ్ కెనాల్ నుంచి రిజర్వాయర్లు నింపే ఓపెన్ కెనాల్ పనులు పూర్తి కాలేదు. మొదటి రిజర్వాయర్ నార్లపూర్ నుండి 16 కిలోమీటర్ల టన్నెల్, 8.3 కిలోమీటర్ల ఓపెన్ కెనాల్ పూర్తి చేయాల్సి ఉంది. ఓపెన్ కెనాల్ ఇంకా 2.50 కిలోమీటర్లు తవ్వాలి.15 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి తవ్వాల్సి ఉంది. లింకు కెనాల్సు తీయకుండా ఉద్దండాపూర్ వరకు ఐదు రిజర్వాయర్లు నింపి సాగునీరు ఇవ్వడం కష్టం. ముంపుకు గురైన సాగు భూములకు న్యాయపరమైన పరిహారం ఇవ్వాలని నిర్వాసితులు రెండేళ్లపాటు ఆందోళన చేస్తున్నారు. రైతులు కోర్టుకు వెళ్లారు. నార్లాపూర్, ఏదుల, వట్టెం కరివేనా, ఉద్దండాపూర్ రిజర్వాయర్లు నిండాలంటే ముందు కుడికిళ్ల దగ్గర ప్రధాన కాల్వ పూర్తి చేయాల్సి ఉంది.

**ప్రధాన కాలువల పనులు పూర్తి చేయాలి:**

పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు ద్వారా 12.30 లక్షల ఎకరాల ఆయకట్టు లక్ష్యం నెరవేరాలంటే ప్రధాన కాలువలతో పాటు ప్రధాన కాలువల డిస్ట్రిబ్యూటర్లు పూర్తి చేయాల్సి ఉంది. ఇప్పటివరకు చిన్న కాలువల ఊసే లేదు. ప్రధాన రిజర్వాయర్ల నుంచి మెయిన్ కాలువల ద్వారా చిన్న కాలువలు నిర్మించకుంటే 100% సాగు భూములకు నీరు అందడం కష్టమే. 10 ఏళ్లయిన సాగునీటి సరఫరాకు అవసరమైన చిన్న కాలువలను తీయడానికి పాలకులు చర్యలు మొదలు పెట్టలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రధాన కాలువలతో పాటు డిస్ట్రిబ్యూటర్లపై దృష్టి పెట్టాలి. ప్రధాన కాలువలు సైతం త్వరితగతిన పూర్తిచేయాలని రైతాంగం కోరుతున్నారు.

**పూర్తికాని ప్రాజెక్టుకు ప్రారంభోత్సవం:**

గత బిఆరెఎస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టుపై రూ.26,472కోట్లు ఖర్చు చేసినా పనులు మాత్రం 40 శాతం కూడా పూర్తికాలేదు. ఈ ప్రాజెక్టు పరిధిలో ఐదు రిజర్వాయర్లు పూర్తి చేయాల్సి ఉంది. కానీ, ఎన్నికలు రాబోతున్నాయని నార్లాపూర్ రిజర్వాయర్ సామర్థ్యం 8.61 టిఎంసిలు. అక్కడ 9 మోటార్లకు గాను 4 మోటార్లను సిద్ధం చేసి 2023 సెప్టెంబర్‌లో అప్పటి బిఆర్ఎస్ ముఖ్యమంత్రి కెసిఆర్ మొదటి మోటారు స్టార్ట్ చేసి రిజర్వాయర్లో 1 టిఎంసి నీటిని నింపి ప్రాజెక్టుకు ప్రారంభోత్సవం కూడా చేశారు. ఇక్కడ ఇంకా ఐదు మోటార్లు బిగించాల్సి ఉంది. ఏదుల రిజర్వాయర్‌లో 10 మోటార్లకు గాను ఐదు సిద్ధమయ్యాయి. ఇంకా ఐదు బిగించాల్సి ఉంది. 95 శాతం పనులు జరగాల్సి ఉంది. మూడవ రిజర్వాయర్ వట్టెం 16.58 టిఎంసిల సామర్థ్యం గలది. ఇక్కడ 10 మోటార్లకు గాను ఐదు సిద్ధం అయ్యాయి. ఇంకా ఐదు మోటార్లు బిగించాల్సి ఉంది. రిజర్వాయర్ పనులు దాదాపు 90శాతం పూర్తయినా ప్రధాన కాల్వలు పూర్తిచేయాల్సి ఉంది. నాలుగవది కర్వేనా రిజర్వాయర్ 19.5 టిఎంసిల సామర్థ్యం 80 శాతం పూర్తయ్యాయి. ఇక్కడ గ్రావిటీ ద్వారా నీటి ప్రవాహం ఉద్దండపూర్‌కు వస్తుంది. ఐదవది ఉద్దండాపూర్ రిజర్వాయర్ సామర్థ్యం 19.91 టిఎంసిలు కాగా 70 శాతం పనులు పూర్తయ్యాయి. దిగువన పనులు పెండింగ్‌లో ఉండటంతో పథకం కార్యరూపం దాల్చలేదు. కానీ 90 శాతం పనులు పూర్తి చేశామని బిఆర్ఎస్ చెప్పుకుంటుంది.



**మరో రూ.25వేల కోట్లు ఖర్చు చేస్తేనే పూర్తి?**

2015లో రూ.32,200కోట్ల అంచనాతో చేపట్టిన ప్రాజెక్టు.. నేటికి పది సంవత్సరాలు పూర్తయినా ఇంకా 40శాతం పనులు పెండింగ్‌లోనే ఉన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ రెండు సంవత్సరాలలో రూ.7వేల కోట్లు ఖర్చు చేసింది. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పూర్తిస్థాయిలో ఆయకట్టుకు నీరు ఇవ్వాలంటే ప్రస్తుతం భారీగానే ఖర్చు చేయాల్సి ఉంది. సుమారు మరో రూ.25వేల కోట్లు వెచ్చించాలి. పనులు పూర్తయ్యేలోగా ఈ వ్యయం ఇంకా పెరిగే అవకాశం ఉంది. ప్రధాన కాలువలు పూర్తి కావడంతో పాటు డిస్ట్రిబ్యూటరీ కాలువల పనులు జరగాల్సి ఉంది. తాజా అంచనా ప్రకారం పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల అంచనా వ్యయం రూ.56వేల కోట్లు పెరిగింది.

**ఈ ప్రాజెక్టుకు నీటి కేటాయింపులపై జల జగడం:**

పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు 90 టిఎంసిలు శ్రీశైలం నుండి రోజుకు 1.5 టిఎంసిల చొప్పున 60 రోజులలో నీటిని తీసుకునే విధంగా పథకాన్ని రూపొందించారు. దీనికి నికర జలాలు లేవు. బచావత్ అవార్డు ప్రకారం కృష్ణానది జలాలను ఉమ్మడి ఎపికి 810 టిఎంసిలు కేటాయించింది. రాష్ట్ర విభజన తర్వాత 66 శాతం (512 టిఎంసిలు)ఎపికి, 34శాతం(299 టిఎంసిలు) తెలంగాణాకు దక్కాయి. ప్రస్తుతం దాని ప్రకారమే నీటి వాడకం జరుగుతుంది. ఈ పంపకాలపై తెలంగాణ ఏర్పడ్డ తర్వాత 2014లో బిఆర్ఎస్ సర్కార్ అభ్యంతరం వ్యక్తం చేసింది. అయినా గత 11 ఏళ్లుగా 299 టిఎంసిలనే కేటాయింపులే జరుగుతున్నాయి. ఈ వివాదం రెండు రాష్ట్రాల మధ్య మరింత జటిలం అవుతుంది. 66:34 శాతం పంపకాలను పునః సమీక్షించాలని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం డిమాండ్ చేస్తుంది.

వాస్తవానికి పాలమూరు ప్రాజెక్టు చేయాల్సిన 90 టిఎంసిలలో 45 టిఎంసిలు కృష్ణా జలాలను మైనర్ ఇరిగేషన్ కింద ఆదా అయ్యే వాటా నుంచి, గోదావరి నుంచి, 80 టిఎంసిలు ఎపి వాడుకుంటున్నందున, 45 టిఎంసిలు వాటా మళ్లించడం ద్వారా తీసుకుంటామని 2022 ఆగస్టు లో బిఆర్ఎస్ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. దీనిపై ఎపి ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు అనుమతి లేదు వెంటనే ఆపాలని కోరుతుంది. ఈ ప్రాజెక్టు ఉమ్మడి రాష్ట్రంలోనే, 2013 ఆగస్టు 8న జిఓ నెం.72 ద్వారా జూరాల బ్యాక్ వాటర్ నుండి నీటిని తీసుకునే విధంగా రూపొందించబడిందని, అయితే దీనిని శ్రీశైలం నుండి తీసుకునే విధంగా రీ డిజైన్ చేయబడిందని తెలంగాణ చెప్తుంది.

ఏదేమైనా ఈ ప్రాజెక్టును రాజకీయ భేషజాలకు పోకుండా యుద్ధ ప్రాతిపదికన చేపట్టి పూర్తి చేయాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

# వైవిధ్య భరిత భారతంలో న్యూ ఇయర్ వేడుకలు

భిన్నత్వంలో ఏకత్వం సువిశాల సుందర భారత జననందన వనం. ప్రాంతాలు, భాషలు, సంస్కృతులు, సాంప్రదాయాలు వేరైనా నా భరతమాత కంఠాన చేరిన పలు పుష్పాలు ఏరి కూర్చిన అలంకరించిన సుగంధ మాల. ఇక్కడి వైవిధ్యత స్వదేశీయులకు గర్వకారణం, విదేశీయులకు ఈర్ష్యాజనకం. ఆధునిక పాశ్చాత్య సమాజం ప్రతి ఏటా ఘనంగా జరుపుకునే 2025 నూతన సంవత్సర వేడుకలు నేడు ప్రపంచవ్యాప్తంగా బహుళ ప్రచారంలోకి రావడం, భారతీయులు కూడా ఈ వేడుకలను ఉత్సాహంగా నిర్వహించుకోవడం చూస్తున్నాం. 1582లో రోమన్ క్యాథలిక్ చర్చ్ 'పోప్ గ్రిగోరీ' స్థాపించిన గ్రిగోరియన్ క్యాలెండర్ ప్రకారం ప్రతి ఏట 31 డిసెంబర్, 01 జనవరి రోజుల్లో గడిచిన 2025 సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ, రానున్న 2026 నూతన సంవత్సరానికి ఆహ్వానం తెలుపుతూ వయోభేదం లేకుండా పిల్లలు, పెద్దలు అందరూ కలిసి ఆ వేడుకలను ఘనంగా నిర్వహించడం జరుగుతున్నది. నూతన సంవత్సర దినం రోజు ప్రభుత్వ సెలవు కానప్పటికీ ఇండియాలో ఆబాలగోపాలం 31 డిసెంబర్ రాత్రి నుంచి 01 జనవరి వరకు ఉత్సవాలు, పార్టీలు, సినిమాలు చూడ డం, టివీ కార్యక్రమాలను తిలకించడం, కేకులు కట్ చేయడం, రెస్టారెంట్లు/రిసార్టుల్లో గడపడం, నూతన వస్త్రా లు ధరించడం, దేవాలయాలు/చర్చిలకు వెళ్లడం, నూతన సంవత్సర వేళ పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకోవడం లాంటివి సర్వసాధారణంగాజరుగుతుంటాయి.

భారతదేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాలు, ప్రాంతాలు, సాంప్రదాయాలు, భాషల 1.46బిలియన్ల జనులు చాంద్రమాన క్యాలెండర్ ప్రకారం తమతమ నూతన సంవత్సర పండుగను పంటలు కోసే సీజన్‌లో నిర్వహించుకోవడం అనాదిగా ఆనవాయితీగా వస్తున్నది. తెలుగు, కన్నడ ప్రజలు నూతన సంవత్సర వేడుకలను ఉగాది పండుగ రూపంలో జరుపుకుంటున్నారు. అదే విధంగా పంజాబీలు బైసాకీ పండుగను, గుజరాతీలు బెస్తు వరస్ పండుగను, బీహార్/ఝార్ఖండ్‌ల్లో జూడె శీతల్‌ను, ఈశాన్య రాష్ట్రాలు బోహగ్ బిహూ పండుగను, మహారాష్ట్రలో గుడి పడ్వా పండుగను, సింధీలు చెట్టీ ఛాంద్ పండుగను, కాశ్మీరీ హిందువులు నవ తేజ్ పండుగను, పార్సీలు జెమ్షేడీ నవ్రోజి పండుగను, కేరళలో విషు పండుగను, తమిళనాడులో పుతండు పండుగను, ఒడిసాలో పాన సంక్రాంతి పండుగను, అస్సాంలో బోహగ్ బిహూ పండుగను, ముస్లింలు హిజ్రీ క్యాలెండర్ ప్రకారం తమ తమ నూతన సంవత్సర పండుగలను ఘనంగా నిర్వహించుకుంటా రు. ఈ కొత్త సంవత్సర వేడుకలతో పాటు 'గ్రిగోరియన్ క్యాలెండర్' ప్రకారం 01 జనవరి రోజున కూడా న్యూ ఇయర్ డే వేడుకలను ఘనంగా జరుపుకోవడం విశేషం.

**2025 సింహావలోకనం:**

2025లో ప్రపంచ దేశాలు డొనాల్డ్ ట్రంప్ సుంకాల కొరడా దెబ్బల యుద్ధంలో నలిగిపోయారు. ఆర్థిక రంగంలో భారత ఆర్థికాభివృద్ధి పరుగిడుతూ 4 ట్రిలియన్ డాలర్లకు చేరింది. 2025 ఏడాదిలో దేశవ్యాప్తంగా నక్సలైట్ల ఉద్యమంపై ఉక్కుపాదం నిలిపి అణిచి వేయడానికి నడుం బిగించడం జరిగింది. జిఎస్‌టి సంస్కరణలతో భారతం ముందుకు సాగుతున్నది. 22 ఏప్రిల్ 2025 రోజున పహల్గాంలో జరిగిన ఆకస్మిక ఉగ్రదాడిలో 26మంది సాధారణ పౌరులు మరణించడంతో 06 మే 2025 రోజు భారత్ ప్రతిచర్యగా ఆపరేషన్ సిందూర్ ప్రారంభించి పాకిస్తానీ రక్షణ కేంద్రాలు, ఉగ్ర శిబిరాలపై బాంబుల వర్షం కురిపించడంతో పాక్ చేతులెత్తి కాల్పుల విరమణకు ప్రాధేయపడడంతో తాత్కాలిక యుద్ధ విరామం లభించినట్లు అయ్యింది. భారతదేశవ్యాప్తంగా వందేమాతరం 150వ ఏడాదిని జరుపుకోవడం చూసాం. అదే విధంగా ఇండిగో విమానాల సంక్షోభం, 12 జూన్ 2025 రోజు అహ్మదాబాదులో భారత బోయింగ్ విమాన ప్రమాదంలో 241 మందికి పైగా ప్రయాణీకులు మరణించడం జరిగింది. జనవరి 13 నుంచి 26 ఫిబ్రవరి 2025 రోజుల్లో జరిగిన అతి పెద్ద మహా కుంభ మేళాలో 660 మిలియన్ల భక్తులు పాల్గొనడం విశేషం. ఉక్రేయిన్–రష్యా, ఇజ్రాయిల్–గాజా యుద్ధాలు కొనసాగడంతో నిత్యం మరణాలు/వలసలు/శరణార్థులు పెరగడం చూస్తున్నాం. వాతావరణ ప్రతికూల మార్పులతో కూడిన సంక్షోభాలు, ఆఫ్రికాలో జరిగిన జి20 సమావేశాలు, అత్యాధునిక సాంకేతిక విప్లవ పరుగులు, జెన్ జెడ్ తరం పోకడలు, అంతరిక్ష పరిశోధనల ఉప్పెనలు, భూకంపాలు, కార్చిచ్చులు లాంటి అంశాలు 2025ను కుదిపి వేయడం చూసాం.

**2026లో చేపట్టవలసిన సత్కార్యాల తీర్మానాలు:**

భారతదేశవ్యాప్తంగా గ్రామాల నుండి మహానగరాల వరకు నూతన సంవత్సర వేడుకలను 31 రాత్రి నుంచి 01 జనవరి వరకు నిర్వహించుకోవడం, ఏటేటా ఈ సంస్కృతి పెరిగిపోవడం, పలు సందర్భాల్లో పరిధి దాటడం గమనిస్తున్నాం. మనకే స్వంతమైన నూతన సంవత్సర వేడుకల నిర్వహణను నిర్లక్ష్యం చేయకుండా వాటిని ఘనంగా జరుపుకుంటూనే 01 జనవరి న్యూ ఇయర్ వేడుకలను కూడా జరుపుకుందాం. 2025లో మనం సాధించిన ప్రగతిని గుర్తుచేసుకుంటూ, 2025 వైఫల్యాల నుంచి గుణపాఠాలు నేర్చుకుంటూ, 2026లో మనం చేపట్టవలసిన కార్యాలను నిర్ణయించుకొని, సాఫల్య సిద్ధికి సకల శక్తియుక్తులను ఒడ్డి ప్రతి ఏటా ఆశించిన స్థాయిలో ముందడుగు వేద్దాం, మనం ఎదుగుతూ మన దేశాభివృద్ధికి ఊతం ఇద్దాం.

**పెరుగుతున్న పాశ్చాత్య వింత పోకడలు:**

పొరుగింటి పుల్లకూర రుచిగానే ఉంటుందని, ఘర్కా మర్గీ దాల్ కీ బరాబర్ అవుతున్నదని గమనించి మన సంస్కృతులను కాపాడుకుంటూనే ఇతరుల వేడుకల్లో సహితం పాల్గొందాం. మన మహానగరాలు ఢిల్లీ, ముంబయి, కోల్కతా, చెన్నై, బెంగుళూరు, హైదరాబాదు లాంటి నగరాల వీధులు 31 డిసెంబర్ రాత్రి యువతతో నిండిపోవడం, బాణాసంచా కాల్చుతూ సంబరాలు చేసుకోవడం, పబ్బుల్లో ఈలలు వేస్తూ గోలచేయడం, పిచ్చి ముదిరి అతిగా ఆల్కహాల్ సేవించి వాహనాలు నడపడం లేదా నడి వీధుల్లో వికారమైన నృత్యాలు చేయడం, పబ్బుల్లో గబ్బు పనులు చేయడం లాంటి విపరీతాలను చూస్తున్నాం. పర్వదినాలు, వేడుకలు ఆరోగ్యకరమైన వాతావరణంలో జరుపుకోవాలని, ఇతరులు అసహ్యించుకునే దుస్థితిలోకి జారవద్దని గమనిద్దాం. మన ప్రవర్తన మన వారినే ఇబ్బంది పెట్టే విధంగా ఉండకూడదని గమనిద్దాం.

**(31 డిసెంబర్ న్యూ ఇయర్ ఈవ్ డే, 01 జనవరి : నూతన సంవత్సరం–2026 వేడుకలు సందర్భంగా)**

ఆచార్య బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# కేరళ 'స్థానిక' ఎన్నికల ఫలితాలు... అమిత్ షాకు ఆశాభంగం



ఎం.కోటేశ్వరరావు

ఇటీవల కేరళలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలలో అక్కడ అధికారంలో ఉన్న వామపక్ష సంఘటనకు ఎదురుదెబ్బ తగిలిందన్నది వాస్తవం. దాన్ని చావుదెబ్బగా కొందరు వర్ణిస్తున్నారు. అది నిజమా? తిరువనంతపురంలో బిజెపి సాధించిన విజయం గురించి ప్రధాని నరేంద్రమోదీ గొప్పలు చెప్పుకున్నారు. కేరళ రాజకీయాల్లో ఒక మహత్తర ఘట్టం అన్నారు. కాంగ్రెస్ తిరువనంతపురం ఎంపి శశిథరూర్ చారిత్రాత్మక విజయం అన్నారు. ఎందుకటా నాలుగున్నర దశాబ్దాలుగా తిరువనంతపురం మేయర్ పీఠాన్ని నిలుపుకున్న సిపిఎం అక్కడ ఓడిపోయి 101 సీట్లకు బిజెపి 50 తెచ్చుకున్నందుకు. ఒకే, కాసేపు నరేంద్రమోదీని సంతుష్టీకరించేందుకని అంగీకరిద్దాం, నిజమే కదా! అయోధ్య రామ మందిరం గురించి దశాబ్దాల పాటు బిజెపి ఎంత హడావుడి చేసిందో చూశాము. దానివల్లనే మూడుసార్లు మోదీ ప్రధాని అయ్యారు. అక్కడ మొన్నటి లోక్‌సభ ఎన్నికల్లో అయోధ్య భాగంగా ఉన్న ఫైజాబాద్‌లో పదేండ్ల అధికారం తరువాత బిజెపి ఓడిపోయింది, అంతేనా, వారణాసి నియోజకవర్గం, వరుసగా ప్రధాని నరేంద్రమోదీ మూడుసార్లు ఎన్నికయ్యారు. తొలిసారి 3,71,784ఓట్ల మెజారిటీ తెచ్చుకుంటే రెండవసారి 4,79,505కు పెంచుకోగా మూడవసారి 1,52,532కు దిగజారింది. దీని గురించి ఏమని వర్ణిస్తారు? ఒక వాస్తవం ఏమంటే కేరళలో బిజెపికి గత స్థానిక సంస్థల ఎన్నికల్లో వచ్చిన ఓట్లకంటే ఈసారి పెరగకపోగా స్వల్పంగా తగ్గాయి. దీని గురించి మోదీ నుంచి ఎలాంటి స్పందనా ఉండదు! స్థానిక సంస్థలలో అనేక అంశాలు పని చేస్తాయి. బిజెపి కేరళలో గతంలో తెచ్చుకున్న ఆరువందలకు పైగా పంచాయతీ వార్డులను ఈసారి పోగొట్టుకుంది. కొత్తగా కొన్ని తెచ్చుకొని గతం కంటే స్వల్పంగా మెరుగుపడింది. ఒకసారి అధికారంలో ఉన్న తరువాత అన్ని పార్టీలకూ వాటి పనితీరును బట్టి వ్యతిరేకత ఉంటుంది. అది ఒక్క సిపిఐ(ఎం)కే కాదు, ప్రతి పార్టీకి వర్తిస్తుంది.

కేరళ స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ(ఎం) నాయకత్వంలోని ఎల్‌డిఎఫ్ పని అయిపోయిందని తరువాత బిజెపిదే హవా అన్నట్లుగా మీడియాలో కొందరు ఊదరగొట్టారు. కేరళలో కమ్యూనిస్టు వ్యతిరేక మీడియాలో మళయాళ మనోరమ ఒకటి. అది 2025 డిసెంబరు 22న ఒక విశ్లేషణ రాసింది. దానికి పెట్టిన శీర్షిక ''స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇక్కడ బిజెపి తీరుచూసి అమిత్ షా ఎందుకు ఆశాభంగం పొందుతారంటే'' దాన్లో ఏముందో చూద్దాం. ''స్థానిక సంస్థల ఎన్నికల్లో 25 శాతం ఓట్లు తెచ్చుకోవాలని కేంద్ర హోం మంత్రి అమిత్ షా లక్ష్య నిర్దేశం చేశారు. అమిత్ షాలో ఆశావాద వేడి ఎందుకు పుట్టిందంటే 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఎన్‌డిఎ ఒక్కటే ఇక్కడ 19.40 శాతం ఓట్లను తన ఖాతాలో వేసుకుంది. అదిప్పుడే మైందంటే నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ (బిజెపి, భారత ధర్మ జనసేన, లోక్ జనశక్తి పార్టీ) కేవలం 14.76శాతం ఓట్లనే తెచ్చుకోగలిగింది.(గత స్థానిక ఎన్నికల కంటే 0.24శాతం తక్కువ వికీపీడియా)యుడిఎఫ్‌కు 38.81, ఎల్‌డిఎఫ్‌కు 33.45శాతం వచ్చాయి.

పంచాయత్‌లలో(జిల్లా, బ్లాక్, గ్రామపంచాయతీలు అన్నీ కలిపి)ఎన్‌డిఎకు వచ్చిన ఓట్లు 13.92శాతం, 2020లో వచ్చిన 14.34శాతం కంటే స్వల్పంగా తక్కువ. మున్సిపాలిటీలలో 13.1 నుంచి 19.44శాతానికి పెంచుకుంది. కార్పొరేషన్లలో 19.44నుంచి 23.58శాతానికి పెంచుకుంది. మొత్తం అన్ని స్థానిక సంస్థలలో వచ్చిన సగటు ఓట్లు 14.76శాతం.2020 ఎన్నికల్లో వచ్చిన 12.92శాతం కంటే స్వల్పంగా పెంచుకుంది. కానీ ఇది తప్పుదారి పట్టించేది, ఎందుకంటే 2020 కంటే బిజెపి ఈసారి అదనంగా 40శాతం సీట్లలో పోటీ చేసింది.ఆ ఏడాది బిజెపి 14వేల వార్డుల కంటే తక్కువే పోటీ చేసింది. ఈసారి ఆ పార్టీ, మిత్రపక్షాలతో కలసి ఎన్నికలు జరిగిన మొత్తం 23,576 వార్డులలో 89.35శాతం అంటే 21,065 చోట్ల పోటీచేసింది. బిజెపి ఒక్కటే 19,262 సీట్లలో పోటీ చేసింది. ఇతర ప్రధాన పార్టీలైన కాంగ్రెస్ 17,497, సిపిఎం 14,802 చోట్ల పోటీ చేశాయి. గత ఎన్నికల కంటే ఏడువేల వార్డులలో అదనంగా పోటీ చేయటంతో పాటు మొత్తం 25 శాతం ఓట్లు, రెండు కార్పొరేషన్లు, కనీసం పది మున్సిపాలిటీలు, 30 బ్లాక్ పంచాయతీలు, 300కు పైగా గ్రామ పంచాయతీలు సాధించాలని లక్ష్యంగా నిర్ణయించుకోగా దానిలో ఒక చిన్న భాగం మాత్రమే చివరికి దక్కింది. ఇరవై ఆరు గ్రామ పంచాయతీలు (తిరువనంతపురం 6, కొల్లం 2, పత్తానంతిట్ట 4, అలప్పూజ 5, కొట్టాయం 3, త్రిసూర్ 1, పాలక్కాడ్ 2, కాసరగోడ్ 3), రెండు మున్సిపాలిటీలు(పాలక్కాడ్,తిరుప్పునితుర) ఒక కార్పొరేషన్(తిరువనంతపురం) దానికి దక్కాయి. అయినప్పటికీ కేవలం ఆరుగ్రామ పంచాయతీల్లోనే దానికి స్పష్టమైన మెజారిటీ ఉంది. చివరికి తిరువనంతపురం కార్పొరేషన్‌లో కూడా 101 గతం కంటే నాలుగుశాతం ఓట్లు పెరిగినప్పటికీ ఎన్‌డిఎకు వచ్చిన 34.52శాతం కంటే మెరుగ్గా ఎల్‌డిఎఫ్‌కు 34.56శాతం వచ్చాయి.

2020లో బిజెపికి కాసరగోడ్ జిల్లాలోని మధుర్, బెల్లూర్ గ్రామపంచాయతీలలో, రెండు మున్సిపాలిటీలు పాలక్కాడ్, పండలంలో స్పష్టమైన మెజారిటీ ఉంది. ఈసారి రెండింటిలో దానికి మెజారిటీ రాలేదు, మండలంలో అవమానకరంగా నష్టపోయింది. ఈసారి ఎన్‌డిఎ 421 కార్పొరేషన్ వార్డులకు గాను 22.09 శాతం(93), 3,240 మున్సిపల్ వార్డులకు గాను పది శాతం(324), 346 జిల్లా పంచాయత్ వార్డులకు గాను ఒక్కటి, 2,267 బ్లాక్ పంచాయత్ వార్డులకు 54, గ్రామపంచాయతీలలోని 17,337కు గాను 1,447 వార్డులు 8.35శాతం వచ్చాయి. ఒక్క కార్పొరేషన్లలో తప్ప 2020తో పోల్చితే బిజెపి పరిస్థితి పెద్దగా మెరుగైనట్లు ఇవి ప్రతిబింబించటం లేదు.

మున్సిపాలిటీలలో గుర్తించదగినదిగా బిజెపి ఉనికి ఉంది. కొన్ని జిల్లాల్లో దాని ఓట్ల వాటా పెరిగింది. ఎర్నాకుళంలో 9.08 నుంచి 12.65, పత్తానంతిట్టలో 16.18 నుంచి 18.02, త్రిసూర్‌లో 19.14 నుంచి 21.86, పాలక్కాడ్‌లో 18.28 నుంచి 23.96కు పెరిగాయి. కొట్టాయం, ఇడుక్కి జిల్లాల్లో క్రైస్తవ అభ్యర్థులతో అది ప్రయోగం చేసింది. మున్సిపాలిటీలలో దాని ఓట్ల వాటా పెరిగింది. కొట్టాయంలో 11.5 నుంచి 15.1, ఇడుక్కిలో 12.53 నుంచి 14.88శాతానికి పెరిగింది. ఎల్‌డిఎఫ్ వాటా 21.63శాతానికి దగ్గరగా వచ్చింది. అయితే కొన్ని జిల్లాలోని మున్సిపాలిటీలలో దాని ఓట్ల వాటా తగ్గింది. తిరువనంతపురంలో 24.49 నుంచి 23.48కి, అలప్పూజలో 19.08 నుంచి 18.19, కాసరగోడ్‌లో 15.36 నుంచి 14.52కు తగ్గాయి. కొల్లం కార్పొరేషన్‌లో ఆరు నుంచి పన్నెండు సీట్లకు పెరిగాయి. ఆ జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలలో ఓట్ల శాతం స్థిరంగా ఉంది, ఇప్పుడు 15.92 రాగా 2020లో 15.9శాతం వచ్చాయి. కొల్లం కార్పొరేషన్‌లో కూడా ఓట్ల శాతం స్థిరంగానే ఉంది. తిరువనంతపురంలో 30.92 నుంచి 34.52, కొచ్చిలో 10.95 నుంచి 14.41కి, కన్నూరులో 11.61 నుంచి 14.06కు పెరిగాయి. మిగిలిన మూడు కార్పొరేషన్లలో 2020లో వచ్చిన మేరకే తిరిగి వచ్చాయి. కొల్లంలో 22.02 నుంచి 22.61కి, త్రిసూర్‌లో 18.86 నుంచి 18.54, కోజికోడ్‌లో 22.29 నుంచి 22.43శాతంగా ఉంది.

పైన పేర్కొన్నదంతా మళయాళ మనోరమ విశ్లేషణలోని అంశాలే. తిరువనంతపురంలో బిజెపి గెలుపు గురించి మీడియాలో వచ్చిందేమిటో చూశాము. శబరిమల అయ్యప్ప ఆలయం సమీపంలో ఉన్న పండలం మున్సిపాలిటీలో 34 వార్డులు ఉండగా గత ఎన్నికల్లో బిజెపి పద్దెనిమిది తెచ్చుకుంది. ఈసారి తొమ్మిది వార్డులతో మూడో స్థానానికి పడిపోయింది. అనేకమంది రాష్ట్ర నేతలు ఇక్కడ తిష్టవేసి ఎలాగైనా నిలబెట్టుకోవాలని చూశారు. ఎల్‌డిఎఫ్ 14, యుడిఎఫ్ 11 తెచ్చుకున్నాయి. అయ్యప్పస్వామి ఆలయ ప్రవేశ వివాదంతో గతంలో బిజెపి పొందిన లబ్ధి ఇప్పుడు తుడిచిపెట్టుకుపోయింది. ఇటీవల అయ్యప్ప ఆలయంలో జరిగిన బంగారు తాపడాల అక్రమాన్ని ప్రచారం చేసి మరింతగా లబ్ధిపొందాలని చూసి భంగపడింది. ఈ మున్సిపాలిటీ మాత్రమే కాదు, దాని పక్కనే ఉన్న కులంద గ్రామ పంచాయతీ 15 సంవత్సరాలుగా బిజెపి ఆధీనంలో ఉంది. ఈసారి అక్కడ ఎల్‌డిఎఫ్ 8, బిజెపి, ఇతరులు నాలుగు చొప్పున, యుడిఎఫ్‌కు ఒక స్థానం వచ్చింది. శబరిమల ఆలయం ఉన్న రన్నీపెరునాడ్ పంచాయతీ శబరిమల వార్డులో బిజెపి మూడవ స్థానంలో ఉంది. యుడిఎఫ్, ఎల్‌డిఎఫ్‌కు సమంగా ఓట్లు రావటంతో లాటరీలో ఎల్‌డిఎఫ్‌కు వచ్చింది. ఈ పంచాయతీని పదివార్డులతో ఎల్‌డిఎఫ్ గెలుచుకుంది. తిరువనంతపురం కార్పొరేషన్‌లో బిజెపి 101కిగాను 50వార్డులతో అధికారానికి వచ్చింది.

సిపిఐ(ఎం) రాజ్యసభ సభ్యుడు జాన్ బ్రిట్టాస్ వెల్లడించిన వివరాల ప్రకారం ఓట్ల రీత్యా అక్కడ సిపిఐ(ఎం) ప్రథమ స్థానంలో ఉంది. మీడియాకు ఈ వివరా లు తెలిసినప్పటికీ అది పెద్ద ప్రాధాన్యత కలిగిన అంశం కాదన్నట్లుగా మౌనంగా ఉంది. లోక్‌సభ ఎన్నికలు 2024లో బిజెపికి తిరువనంతపురంలో 2,13,214 ఓట్లు వస్తే కార్పొరేషన్ ఎన్నికల్లో అవి 1,65,891కి తగ్గాయి. యుడిఎఫ్ ఓట్లు 1,84, 727 నుంచి 1,25,984కు పడిపోగా ఎల్‌డిఎఫ్ ఓట్లు 1,29, 048 నుంచి 1,67,522కు పెరిగాయి, అంటే బిజెపి కంటే స్వల్పంగా ఎక్కువ తెచ్చుకుంది. బిజెపి గెలిచిన 50 వార్డులలో 40 చోట్ల యుడిఎఫ్ మూడవ స్థానంలో ఉంది. ఇరవై అయిదు వార్డులలో కాంగ్రెస్‌కు కనీసం వెయ్యి ఓట్లు కూడా రాలేదు. కొన్నింటిలో ఐదువందలకు లోపే వచ్చాయి.? కొన్ని చోట్ల బిజెపి వంద ఓట్లకంటే తక్కువ మెజారిటీతో గెలిచింది. దీని అర్థం ఏమిటి? పార్లమెంటు, స్థానిక సంస్థల ఎన్నికలో ఓటర్ల తీరులో తేడా ఉంటుందన్నది వాస్తవం. అక్కడ గెలిచిన కాంగ్రెస్ నేత శశిథరూర్ ఆ పార్టీలో ఉంటూనే బిజెపితో చెలిమిచేస్తున్న సంగతి బహిరంగ రహస్యం. తన పార్టీ తీరుతెన్నులను మరిచిపోయి బిజెపి చారిత్రాత్మక విజయం సాధించింద ని పొగిడారంటే ఏం జరిగిందో చెప్పనవసరం లేదు. అనేక చోట్ల రెండు పార్టీలు సిపిఎంకు వ్యతిరేకంగా కుమ్మక్కు కావటం గతంలో జరిగింది, ఇప్పుడు కూడా పునరావృతం అయినట్లు కనిపిస్తోంది !

## కస్తూర్బా పాఠశాల ముందే వ్యర్థాలకు నిప్పు... పర్యావణానికి ముప్పు



**ప్రజాపక్షం/రేగోడ్** :తాసిల్దార్ కార్యాలయానికి వెళ్లే మార్గ మధ్యలో కస్తూర్బా విద్యాలయం సమీపంలో మంగళవారం రోడ్డు పై చెత్త కాగుతాలకు నిప్పు అంటేయడంతో పోగ కమ్ముకపోయంది వస్తున్న వాహన దారులకు ఇబ్బందికరంగా మారింది అధికారులు ఉండచోటనే వ్యర్థాలకు నిప్పుంటిస్తే ఎలా అన్ని వాహన దారులకు ఆవేదన వ్యక్తిత్వం చేస్తున్నారు

## ముక్కోటి ఏకాదశికి పటిష్ట పోలీసు బందోబస్తు :ఎస్‌పి



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్:**ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లాలోని ప్రముఖ ఆలయాల వద్ద భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్‌పి డా.జి.జానకి షర్మిల తెలిపారు.ఏకాదశి సందర్భంగా దేవాలయాలకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉన్నందున,అందరూ శాంతియుతంగా,సురక్షితంగా దర్శనాలు చేసుకునేలా అన్ని ముందస్తు చర్యలు చేపట్టినట్లు ఆమె వెల్లడించారు.ముఖ్యంగా భక్తుల రాకపోకలను నియంత్రించేందుకు ప్రత్యేక ట్రాఫిక్ ఏర్పాటు చేశామని,వాహనాల పార్కింగ్ కోసం నిర్దిష్ట ప్రాంతాలను కేటాయించామని ఎస్‌పిపేర్కొన్నారు.ఆలయ సరిసరాల్లో నిరంతరం నిఘా ఉంచేందుకు సిసి కెమెరాల పర్యవేక్షణతో పాటు,గస్తీ పోలీసులను నియమించినట్లు తెలిపారు.అత్యవసర పరిస్థితుల్లో తక్షణమే స్పందించేందుకు వీలుగా ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను,క్విక్ రెస్పాన్స్ టీమ్స్‌ను (క్యూఆర్‌టి) సిద్ధంగా ఉంచినట్లు ఆమె వివరించారు.

## ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేస్తే ఉపేక్షించం

ప్రజాపక్షం ఎఫెక్ట్

**ప్రజాపక్షం /చెన్నూరు:**చెరువు కాలువ స్థలంపై కన్నేసి కాలువను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ చెన్నూరు డిఇ వేణుగోపాల్ మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. 'ప్రజాపక్షం' దినపత్రికలో చెరువు కాలువను తొలగించిన కాంగ్రెస్ నేతలు అనే కథనం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించి సోమనపల్లి గ్రామంలోని ఎర్ర చెరువు కాలువను పరిశీలించారు. రెండు రోజుల క్రితం రాత్రివేళ గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ నేతలు కాలువను ధ్వంసం చేసినట్లు గుర్తించారు. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తే ఉపేక్షించబోమని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని డిఇ స్పష్టం చేశారు. యాసంగి పంటలకు నీరు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కాలువ పునరుద్ధరణ విషయమై ఉన్నతాధికారులకు నివేదిక పంపించి అతికొద్ది రోజుల్లోనే పనులు పూర్తి చేసి రైతులకు ఇబ్బంది లేకుండా చూస్తామని పేర్కొన్నారు.

## నేడు స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్




**ప్రజాపక్షం/రెబ్బెన :**రెబ్బెన పోలీస్ స్టేషన్ పరిధిలో డి సెంబర్ 31న స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు ని ర్వహించనున్నట్లు ఎస్ఐ వెంకటకృష్ణ తెలిపారు. జి ల్లా ఎస్‌పి నికితా పంత్, ఎఎస్‌పి చిత్తరంజన్ ఆదేశా ల మేరకు సిఐ సంజయ్ పర్యవేక్షణలో నాలుగు ప్ర త్యేక బృందాలతో తనిఖీలు చేపట్టనున్నారు. యువత మద్యం సేవించి రోడ్లపై కేరింతలు కొడుతూ వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు. డిజేలు, పెద్ద సౌండ్ బాక్సులతో ఇతరులకు ఇబ్బంది కలిగించేలా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. కుటుంబ సభ్యులతో కలిసి ప్రశాంతంగా వేడుకలు జరుపుకోవాలని సూచించారు. రోడ్లపై కేకులు కట్ చేయడం, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, కూడళ్ల వద్ద చలి మంటలు వేయటం నిషేధమని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడినా, అల్లర్లకు దిగినా కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు.

## కూచిపూడి నృత్యంలో మంచిర్యాల చిన్నారి గిన్నిస్ రికార్డు



**ప్రజాపక్షం/మంచిర్యాల:**మంచిర్యాల పట్టణానికి చెందిన చిన్నారి అల్లోజు సహస్ర కూచిపూడి నృత్యంలో అద్భుత ప్రతిభ కనబరిచి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో స్థానం సంపాదించింది. హైదరాబాద్ లోని గచ్చిబౌలి మైదానంలో డిసెంబర్ 27న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో భా రత్ ఆర్ట్ అకాడమీ నిర్వహించిన కూచిపూడి కళావైభవం 2 కార్యక్రమంలో ఈ రికార్డు నమోదైంది. కళా రత్న వెంకటేశ్వర శర్మ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో దేశ విదేశాల నుంచి వచ్చిన 5700 మంది కూచిపూడి కళాకారులు ఒకే వేదికపై నాట్య ప్రదర్శన చేశారు. మూడవ రౌండ్ లో ఈ బృహత్తర విన్యాసం గిన్నిస్ రికార్డు సొంతం చేసుకుంది. ఇందులో మంచిర్యాలకు చెందిన అల్లోజు శ్రీకాంత్ మోక్షజ్ఞ కుమార్తె అల్లోజు సహస్ర పాల్గొని గిన్నిస్ రికార్డు సర్టిఫికెట్ అందుకుంది. సహస్ర స్థానిక ఆర్ బి హెచ్ వి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ లో 2వ తరగతి చదువుతోంది. బెల్లంపల్లిలోని నటరాజ డాన్స్ అకాడమీ నాట్య గురువు అల్లాడి అర్చన జయప్రకాష్ వద్ద ఆన్‌లైన్ ద్వారా నృత్యం నేర్చుకుంది. చిన్నతనంలోనే తమ కూతురు ఇంతటి గ్లోబల్ రికార్డు సాధించడానికి కారణమైన గురువు అర్చనకు తల్లి దండ్రులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.అల్లోజు సహస్ర, అల్లాడి అర్చన జయప్రకాష్, అల్లోజు శ్రీకాంత్ మోక్షజ్ఞ పాల్గొన్నారు.

## స్కూల్ ఆటోను ఢీకొట్టిన బొలెరో.. ఆరుగురు విద్యార్థులకు గాయాలు



**ప్రజాపక్షం /లక్షెట్టిపేట:**లక్షెట్టిపేట పట్టణంలో స్కూల్ విద్యార్థులను తరలిస్తున్న ఆటోను బొలెరో ట్రాలీ ఢీకొనడంతో ఆరుగురు విద్యార్థులకు గాయాలయ్యాయి. పట్టణంలోని సిఎస్ఐ చర్చి గేటు ముందు ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఆటో డ్రైవర్ రామస్వామి భగత్ సింగ్ నగర్‌కు చెందిన 9 మం ది విద్యార్థులను ఆటోలో ఎక్కించుకొని స్థానిక బాలికల, బాలుర పాఠశాలకు తీసుకు వెళ్తున్నాడు. సిఎస్ఐ చర్చ్ గేటు వద్దకు రాగానే లక్షెట్టిపేట నుంచి ఆంధ్రా బోర్ వైపు వెళ్తున్న బొలెరో వాహనం ఆటోను ఢీకొట్టింది. ఆటో అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న కెనాల్ లో పడిపోయింది. స్థానికులు వెంటనే స్పందించి పోలీసులకు సమాచారం అందించారు. గాయపడ్డ విద్యార్థులను చికిత్స నిమిత్తం లక్షెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కొందరిని మంచిర్యాల ఆసుపత్రికి పంపించారు. డ్రైవర్ రామస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గోపతి సురేష్ తెలిపారు.

## శివాజీ విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన



**ప్రజాపక్షం / కౌటాల:**కౌటాల మండల కేంద్రంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహం ఏర్పాటుకు మంగళవారం శంకుస్థాపననిర్వహించారు. ఆరే కులబాంధవుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆరే కుల సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తర ద్వార దర్శనం చేసుకున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ దంపతులు




**ప్రజాపక్షం/సంగారెడ్డి:** రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ దంపతులు సంగారెడ్డి పట్టణంలో ఉన్న ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం వైకుంఠ పురం శ్రీ వేంకటేశ్వర దేవాలయం లో వైకుంఠేకాదిశి ( ముక్కొటేకదశి) పర్వదనాన్ని పురస్కరించుకొని ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి పల్లకి సేవలో భక్తులతో కలసి పాల్గొన్నారు. దేవాలయం అభివృద్ధికి రాజగోపురం నిర్మాణానికి కృషి చేస్తామని మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు.

## ధాన్యం అమ్ముకోవడానికి
# రైతులకు తప్పని తిప్పలు
### అన్నదాతల గోస పట్టించుకోని ప్రభుత్వం




**ప్రజాపక్షం/ముధోల్:**ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి రైతు పండించిన పంట కొనుగోలు చేయడం సంతోషించే విషయమే అయిన అది మాటల వరకే పరిమితం అయినట్లు కనిపిస్తోంది.ముధోల్ మండలంలో సోయా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు.ధాన్యం కొనుగోలు ఆలస్యం అయిన ఎంతో కొంత లాభం చేకూర్చుతుందని ఆశించిన రైతుకు తిప్పలు తప్పడం లేవు,రోజు వారీగా కొద్ది మంది రైతుల ధాన్యం కొనుగోలు చేసేటట్లు టోకెన్లు రైతులకు అందించారు.ఐతే కొనుగోలు ప్రక్రియలో రైతుకు ఎన్నో అవాంతరాలు ఎదురవుతున్నాయి.రైతు కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకెళ్లి కింద పేర్చి సర్వేయర్ చూసిన తర్వాత కొనుగోలుకు ఎంపికైతే మళ్ళీ సంచుల్లో నింపి బరువు చేయాలి.కొనుగోలుకు ఎంపిక కానీ ధాన్యం బయటే అమ్ముకోవాలి.ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో లాభదాయకంగా కాకున్నా చేతికందిన ఎంతో కొంత పంట అమ్ముకుందామంటే ప్రభుత్వం ఇన్ని ఆంక్షలు విధిస్తే రైతు ధాన్యం అమ్ముకునేది ఎలా..!పంట సరిగా పండక ఇప్పటికే అప్పుల్లో కూరుకుపోయిన రైతును ఆదుకునేది ఎవరు.రైతు రాజు అయ్యేదెప్పుడు,ఇప్పటికైనా ఉన్నతాధికారులు,ప్రభుత్వం రైతులకు అండగా ఉండి ఎలాంటి ఆంక్షలు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు వేడుకుంటున్నారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన
### రూ.6 కోట్ల 50 లక్షలతో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా అడుగు



**ప్రజాపక్షం/నిజామాబాద్:** తాగు నీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలనే సంకల్పంతో ప్రభుత్వం భారీ అభివృద్ధిపనులకు శ్రీకారం చుట్టి ంది. ఈ క్రమంలో రూ.6 కోట్ల 50 లక్షలతో నిర్మించనున్న ఆధునిక వాటర్ ట్యాంకుల పనులకు ప్రభుత్వసలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్ మంగళవారం శంకుస్థాపన చేశారు. అనంతరం పట్టణంలోని కెకె గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులతో కలిసి అభివృద్ధి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ పట్టణంలో వేగంగా పెరుగుతున్న జనాభా, పట్టణ విస్తరణను దృష్టిలో పెట్టుకుని తాగునీటి అవసరాలను తీర్చేందుకు ప్రభుత్వంముందు చూపుతో నిర్ణయాలు తీసుకుంటుందన్నారు. గతంలో ఎన్నడూ లేనంతగా మౌలిక సదుపాయాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పని చేస్తోందని స్పష్టం చేశారు. నీరు ప్రజల ప్రాథమిక హక్కు, వేసవి కాలంలో ఒక్క ఇంట్లోనూ నీటి ఇబ్బందులు ఉండకూడదనే ఉద్దేశ్యంతో ఈ వాటరు ట్యాంకుల నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. ఈ పనులు పూర్తయితే పట్టణంలోని పలు ప్రాంతాల్లో సంవత్సరాలుగా ఉన్న నీటి కొరత సమస్యకుశాశ్వతపరిష్కారంలభిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. 2 కోట్ల 50 లక్షలతో 16 లక్షల లీటర్ల సామర్థ్యం గల భారీ వాటర్ ట్యాంకును నిర్మించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు అధికారులు, నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

## చట్నీలో వెంట్రుక... ఆరోమా హోటల్ నిర్లక్ష్యం



**ప్రజాపక్షం /సంగారెడ్డి :**చట్నీలో వెంట్రుకతో ఆరోమా హోటల్ నిర్లక్ష్యం బయటపడింది. సంగారెడ్డి పట్టణంలోని బైపాస్‌లోని ఆరోమా టిఫిన్స్ హోటల్‌లో వినియోగదారుడికి అందించిన చట్నీలో వెంట్రుక కనిపించడం కలకలం రేపింది. టిఫిన్ చేస్తున్న సమయంలో చట్నీలో వెంట్రుక కనిపించడంతో వినియోగదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆహార భద్రతా ప్రమాణాలు పాటించడం లేదని ఆరోపిస్తూ హోటల్ సిబ్బందిని ప్రశ్నించారు. తాము డబ్బులు చెల్లించి భోజనం చేస్తున్నప్పటికి ఇలాంటి అనారోగ్యకర పరిస్థితుల్లో ఆహారం అందించడం తగదని హోటల్ సిబ్బందిని నిలదీశారు. ఈ ఘటన హోటల్ ఆహార భద్రతా ప్రమాణాలు పాటించడం లేదన్న ఆరోపణలకు దారితీసింది. సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే ఇలాంటి ఘటన జరిగిందని వినియోగదారులు విమర్శిస్తున్నారు. ఇదిలా ఉండగా సంబంధిత అధికారులు హోటళ్లలో ఆహార నాణ్యత పరిశుభ్రతపై కఠిన తనిఖీలు నిర్వహించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## ఇంటర్ విద్యార్థులకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగ అవకాశం
### నిర్మల్ లో ఈ నెల 31న హెచ్‌సిఎల్ 'టెక్ బీ' మెగా జాబ్ మేళా

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్:**ఇంటర్మీడియాట్ పూర్తి చేసిన,ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులకు సాఫ్ట్‌వేర్ రంగంలో స్థిరపడేందుకు ఒక అద్భుతమైన అవకాశం లభించింది ప్రముఖ అంతర్జాతీయ ఐటీ సంస్థ హెచ్‌సీఎల్ టెక్ బీ ప్రోగ్రామ్ ఆధ్వర్యంలో ఈ నెల 31వ తేదీ బుధవారం నాడు నిర్మల్ పట్టణంలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి జాదవ్ పరశురాం,హెచ్‌సీఎల్ సంస్థ ప్రతినిధి రాజుల రాజేష్ కుమార్ ఒక సంయుక్త ప్రకటనలో వెల్లడించారు.ఐటీ,డిపిట విభాగాల్లో సాఫ్ట్‌వేర్ పోస్టుల భర్తీ కోసం ఈ ప్రత్యేక ఎంపిక ప్రక్రియను చేపడుతున్నారు.ఈ ఉద్యోగ మేళాకు కేవలం ఒక విభాగానికి చెందిన వారే కాకుండా ఎంపీసీ.సీఈసీ,బైపీసీ,హెచ్‌ఈసీ,వోకేషనల్ వంటి అన్ని గ్రూపుల విద్యార్థులు హాజరుకావచ్చు.2024,2025 విద్యా సంవత్సరాల్లో ఇంటర్మీడియట్ పూర్తి చేసిన వారితో పాటు,ప్రస్తుతం ద్వితీయ సంవత్సరం చదువుతూ 2026 లో ఉత్తీర్ణులు కాబోయే విద్యార్థులకు కూడా ఈ మేళాలో పాల్గొనే అరుదైన అవకాశంఒ కల్పించారు.ప్రభుత్వ,ప్రైవేట్ కళాశాలల అభ్యర్థులు ఎవరైనా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చని అధికారులు స్పష్టం చేశారు. ఆసక్తి గల అభ్యర్థులు తమతో పాటు పదో తరగతి మార్కుల జాబితా నకలు,ఇంటర్మీడియట్ పాస్ సర్టిఫికేట్ లేదా ఆన్‌లైన్ మెమో,ఆధార్ కార్డు జిరాక్స్‌లను వెంట తెచ్చుకోవాలి.నిర్మల్ బస్ డిపో ఎదురుగా,బిగ్‌సి పైన ఉన్న అమిత్(అమిత్ ఐసిఎస్ఎస్) కంప్యూటర్స్ కార్యాలయంలో బుధవారం ఉదయం 10 గంటల నుంచి ఈ ఉద్యోగ మేళా ప్రారంభమవుతుంది.అభ్యర్థులు ముందుగా నిర్ణీత ఆన్‌లైన్ లింక్ ద్వారా తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు.మేళాకు సంబంధించిన మరింత సమాచారం,ఇతర వివరాల కోసం హెచ్‌సీఎల్ ఏరియా ప్రతినిధి రాజుల రాజేష్ కుమార్ ను 8074065 803,97 016 65424 నంబర్లలో సంప్రదించవచ్చు,ఇంటర్ అర్హతతోనే సాఫ్ట్‌వేర్ రంగంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలనుకునే నిరుద్యోగ యువత,విద్యార్థులు ఈ సువర్ణావకాశాన్ని వదులుకోవద్దని అధికారులు కోరారు.

## ఎన్నికల నిర్వహణకు అన్ని విధాలుగా సన్నద్ధం: కలెక్టర్



**ప్రజాపక్షం/నిజామాబాద్:**మున్సిపల్ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేలా అన్ని విధాలుగా సన్నద్ధంకావలని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి అధికారులకు సూచించారు. భీమ్‌గల్, ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయాలను కలెక్టర్ మంగళవారంవేర్వేరుగాసందర్శించారు. మున్సిపల్ ఎన్నికల నిర్వహణ సన్నద్ధతపై కమిషనర్లు ఇతర అధికారులతో సమీక్ష నిర్వహించారు. షెడ్యూల్ వెలువడిన వెంటనే ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఒక్కో వార్డు వారిగా ఓటరు జాబితాను పక్కాగా రూపొందించాలన్నారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన విధంగా ముసాయిదా జాబితాను ప్రదర్శించాలని, అభ్యంతరాలను స్వీకరించి సకాలంలో వాటిని పరిష్కరించాలని జనవరి 10 న తుది ఓటరు జాబితా వెలువరించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో సందర్శించి సదుపాయాలను పరిశీలించాలన్నారు. రాష్ట్ర ఎన్నికల కమీషన్ ని యమ నిబంధనలకనుగుణంగా పూర్తి పారదర్శకంగా విధులు నిర్వహించాలన్నారు. ఎన్నికల విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశాలలో ఆర్మూ ర్ మున్సిపల్ కమీషనర్ శైలజ, భీమ్‌గ ల్ మున్సిపల్ కమీషనర్ గంగాధర్, త హసీల్దార్ మహ్మద్ షబ్బీర్, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## జంగుబాయి పుణ్యక్షేత్ర అభివృద్ధికి కృషి
### ఆదివాసీలకు ప్రతీ పథకం అందేలా చూస్తాం: ఆత్రం సుగుణక్క



**ప్రజాపక్షం/కెరమెరి:**కుము రం భీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం కోట పరందో లి సమీప అటవీ ప్రాంతంలో ఉన్న ఆదివాసీల ఆరాధ్య దై వం జంగుబాయి పుణ్యక్షేత్రా న్ని మంగళవారం డిసిసి అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క సం దర్శించారు. మహారాష్ట్ర పాండర్ కోవడ ఎమ్మెల్యే తొడసం రాజు, ఆదిలాబాద్ ఎంపి గోడం నగేష్, ఎమ్మెల్యే కోవాలక్ష్మి , కలెక్టర్ వెంకటేష్ ధోత్రేతో కలిసి ఆదివాసీల ఆచార సంప్రదాయాల ప్రకారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అటవీ ప్రాం తంలో ఉన్న జంగుబాయి గుహలోకి వెళ్లి దేవతకు మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆత్రం సుగుణక్క మాట్లాడుతూ జంగుబాయి దేవత ఆదివాసీలకు అత్యంత ఆరాధ్య దైవమని, భక్తులు కోరిన కోరికలను నెరవేర్చే మహాశక్తి అని అన్నారు. ప్రకృతి సహజంగా ఏర్పడిన ఈ పుణ్యక్షేత్రానికి ఎలాంటి హాని కలగకుండా అభివృద్ధి చేసే అంశాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇన్‌చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసే ప్రతి సంక్షేమ, అభివృద్ధి పథకం ఆదివాసీలకు అందేలా కృషి చేస్తానని స్పష్టం చేశారు. ప్రతి సంవత్సరం జంగుబాయి దర్శనానికి రావడం తన ఆనవాయితీ అని, ఈసారి డిసిసి అధ్యక్షురాలిగా దర్శించుకోవడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మహారాష్ట్ర ఎమ్మెల్యే తొడసం రాజు, ఎంపి గోడం నగేష్, ఎంఎల్‌ఏ కోవాలక్ష్మి , కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, జిల్లా అధికారులు, ఆదివాసీ పటేళ్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మత్స్యకారులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి
### జిల్లా మత్స్యశాఖ ఫీల్డ్ అధికారి మధుకర్

**ప్రజాపక్షం / పెంచికల్‌పేట్;**మత్స్యకారులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని జిల్లా మత్స్య శాఖ ఫీల్డ్ అధికారి మధుకర్ అన్నారు. పెంచికల్‌పేట్ మండలంలోని బొక్కి వాగు ప్రాజెక్టులో మంగళవారం ప్రభుత్వం అందిస్తున్న ఉచిత చేప పిల్లలను వదిలారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల అభివృద్ధి అధికారి ఆల్బర్ట్, సర్పంచులు భక్తు రాచందర్, చప్పిడి రవి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ఉచిత చేప పిల్లలను మత్స్యకారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వాటికి దాణా వేసి పెంచడం ద్వారా మంచి లాభాలు పొందాలని కోరారు. ప్రాజెక్టులో మొత్తం 2 లక్షల 43 వేల చేప పిల్లలను వదిలినట్లు అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు చంద్రశేఖర్, చంద్రయ్య, మత్స్య శాఖ సంఘం అధ్యక్షుడు బాపూరావు, సభ్యులు బాబాజీ, సుధాకర్, శ్రీనివాస్, తిరుపతి, వెంకటేష్ పాల్గొన్నారు.

## నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు: ఎస్‌పి



**ప్రజాపక్షం / ఆసిఫాబాద్:**జిల్లావ్యాప్తంగా డిసెంబర్ 31 రాత్రి నూతన సంవత్సర వేడుకలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని జిల్లా ఎస్‌పి నికితా పంత్ సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యువత ఇతరులకు ఇబ్బంది కలిగించకుండా వేడుకలు నిర్వహించుకోవాలని తెలిపారు. శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా పోలీసు యంత్రాంగం పటిష్టమైన చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తామని, మద్యం సేవించి వాహనాలు నడిపితే సీజ్ చేస్తామని స్పష్టం చేశారు. రాంగ్ సైడ్ డ్రైవింగ్, రాష్ డ్రైవింగ్, స్పీడ్ రేసింగ్ చట్ట విరుద్ధమని తెలిపారు. మైనర్లు వాహనాలు నడిపితే వారి తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ డిజెలకు అనుమతులు లేవని, రోడ్లపై కేక్ కటింగ్ లు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇళ్లపై సౌండ్ బాక్సులతో వేడుకలు నిర్వహించేవారు ముందస్తు అనుమతి తీసుకోవాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉన్నందున అనుమతులు లేకుండా ర్యాలీలు, సభలు నిర్వహించరాదని తెలిపారు. నూతన సంవత్సర శుభాకాంక్షల పేరుతో సైబర్ నేరగాళ్లు పంపించే ఫేక్ లింకుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు.

## తమ్ముడిని హత్య చేసిన అన్న

**ప్రజాపక్షం/పాపన్నపేట:**భూమి రిజిస్ట్రేషన్ విషయంలో ఒకరు హత్యకు గురైన ఘటన మండల పరిధి బాచారం గ్రామంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం...గ్రామానికి చెందిన చాకలి దశరథ్ (36) కొన్నేళ్ల క్రితం తన అన్న ఆశయ్య వద్ద 7 గుంటల భూమిని కొన్నాడు. ఆ భూమిని తన పేరు మీదికి చేయాలని దశరథ్ కోరుతున్నప్పటికీ ఆశయ్య జాప్యం చేస్తూ అదనంగా డబ్బు కావాలని డిమాండ్ చేస్తున్నాడు. ఈ విషయంలో పంచాయతీ జరిగిన, నచ్చజెపిన ఆశయ్య భూమి రిజిస్ట్రేషన్ చేయలేదు. ఇదే విషయంలో మళ్లీ సోమవారం రాత్రి దశరథ్ ఆశయ్యకు ఫోన్ చేసి భూమి తన పేరు మీదికి రిజిస్ట్రేషన్ చేయాలని అనడంతో ఇద్దరి మధ్య మాటా మాటా పెరిగి తమ్ముడిపై కోపం పెంచుకున్న ఆశయ్య కత్తితో గ్రామ చౌరస్తా వద్ద దశరథ్‌ను కత్తితో పొడవడంతో తీవ్ర గాయాలయ్యాయి. అడ్డుకోబోయిన దశరథ్ కుమారుడు సంగమేశ్వర్ కు సైతం గాయాలు కాగా గ్రామస్థులు గమనించి తీవ్ర గాయాలతో ఉన్న దశరథ్ ను, అతని కుమారుడు సంగమేశ్వర్‌ను మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి దశరథ్ అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. బాధిత కుటుంబీకుల ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

## పంట సాగుచేస్తుంటే అటవీ అధికారుల వేధింపు



**ప్రజాపక్షం/శివ్వంపేట :** అటవీ హక్కుల చట్టం ద్వారా రెండు ఎకరాల సాగు భూమిని అందిస్తే ప్రస్తుతం అటవీ అధికారులు భూమిమీద కాదని నిత్యం మమ్మల్ని వేధిస్తున్నారని రూప్లతండా భూబాధితులు మంగళవారం ఆందోళన చేపట్టారు. మండలంలోని ఖంద్యతండా శివారులో 480 కంపార్టుమెంట్‌లో బానవత్ లక్ష్మి భిక్షపతి కుటుంబానికి 2 ఎకరాల అటవీభూమిని అటవీహక్కుల చట్టం ద్వారా అందించడం జరిగింది.

అప్పటి నుంచి బానవత్ భిక్షపతి ఇదే భూమిలో ఇంటిని నిర్మించుకొని మిగతా దాంట్లో వ్యవసాయం చేసుకుంటూ తన కుటుంబాన్ని పోషించుకుంటుండగా ప్రస్తుతం అటవీ అధికారులు ఇక్కడ వ్యవసాయం చేయొద్దని మమ్మల్ని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని బానవత్ పురుషోత్తం శిరీష దంపతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి కొత్తపేట గ్రామపంచాయతీ పరిధిలోని గిరిజన తండాలలో అటవీ భూములపై ఆధారపడి ఉన్న 89 కుటుంబాలకు అటవీ హక్కుల ద్వారా అధికారులు పట్టాలు ఇస్తే అందులో కొందరు పూర్తిగా ఇటుక బట్టీల వ్యాపారం చేస్తూ కోట్ల రూపాయలు సంపాదిస్తుంటే కనీసం అక్కడ కన్నెత్తి చూడని ఫారెస్టు అధికారులు వ్యవసాయం చేసుకునే బానవత్ లక్ష్మి కుటుంబాన్నే అటవీ అధికారులు టార్గెట్ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అటవీ హక్కుల ద్వారా పట్టాలు పొంది ఇటుక బట్టీల వ్యాపారులు తమకు రూ. ఐదులక్షలు మామూళ్లు ఇస్తున్నారని, మీరు కూడా రూ. రెండు లక్షల లంచం ఇస్తే మీ దగ్గరకు రామని అటవీశాఖ అధికారులు చెబితే మేమెక్కడి నుంచి అంత డబ్బు తేవాలని ప్రాదేయపడ్డా మని అధికారులు కనికరం చూపడం లేదని ఆవేదన వ్యక్తం చే శారు. అటవీ భూములన్నింటిని సర్వే చేయించి అందులో కమర్షియల్ కార్యకలాపాలు చేపడుతున్న వ్యాపారులపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి బానవత్ లక్ష్మి కుటుంబాన్ని వేధిస్తున్న అటవీశాఖ అధికారులపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని పురుషోత్తం దంతపతులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బానవత్ లక్ష్మి , భిక్షపతి, పురుషోత్తం, శిరీష, దేవవత్ రమేశ్, బాబు, దేవావత్ చందర్, కాత్రోత్ హెబ్యానాయక్ తదితరులు ఉన్నారు.

## వికలాంగులకు ఉచితంగా వివాహాలు

'అమ్మ' మ్యాట్రిమోనీ వ్యవస్థాపక ఉభయ రాష్ట్రాల అధ్యక్షుడు బి.ఎం.అర్జున్ రావు

**ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్ :** కరీంనగర్‌లోని ఫిలిం భవన్‌లో అమ్మ అసోసియేషన్ రెండో ఆత్మీయ సమ్మేళనం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మ్యాట్రిమోనీ వ్యవస్థాపక, ఉభయ రాష్ట్రాల అధ్యక్షుడు బిఎం అర్జున్‌రావు, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అసోసియేషన్ పలు కీలక తీర్మాణాలు చేసింది. ఉమ్మడి జిల్లాల్లో మ్యాట్రిమోనీ కార్యాలయాల ఏర్పాటు, ఆపదలో ఉన్నవారికి సంఘం ద్వారా వడ్డీలేని రుణాలు అందించడం, వికలాంగులకు ఉచితంగా వివాహాలు జరిపించడం, సభ్యులు ఎవరైనా హఠాన్మరణం చెందితే వారి కుటుంబానికి ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించారు. కార్యక్రమంలో మ్యాట్రిమోనీ జిల్లా ఉపాధ్యక్షులు ఇరుమల మల్లేశం, కొక్కుల శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి జయరాజు, శ్యామ్, అనంతపురం జిల్లా ఉపాధ్యక్షులు నారాయణ, హైదరాబాద్ ప్రతినిధులు రమ్య, కవిత, సాయి లక్ష్మి, మమత, రవి, మనోహర్ పాల్గొన్నారు.

## ఎరువుల కొరత లేదు

ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** జిల్లాలో ఆయా పంటల సాగుకు సరిపడా యూరియా నిల్వలు ఉన్నాయని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఒక ప్రకటనలో వెల్లడించారు. యూరియా విషయమై రైతులు ఆందోళన చెందవద్దని సూచించారు. ఎరువులను రైతుల పంటల సాగు విస్తీర్ణానికి అనుగుణంగా సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. వ్యవసాయ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎరువులు పక్కదారి పట్టకుండా.. ఇతర అవసరాలకు వాడకుండా చూడాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని సొసైటీలు, ప్రైవేట్ డీలర్ల వద్ద యూరియా అందుబాటులో ఉందని సూచించారు. కనీస సదుపాయాలు కల్పించాలని తెలిపారు. జిల్లాలో యాసంగి సాగు కోసం మొత్తం 21 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం కాగా, ఇప్పటి దాకా 10 వేల 991 మెట్రిక్ టన్నులు పంపిణీ చేశామని వెల్లడించారు. మిగతా కావాల్సిన ఎరువులు కూడా పంపిణీ చేస్తామని తెలిపారు. ప్రైవేట్ డీలర్లు 223, పీసీసీఎస్ షాపులు 54, డీసీఎంఎస్ 16, ఏఆర్ ఎస్ కే 13 ఎరువుల షాపులు ఉన్నాయని వెల్లడించారు.



## బాల్య వివాహ రహిత జిల్లాగా..

**ప్రజాపక్షం/ఇల్లందకుంట:** ఇల్లందకుంట మండలంలోని గ్రామంలో టిఎస్ మోడల్ స్కూల్‌లో మంగళవారం స్నేహిత ఫేస్ టు ప్రోగ్రాంలో భాగంగా బాల్య ముక్త్ భారత్ అభియాన్ వందరోజుల అవగాహన కార్యక్రమంలో విద్యార్థులకు బాల్యవివాహాల నిర్మూలనపై ప్రిన్సిపల్ డి.అయిలయ్య అధ్యక్షతన ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా సాధికారిక కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ ఇరుగంటి శైలజ, పాల్గొని బాల్యవివాహాల వల్ల కలిగే దుష్పరిణామాలు, చట్టపరమైన చర్యలు, బాలికల విద్య యొక్క ప్రాధాన్యతపై వివరించారు. బాల్య వివాహాలు బాలల భవిష్యత్తును ఎలా ప్రభావితం చేస్తాయో ఉదాహరణలతో వివరించి సమాజంలో ప్రతి ఒక్కరు దీనిని నిర్మూలించేందుకు బాధ్యత వహించాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులు ఉపాధ్యాయులతో బాల్య వివాహాలు అడ్డుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ అందజేత



**ప్రజాపక్షం/వీణవంక :** పేద ప్రజలు అనారోగ్యానికి గురయితే ఆపద సమయంలో సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం లాంటిదని గంగారం గ్రామ కాంగ్రెస్ ఇంచార్జి అంబటి సురేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం గంగారం గ్రామ లబ్దిదారులకు సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గూడెపు కోమల్‌రెడ్డి, నల్ల ఈశ్వర్‌రెడ్డి, అంబటి పుల్లెందర్ రెడ్డి, కాసం రవీందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పుల్లూరి కుమార్, కురుమ యాదవ సంఘం నాయకుడు మెర్గవేన రాజయ్య, గ్రామపంచాయతీ వార్డు మెంబర్లు పొన్నాల శ్రీనివాస్, మడికొండ రాజమల్లు, పుల్లూరి పద్మ, గ్రామ యువకులు గోపు పుల్లారెడ్డి, కిషన్‌రెడ్డి, కాసం శ్రీనివాస్ రెడ్డి, బబ్లు, ఆలేటి సాయితేజ రెడ్డి, ఆలేటి బన్నీ, మిరాల వంశీధర్‌రెడ్డి, జక్కుల కుమార్, తదితరులున్నారు.

## మెనూ కచ్చితంగా పాటించాలి



వేములవాడ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయంలో ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆకస్మిక తనిఖీ

**ప్రజాపక్షం/వేములవాడ టౌన్ :** విద్యార్థులకు మెనూ కచ్చితంగా పాటిస్తూ నాణ్యమైన భోజనం ఇవ్వాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. వేములవాడ పట్టణంలోని ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల విద్యాలయం (మానాల)లో ఇంచార్జి కలెక్టర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు హాజరు రిజిస్టర్, స్టోర్ రూమ్‌లో ఆహార సామగ్రి, కోడి గుడ్లు, కూరగాయలు, విద్యార్థుల కోసం సిద్ధం చేసిన ఆహార పదార్థాలను పరిశీలించారు. మెనూ ప్రకారం చికెన్, మటన్, కోడి గుడ్లు ఇస్తున్నారా అని ఆరా తీశారు. ఈ సందర్భంగా విద్యాలయంలో విద్యార్థులందరూ చదువు పై శ్రద్ధ పెట్టాలని, ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లాలని ఇంచార్జి కలెక్టర్ పేర్కొన్నారు. తాము అనుకున్న ఉద్యోగాలు, ఉన్నత స్థానాలకు ఎదగాలని పిలుపు ఇచ్చారు. ఆర్థికంగా స్థిరపడాలని ఆకాంక్షించారు. విద్యాలయం ఆవరణ శుభ్రంగా ఉండాలని, ప్రభుత్వ మెనూ ప్రకారం భోజనం పెట్టాలని ఆదేశించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది సమయపాలన పాటించాలని, విధుల్లో అలసత్వం ప్రదర్శించవద్దని సూచించారు.

## పాలిచ్చే పశువులకు ప్రోటీన్‌తో కూడిన దాణా : ఫీడ్ బజార్ జిఎం

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** పాలిచ్చే పశువులకు ప్రోటీన్‌తో కూడిన దాణాను అందించాలని ఫీడ్ బజార్ జనరల్ మేనేజర్ వంగ శ్రీకాంత్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని రాజేశ్వర కాంప్లెక్స్‌లో ఫీడ్ బజార్ పశువుల దాణా సెంటర్‌ను ప్రారంభించారు. శ్రీ వినాయక క్యాటిల్ ఫీడ్ బజార్ ఫ్రాంచైజీ ఓనర్ చింతోజు రమేష్ ఆధ్వర్యంలో పాడి రైతులకు దాణాను వాడే విధానంపై అవగాహన కల్పించారు. ఈ దాణాలో 24 శాతం ప్రోటీన్ ఉంటుందన్నారు. ఈ దాణాను పశువులకి అందించడం ద్వారా పాల దిగుబడి పెరిగి, పాలలో వెన్న శాతం పెరుగుతుందన్నారు. ఈ దాణాను పాడి రైతులు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో చింతోజు నారాయణ, ఏరియా బిజినెస్ మేనేజర్ పోలు చందు, బిజినెస్ ఆఫీసర్ వంశీ, కార్తీక, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల ప్రతిభను ప్రపంచానికి చాటాలి




**ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్ :** గ్రామీణ ప్రాంతాలలో చదవుతున్న విద్యార్థులలో అపారమైన జ్ఞానం దాగి ఉందని, వారి ప్రతిభను వెలికి తీసి ప్రపంచానికి పరిచయం చేయాలని ప్రముఖ వ్యాపారవేత్త వంగ రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం తెలంగాణ గణిత ఫోరం ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లా చిన్నకోడూర్ మండలం ఇబ్రహీంనగర్ ప్రభుత్వ పాఠశాలలో జరిగిన జాతీయ గణిత దినోత్సవం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వంగ రాజేశ్వర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణితం అనేది పరీక్షల్లో సాధించే మార్కుల కోసం కాదని, జీవితాన్ని సరైన దిశలో నడిపించే, ఆలోచనా శక్తిని పెంపొందించే శాస్త్రం అని అన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు, తెలంగాణ గణిత ఫోరం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మహా శివరాత్రి జాతరకు సమన్వయంతో సౌకర్యాలు

జాతర సమన్వయ సమావేశంలో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జాతర చైర్ పర్సన్ ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్

**ప్రజాపక్షం/వేములవాడ టౌన్ :** మహా శివరాత్రి జాతరకు వచ్చే భక్తులకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జాతర చైర్ పర్సన్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 14, 15, 16 తేదీల్లో మహా శివరాత్రి జాతర నిర్వహించనున్న నేపథ్యంలో వేములవాడలోని భీమేశ్వర సదన్ ఆవరణలో వివిధ శాఖల అధికారులతో జాతర సమన్వయ సమావేశాన్ని మంగళవారం జాతర ఛైర్మన్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధ్యక్షతన నిర్వహించగా, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఎస్పీ మహేష్ బీ గితే, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జాతర ఛైర్మన్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడారు. భక్తులు భీమేశ్వర ఆలయంలో స్వామి వారి దర్శనాన్ని వేగంగా, సౌకర్యంగా చేసుకునేలా ఏర్పాట్లు ముమ్మరంగా చేయాలని వివరించారు. వేములవాడ తిప్పాపూర్ బస్టాండ్ నుంచి శ్రీ భీమేశ్వర ఆలయం వరకు, వేములవాడ నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే రోడ్లలో మరమ్మత్తులు, నిర్మాణాలు పక్కా ప్రణాళిక పూర్తి చేయాలని ఆర్ అండ్ బీ అధికారులను ఆదేశించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా బస్ లు సిద్ధం చేయాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. తిప్పాపూర్ ఆర్టీసీ బస్‌స్టాండ్‌లో తాగు నీరు, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలని, హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి దానికి ఒక అధికారిని నియమించాలని ఆదేశించారు. పారిశుధ్య పనుల నిర్వహణ వేములవాడ మున్సిపల్, జిల్లా పంచాయతి అధికారి సంయుక్తంగా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని, ఎక్కడా ఇబ్బంది రాకూడదని స్పష్టం చేశారు. ఆలయ ఆవరణలో 24 గంటలపాటు వైద్య బృందం, హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని, ఫైర్ సేఫ్టీ అధికారులు ఆలయంలో పరిశీలించి, కావాల్సిన పరికరాలు వివరాలు అందజేయాలని సూచించారు. జాతర ఆవరణలో ప్లాస్టిక్ వస్తువులు వినియోగించకుండా చూడాలని, సమ్మక్క సారలమ్మ జాతర నేపథ్యంలో భక్తుల కోసం వైద్య




బృందం అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రతిచోట సైన్ బోర్డ్‌లు ఉండాలని పేర్కొన్నారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆహార పదార్థాలను తనిఖీ చేయాలని సూచించారు. ప్రతి శాఖ అధికారి తమ పూర్తి యాక్షన్ ప్లాన్‌తో రావాలని తెలిపారు. దర్శనం, వెహికల్ ఇతర పాస్ లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పంపిణీ చేస్తామని విప్, ఇంచార్జి కలెక్టర్ స్పష్టం చేశారు. మహా శివరాత్రి సందర్భంగా ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటామని ఎస్పీ మహేష్ బీ గితే తెలిపారు. సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతరకు వచ్చే వీఐపీల దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తామని వివరించారు. వేములవాడ లో కావాల్సిన సైన్ బోర్డ్, సిసి కెమెరాలు ఉంచాలని సూచించారు. ట్రాఫిక్ ఇబ్బందులు రాకుండా వాలంటీర్‌లను తమకు అప్పగించాలని వివరించారు. సమావేశంలో ఏఎస్పీ రుత్విక్ సాయి, ఆర్డీఓ రాధాబాయి, ఆలయ ఈఓ రమాదేవి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత తదితరులు ఉన్నారు.

# జూలైలోపు కూనారం ఆర్ఓబి నిర్మాణం పూర్తి

జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**ప్రజాపక్షం/పెద్దపల్లి/పెద్దపల్లి రూరల్ :** 2026 జూలైలోపు కూనారం ఆర్ఓబి నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకుని రావాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. మంగళవారం పెద్దపల్లి కూనారం రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి, ఆర్ అండ్ బి అతిథి గృహం ప్రహరీ గోడ, జడ్పి కార్యాలయ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ.119 కోట్ల 50 లక్షల వ్యయంతో పెద్దపల్లి కూనారం రైల్వే ఓవర్ బ్రిడ్జి ప్రభుత్వం నిర్మిస్తుందని తెలిపారు. పెద్దపల్లి కూనారం ఆర్ఓబీ బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన పెండింగ్ భూ సేకరణ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ఆర్ అండ్ బి అధికారులకు అప్పగించాలని కలెక్టర్ రెవెన్యూ డివిజన్ అధికారికి సూచించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు విడుదలైన నేపథ్యంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు వేగవంతం చేయాలని, జూలై 2026 నాటికి ఆర్ఓబీ పూర్తి చేసి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకుని రావాలని కలెక్టర్ ఆదేశించారు. మార్చి 2026 నాటికి అండర్ పాస్ నిర్మాణ పనులు రైల్వే శాఖ పూర్తి చేయాలని అన్నారు. రైల్వే ఓవర్ బ్రిడ్జికి సంబంధించిన సర్వీస్ రోడ్డు పనులు సమాంతరంగా జరగాలని కలెక్టర్ తెలిపారు. పెద్దపల్లి తహసిల్దార్ కార్యాలయ సమీపంలో నిర్మిస్తున్న జడ్పి కార్యాలయం నిర్మాణ పనులు నెమ్మదిగా జరుగుతున్నాయని, పనులలో వేగం పెంచాలని ఏప్రిల్ 2026 నాటికి జడ్పీ కార్యాలయం అందుబాటులోకి తీసుకొని రావాలని కలెక్టర్ సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి బి.గంగయ్య, ఈఈ ఆర్ &బీ భావ్ సింగ్, తహసిల్దార్ రాజ్ కుమార్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

**సన్న వడ్ల బోనస్ రైతుల ఖాతాలలో జమ**

పెద్దపల్లి జిల్లాలో సన్న రకం వడ్లకు బోనస్ కింద ఇప్పటి వరకు రూ.96 కోట్ల 85 లక్షలు చెల్లించడం జరిగిందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సంవత్సరం ఖరీఫ్ 2025–26 వరి ధాన్యం కొనుగోళ్లలో భాగంగా పెద్దపల్లి జిల్లాలో 333 కొనుగోలు కేంద్రా



లను ఏర్పాటు చేయగా, డిసెంబర్ 29 నాటికి 272 కొనుగోలు కేంద్రాలలో ధాన్యం కొనుగోళ్ళు పూర్తి కావడం జరిగిందని తెలిపారు. మిగిలిన 43 కేంద్రాలలో ధాన్యం సేకరణ త్వరితగతిన పూర్తి కావడానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఇందులో భాగంగా, జిల్లాలో ఇప్పటివరకు 333 కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రభుత్వ ఆదేశాల క్రమము కనీస మద్దతు ధర చెల్లించి, రూ.834 కోట్లతో, 3,49,118.400 క్వింటాళ్ళ ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందన్నారు. ఖరీఫ్ 2024–25లో బాగంగా ఈ తేది నాటికి జిల్లాలో 2,90,420.941 క్వింటాళ్ళ ధాన్యంను కొనుగోలు చేయగా, ఈ ఏడాది అదనంగా 58,697.459 క్వింటాళ్ళ ధాన్యం కొనుగోలు చేయడమైనది. ఈ కొనుగోలు చేసిన ధాన్యంను, కొనుగోలు కేంద్రాల నుండి ఎప్పటికప్పుడు రైస్ మిల్లర్లకు తరలించడం జరిగిందని తెలిపారు. నేటివరకు ప్రభుత్వం ద్వారా, జిల్లాలో కనీస మద్దతు ధర రూ.822 కోట్ల నిధులను, సన్నరకం ధాన్యం కొనుగోళ్ల బోనస్ విషయమై ప్రభుత్వం ద్వారా రూ.96 కోట్ల 85 లక్షల నిధులను రైతుల ఖాతాలో జమ చేయడం జరిగిందన్నారు. సిఎంఆర్ డెలివరిలో బాగంగా, ప్రభుత్వ నిబంధనల క్రమము ఖరీఫ్ 2024–25 సీజన్‌కి సంబంధించి 100% పూర్తి చేయడం జరిగింది, రబీ 2024–25 సంబంధించి నేటి వరకు 79% ప్రస్తుత ఖరీఫ్ 2025–26 సీజన్‌కి సంబంధించి కూడా సిఎంఆర్ డెలివరి ప్రారంభించడం జరిగిందని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

## కరీంనగర్ శివారులో పులి సంచారం





గ్రామాల్లో ప్రజల భయాందోళన

**ప్రజాపక్షం/కొత్తపల్లి :** కరీంనగర్ మండలం బహదూర్‌ఖాన్‌పేట్, వెదురుగట్ట గ్రామాల శివారు ప్రాంతాల్లో పులి సంచారం కలకలం రేపుతోంది. బహదూర్‌ఖాన్‌పేట శివారులో రైతు తన పొలంలో పెద్ద అడుగుజాడలు గుర్తించి పోలీసులకు, అటవీశాఖకు సమాచారం అందించాడు. ఘటనాస్థలానికి చేరుకున్న అటవీశాఖ అధికారులు పరిశీలన చేసి అవి పులి అడుగుజాడలేనని నిర్ధారించారు. ఇదే ప్రాంతంలోని ఓ మామిడితోటలోనూ పులి అడుగుజాడలు కనిపించినట్లు అధికారులు తెలిపారు. ఆయా చోట్ల శాంపిల్స్ సేకరించారు. అడుగులకు సంబంధించిన ఆనవాళ్లను పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపించనున్నట్లు సమాచారం. పులి సంచారం ఉండవచ్చని అంచనా వేస్తున్న నేపథ్యంలో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ సూచించింది. రాత్రి వేళల్లో ఒంటరిగా పొలాలు, అటవీ ప్రాంతాలకు వెళ్లొద్దని హెచ్చరించింది. కరీంనగర్ నగరానికి సమీప గ్రామాల్లోనే పులి సంచారం కొనసాగుతుండడంతో జిల్లావ్యాప్తంగా ఆందోళన నెలకొంది. పులి కదలికలపై నిఘా కొనసాగిస్తున్నామని, గస్తీ పెంచామని అటవీశాఖ అధికారులు తెలిపారు.

## రైతులకు ఎలాంటి ఇబ్బందులు రానివ్వొద్దు

అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే




**ప్రజాపక్షం/కరీంనగర్ :** మండల, క్లస్టర్ స్థాయిలో వ్యవసాయ అధికారులు ప్రతిరోజు యూరియా సరఫరాపై పర్యవేక్షించాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో మండల వ్యవసాయ అధికారులు, ప్రాథమిక సహకార సంఘాల అధికారులతో యూరియా నిల్వలు, సరఫరా, వ్యవసాయ శాఖ కేంద్ర ప్రభుత్వ పథకాలు, ధాన్యం కొనుగోలు తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతి మండలంలోని ప్రైవేటు డీలర్లు, మార్క్ ఫెడ్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల గోదాముల్లో నిల్వలను, భవిష్యత్తు అవసరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో 4246 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. ప్రస్తుత అవసరానికి యూరియా నిల్వలు సరిపోతాయని అన్నారు. అధిక ధరలకు విక్రయించినా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి రోజు ఎరువుల నిల్వలు, అమ్మకాల వివరాలు జిల్లా కేంద్రానికి తెలియజేయాలని అన్నారు. పీఎం సమ్మాన్, ఫసల్ బీమా, పీఎం కిసాన్ యోజన, కృషి విజ్ఞాన కేంద్రం, ధాన్యం కొనుగోలు తదితర అంశాలు కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై సమీక్షించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి, మండల వ్యవసాయ అధికారులు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల బాధ్యులు, మార్కెటింగ్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా ముక్కోటి ఏకాదశి వేడుకలు



**ప్రజాపక్షం/చిగురుమామిడి :** కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం సుందరగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం ముక్కోటి ఏకాదశి వేడుకలు వైభవంగా జరిగాయి. ఉదయం 4 గంటల నుంచి భక్తులు స్వామివారిని ఉత్తర ద్వారం నుంచి దర్శించుకునేందుకు బారులు తీరారు. భక్తుల దర్శనం కోసం స్వామివారిని పూలమాలతో విద్యుత్ బల్బులతో అర్చకులు శేషం శ్రీనివాస్‌చార్యులు ఆధ్వర్యంలో అందంగా అలంకరించారు. ఈ సంధర్భంగా అర్చకులు శ్రీనివాస్ చార్యులు మాట్లాడుతూ వైకుంఠ ఏకాదశి రోజున ఉత్తర ద్వారం ద్వారా స్వామి వారిని దర్శించుకోవడం అత్యంత పుణ్యఫలమని, సమస్త పాపాలు నశించి మోక్షం లభిస్తుందని భక్తుల నమ్మకం. పెద్ద ఎత్తున భక్తులు తరలిరావడంతో క్యూలో గంటల తరబడి నిలబడాల్సిన పరిస్థితి నెలకొంది. రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి దంపతులు ఉత్తర ద్వారా ద్వారా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. హుస్నాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఆలయం వద్ద శ్రమదానం నిర్వహించారు. హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, గ్రామ సర్పంచ్ జంగా శిరీష వెంకటరమణారెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ చొల్లేటి శంకరయ్య, మాజీ ఎంపిపి కొత్త వినీత రెడ్డి, పలు గ్రామాల సర్పంచులు కాటం సంపత్‌రెడ్డి, బోయిని రమేష్, ఆకవరం భవాని శివప్రసాద్, కొంకట మౌనిక, పీచు సత్యనారాయణరెడ్డి, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య, గ్రామ ఉపసర్పంచ్ మెడబోయిన రాజు, జీల సంపత్‌యాదవ్, శేషం నరసింహాచార్యులు, పూల లచ్చిరెడ్డి, గందె రాజయ్య, ఎనగందుల శారద లక్ష్మ ణ్, బూర వీరేశం, దుబాల శ్రీనివాస్, వార్డు సభ్యులు పెసరు ప్రమీల శ్రీనివాస్, వంతడుపుల దిలీప్ కుమార్, కాశబోయిన రమేష్, మంథని ప్రియాంక మహేందర్, నాంపెల్లి శిరీష సురేష్, శ్రీమూర్తి శ్రీనివాస్, పెసరి రాధాకృష్ణ, ఆలయ మాజీ చైర్మన్ తాళ్లపల్లి రాజయ్య, గందె సంపత్ పాల్గొన్నారు.

## కోతుల బెడద నివారించండి..!

అధికారులను, సర్పంచ్‌లను వేడుకుంటున్న ప్రజలు

**ప్రజాపక్షం/ముత్తారం :** కోతుల బెడదతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కోతులు గుంపులుగా తిరుగుతూ ఇళ్లలోని వస్తువులను ఎత్తుకెళ్తున్నాయని, అడ్డుకుంటే దాడికి ప్రయత్నిస్తున్నాయని వాపోయారు. దీంతో భయాందోళనకు గురవుతున్న గ్రామస్తులు, అధికారులు, నూతనంగా గెలిచిన సర్పంచులు తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ సందర్భంగా పలు గ్రామాలకు చెందిన ప్రజలు మాట్లాడుతూ కోతులు ఇళ్లలో చొరబడి ప్రజలను నానా ఇబ్బందులకు గురి చేస్తున్నాయన్నారు. అలాగే కూరగాయ తోటలను, వరి నాడుముల తోపాటు వరి పంటలను నాశనం చేస్తున్నాయని తెలిపారు. అంతేకాకుండా పెంకుటిల్లు పెంకులను పీకి వేస్తూ, రేకుల ఇండ్లను రేకులను పగులగొడుతూ నానా హంగామా చేస్తున్నాయి. అంతేకాకుండా కోతుల దాడుల కారణంగా పలువురు గాయాలపాలయ్యారని తెలిపారు. వెంటనే ఉన్నతాధికారులు, ఇటీవల గెలిచిన సర్పంచులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.



# ఇరిగేషన్ ప్రాజెక్టులపై అవగాహనతో మాట్లాడాలి

మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

**ప్రజాపక్షం/ధర్మపురి :** ధర్మపురి నియోజకవర్గ పరిధిలోని ఇరిగేషన్ ప్రాజెక్టులు, రోల్లవాగు, అక్కపెల్లి చెరువుపై మంత్రి లక్ష్మ ణ్ కుమార్ అవగాహనతో మాట్లాడాలని మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ధర్మపురిలో మంగళవారం పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐదు రోజుల క్రితం మంత్రి అడ్లూరి నియోజవర్గంలోని ఇరిగేషన్ ప్రాజెక్టులపై మాట్లాడారని అవగాహనాలేమితో ఆయన చేసిన వాఖ్యలు ఆశ్చర్యానికి గురిచేసిందని పేర్కొన్నారు. ధర్మపురి రైతాంగం చిరకాల కలైన అక్కపెల్లి లిఫ్ట్ కోసం తమ హయాంలో రూ.72 కోట్లు మంజూరు చేసామని అంతకుముందు చెరువు మరమ్మతులు, బ్రిడ్జి ,తూము నిర్మాణానికి రూ.4 కోట్లు మంజూరు చేసినామని ఈక్రమంలో ఎన్నికలు రావడం జరిగిందని అన్నారు. ఈ లిఫ్ట్ పూర్తయితే మండలంలోని పలు గ్రామాల్లోని 8 వేల ఎకరాలకు సాగునీరు అందేదని చెప్పారు. గడిచిన రెండేళ్లలో మంత్రి అడ్లూరి దీనిపై శ్రద్ధ పెట్టిఉంటే ఎప్పుడో పూర్తయ్యేదని చెప్పారు. ఇరిగేషన్ మంత్రితో సాటి మంత్రిగానున్న అడ్లూరి సమస్యలున్నాయని నిధులు మంజూరు చేయాలని విన్నవించడం ఏంటని కొప్పుల ప్రశ్నించారు.ఎత్తిపోతల కు సంపూర్ణంగా నిధులున్నాయనే విషయంలో మంత్రి అవగాహన లేమిని చెబుతున్నదన్నారు. తమ హయాంలో గోదావరి నదిపై 12 లిఫ్టులను 250 కోట్లు వెచ్చించి 22 వేల ఎకరాల సాగుకు నీరందించామని,అలాగే రోల్లవాగు ప్రాజెక్టును పావు టీఎంసీ నుండి ఒక టీఎంసీకి



పెంచామని తెలిపారు. నియోజకవర్గంలో లక్ష ఎకరాలకు నీళ్లు ఇవ్వాలనే సంకల్పం తమదన్నారు. మాట్లాడిన ప్రతీసారీ హరీష్ రావు సిద్దిపేటకు,కేటీఆర్ సిరిసిల్లకు నీళ్లు తరలిస్తున్నారని అడ్లూరి అంటారని ఏనాడైనా ఒక్క ఎకరం ఎండిన దాఖలాలు ఉన్నాయని ఈశ్వర్ ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో 45 లక్షల ఆయకట్టు స్థిరీకరణ చేయడానికి నిర్మించామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేక కాలయాపన మాటలతో ప్రజల్ని మభ్యపెడుతోందని ధ్వజమెత్తారు. మంత్రి అడ్లూరి నియోజకవర్గానికి తీసుకొస్తామని చెప్పిన బస్సు డిపో, రెవెన్యూ డివిజన్, పాలిటెక్నిక్, డిగ్రీ కాలేజీ, ఐటీఐ తీసుకురావాలని కొప్పుల ఈశ్వర్‌ను మించి అభివృద్ధి చేయాలని సవాల్ విసిరారు. ఆయన రాజీనామాను తాము ఏనాడు కోరలేదన్నారు. 5 ఏళ్ళు వుండి పనితనం చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్ రెడ్డి, అయ్యోరి రాజేష్, సంగి సత్తెమ్మ, ఐ.రామయ్య, రంజిత్ తదితరులు ఉన్నారు.

## హనుమాజీపేట, చెక్కపల్లి గ్రామాల్లో మోదీ గిఫ్ట్ సైకిళ్ల పంపిణీ



**ప్రజాపక్షం/వేములవాడ :** వేములవాడ రూరల్ మండలం భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు బూరుగుపల్లి పరమేష్ ఆధ్వర్యంలో హనుమాజీపేట, చెక్కపల్లి గ్రామాలలో కరీంనగర్ పార్లమెంటరీ నియోజకవర్గంలో విద్యార్థుల విద్యాభివృద్ధి లక్ష్యంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ మోదీ గిఫ్ట్ పేరుతో సైకిళ్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వేములవాడ నియోజకవర్గ ఇంచార్జి డాక్టర్ చెన్నమనేని వికాస్ విద్యార్థులకు సైకిళ్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులకు అండగా నిలవాలన్న లక్ష్యంతోనే కేంద్ర మంత్రి బండి సంజయ్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారని తెలిపారు. ప్రతిరోజూ ప్రజల మధ్య ఉండి, విద్యార్థుల భవిష్యత్తుపై ప్రత్యేక దృష్టి పెట్టే నాయకుడు బండి సంజయ్ అని డాక్టర్ వికాస్ ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఎమ్ఇఓ కిషన్, ప్రిన్సిపల్ శ్రీకాంత్ రావు, హనుమాజీపేట సర్పంచ్ జంకే మధు, బొల్లారం సర్పంచ్ సౌజన్య మల్లికార్జున్, అడ్డిక లక్ష్మి శ్రీనివాస్ రెడ్డి, ఎదురుగట్ల సర్పంచ్ కటారి సంధ్యా తిరుపతి, అచ్చన్నపేట ఉప సర్పంచ్ దానే తిరుపతి, నమిలిగుండపల్లి ఉపసర్పంచ్ గుంటి వంశీకృష్ణ, వార్డు సభ్యులు జిల్లా ఉప అధ్యక్షులు బండ మల్లేశం, జిల్లా కౌన్సిల్ మెంబర్ జక్కుల తిరుపతి, మండల ప్రధాన కార్యదర్శి తోట శేఖర్, మండల ఉపాధ్యక్షులు పల్లికొండ నారాయణ, లింగంపల్లి కుంటయ్య, కార్యదర్శులు గుమ్మడి శ్రీనివాస్, బూత్ అధ్యక్షులు ఆడెపు విజయ్, కల్లెడ్ల నరేష్, కంకణాల రాజు, ఆది జలంధర్, నల్ల వెంకటరెడ్డి, లింగంపల్లి రాజు, చొప్పరి కరుణాకర్, కొండవీని ప్రశాంత్, మార కరుణాకర్ రెడ్డి, రోడ్ల మహేష్, సింగరవేణి హరీష్, అడ్డిక సంతోష్ రెడ్డి సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# క్రీడ



## వేలానికి బ్రాడ్‌మాన్ బ్యాగీగ్రీన్ క్యాప్

ఆస్ట్రేలియా దిగ్గజ మాజీ క్రికెటర్, సర్ డోనాల్డ్ బ్రాడ్‌మాన్ ధరించిన అరుదైన బ్యాగీ గ్రీన్ క్యాప్‌ను వేలం వేయనున్నారు. 1947–48లో భారత్‌తో జరిగిన టెస్టు సిరీస్ సమయంలో బ్రాడ్‌మాన్ ఆ క్యాప్‌ను ధరించారు. వచ్చే నెలలో ఆ క్యాప్‌ను వేలం వేస్తారు. భారతీయ ఆల్ రౌండర్ శ్రీరంగ వాసుదేవ్ సోహోనికి ఆ క్యాప్‌ను బ్రాడ్‌మాన్ గిఫ్ట్‌గా ఇచ్చినట్లు తెలుస్తోంది. స్వతంత్ర్య దేశంగా తొలి సారి ఇండియా 1947లో ఆస్ట్రేలియా క్రికెట్ టూరుకు వెళ్లింది. ఆ సమయంలో ఇండియన్ ప్లేయర్‌కు బ్రాడ్‌మాన్ ఆ క్యాప్ బహూకరించినట్లు తెలుస్తున్నది. క్రికెట్ ఆడిన రోజుల్లో బ్రాడ్‌మాన్ అనేక క్యాప్‌లను ధరించారు. చాలా వరకు క్యాప్‌లు మ్యూజియంల్లో, ప్రైవేటు కలెక్షన్ సెంటర్లలో పెట్టారు. కానీ శ్రీరంగ వాసుదేవ్‌కు గిఫ్ట్ ఇచ్చిన ఈ క్యాప్‌ను మాత్రం ఇప్పటి వరకు పబ్లిక్‌లో ప్రదర్శించలేదు. సేల్‌కు కూడా పెట్టలేదు. గడిచిన 75 ఏళ్ల నుంచి ఆ క్యాప్ బ్రాడ్‌మాన్ ఫ్యామిలీ ఓనర్‌షిప్‌లోనే ఉన్నది. బ్రాడ్‌మాన్‌కు చెందిన అతి ముఖ్యమైన వస్తువుల్లో ఇదొకటి అని లాయిడ్స్ ఆక్షన్ హౌజ్ పేర్కొన్నది.

భారత్‌తో జరిగిన 1947 సిరీస్‌లో బ్రాడ్‌మాన్ అద్భుతమైన బ్యాటింగ్‌ను ప్రదర్శించారు. అతను ఆరు ఇన్నింగ్స్‌లో 715 రన్స్ చేశాడు. 178 సగటుతో బ్యాటింగ్ చేశాడు. ఆ సిరీస్‌లో ఆస్ట్రేలియా 40 తేడాతో విక్టరీ కొట్టింది. బ్రాడ్‌మాన్ ఆ సిరీస్‌లో మూడు సెంచరీలు, ఓ డబుల్ సెంచరీ నమోదు చేశాడు. ఒక డాలర్‌తో లాయిడ్స్ ఆక్షన్స్ వేలం నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. జనవరి 26వ తేదీన వేలం ప్రక్రియ ముగుస్తుంది.



## అగ్రస్థానంలో అర్జున్

చెస్ చాంపియన్ మ్యాగ్నస్ కార్ల్‌సన్ మళ్లీ తన సహనాన్ని కోల్పోయారు. వరల్డ్ ర్యాపిడ్ చెస్, వరల్డ్ బ్లిట్జ్ చాంపియన్ అయిన కార్ల్‌సన్.. తాజాగా దోహాలో జరుగుతున్న ఫిడే వరల్డ్ బ్లిట్జ్ చాంపియన్‌షిప్‌లో ఓటమిని తట్టుకోలేక ఆవేశానికి గురయ్యాడు. టేబుల్‌ను అతను బలంగా కొట్టాడు. భారత గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఎరిగయిసి చేతిలో ఓడిన నార్వే చెస్ గ్రాండ్‌మాస్టర్ మ్యాగ్నస్ కోపంతో క్వీన్ పావును పడేశాడు. గ్రాండ్‌మాస్టర్ అర్జున్ తన టెక్నిక్‌తో చాంపియన్ ప్లేయర్ కార్ల్‌సన్‌కు షాక్ ఇవ్వడంతో అతను టెంపర్ కోల్పోయాడు. జూన్ నెలలో కూడా ఇలాగే మ్యాగ్నస్ తన సహనాన్ని కోల్పోయిన విషయం తెలిసిందే. నార్వే చెస్ టోర్నీలో వరల్డ్ చాంపియన్ డీ.గుకేశ్ చేతిలో ఓడిన తర్వాత అతను ఆవేశాన్ని ఆపుకోలేకపోయాడు. దోహాలో జరిగిన కార్ల్‌సన్ ఘటనకు చెందిన వీడియో ప్రస్తుతం వైరల్ అవుతున్నది. భారతీయ ప్లేయర్ అర్జున్ తన దూకుడు స్టయిల్ ఆటతో ఇప్పటికే 8 విక్టరీలు నమోదు చేశాడు. రెండు మ్యాచ్‌లు డ్రా అవ్వగా, ఒక దాంట్లో ఓడిపోయాడు. 9వ రౌండ్‌లో కార్ల్‌సన్‌ను ఓడించడంతో అతను కీలక పొజిషన్‌లోకి వచ్చేశాడు. బ్లాక్ పీస్‌లతో అతను మ్యాగ్నస్‌ను ఓడించాడు. ఈ ఏడాది కార్ల్‌సన్‌ను రెండోసారి ఓడించాడు అర్జున్. నార్వే చెస్ టోర్నీలోని క్లాసికల్ ఫార్మాట్‌లో కార్ల్‌సన్‌ను ఓడించాడు.

## ఢిల్లీ, ఆర్సీబీకి పెద్ద షాక్..

### టోర్నీకి ముందే వైదొలిగిన మ్యాచ్ విన్నర్లు!

మహిళల ప్రీమియర్ లీగ్ నాలుగో సీజన్ ముందే రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు పెద్ద షాక్ తగిలింది. నాలుగో సీజన్ కోసం భారీ ధరకు అట్టిపెట్టుకున్న మ్యాచ్ విన్నర్ ఆస్ట్రేలియా క్రికెటర్ ఎలీసా పెర్రీ 'అందుబాటులో ఉండను' అని చెప్పేసింది. ఢిల్లీ క్యాపిటల్స్ పేసర్ అనాబెల్ సథర్‌లాండ్ సైతం 'నాలుగో సీజన్ ఆడడం లేదు' అని ఫ్రాంచైజీకి తెలిపింది. దాంతో.. మ్యాచ్ విజేతలైన వీరిద్దరి సేవల్ని ఆర్సీబీ, ఢిల్లీ కోల్పోనున్నాయి. డబ్ల్యూపిఎల్ నాలుగో సీజన్ సన్నాహకాల్లో మునిగిపోయిన ఆర్సీబీ, ఢిల్లీ క్యాపిటల్స్‌కు ఊహించని షాకిచ్చారు ఆస్ట్రేలియా క్రికెటర్లు. జనవరి 9 నుంచి ప్రారంభం కానున్న టోర్నీకి ముందే మేము వైదొలుగుతున్నాం అని చెప్పేశారు. నిరుడు బెంగళూరు ట్రోఫీ గెలుపొందడంలో కీలకమైన విధ్వంసక ఆల్‌రౌండర్ ఎలీసా పెర్రీ వ్యక్తిగత కారణాలతో తప్పుకుంది. ఢిల్లీ ప్రధాన పేసర్ అనాబెల్ సథర్‌లాండ్ సైతం వ్యక్తిగత కారణాలతోనే టోర్నీకి అందుబాటులో ఉండనని తెలిపింది. దాంతో.. పెర్రీ స్థానంలో సయాలీ సత్ఘరేను తీసుకుంది ఆర్సీబీ. రూ.30 లక్షల కనీస ధరకు సయాలీ బెంగళూరు స్క్వాడ్‌లో చేరనుంది. సథర్‌లాండ్ స్థానాన్ని ఆస్ట్రేలియాకే చెందిన స్పిన్నర్ అలనా కింగ్ భర్తీ చేయనుంది. ఇటీవలే వన్డే ప్రపంచకప్‌లో దక్షిణాఫ్రికాపై ఏడు వికెట్లతో మెరిసిన ఈ యువకెరటంతో రూ.60 లక్షలకు ఢిల్లీ ఒప్పందం కుదుర్చుకుంది.

### రూ.2 కోట్లకు అట్టిపెట్టుకున్నా

మహిళల ప్రీమియర్ లీగ్ మూడో సీజన్‌లో అలీసా పెర్రీ మెరుపు ఇన్నింగ్స్‌లతో ఆర్సీబీని గెలిపించింది. 9 మ్యాచుల్లో 347 పరుగులు చేసిందీ ఆల్‌రౌండర్. దాంతో, నాలుగో సీజన్ కోసం పెర్రీని రూ.2 కోట్లకు ఆర్సీబీ అట్టిపెట్టుకుంది. ప్రధాన పేసరైన సథర్‌లాండ్‌ను ఢిల్లీ రూ.2.2 కోట్లకు రీటైన్ చేసుకుంది. కానీ, వీరిద్దరూ వ్యక్తిగత కారణాలతో డబ్ల్యూపీఎల్ 2026 నుంచి వైదొలిగారు. యూపీ వారియర్స్ సైతం స్క్వాడ్‌లో ఒక మార్పు చేసింది.



టీ20 వరల్డ్ కప్ క్వాలిఫయర్స్‌కు ఎంపికైన తారా నోరిస్ స్థానంలో చార్లీ నాట్(ఆస్ట్రేలియా)ను రూ.10 లక్షలకు తీసుకుంది.




## ఒకవైపు పురోగతి.. మరోవైపు అసమానతలు..

ప్రపంచవ్యాప్తంగా మహిళల స్థితి 2025లోనూ, పురోగతి....అసమానతల మధ్య నిలిచింది. విద్య, సాంకేతిక పరిజ్ఞానం, ప్రజాజీవితం వంటి రంగాల్లో మహిళల భాగస్వామ్యం పెరిగి వారి స్వరం బలపడింది. అయితే సమాన వేతనం, ఉద్యోగ భద్రత, రాజకీయ ప్రతినిధిత్వం, భద్రత వంటి అంశాల్లో ఇంకా స్పష్టమైన అసమానతలు కొనసాగుతున్నాయి. డిజిటల్ ప్రపంచం మహిళలకు కొత్త అవకాశాలు ఇచ్చినప్పటికీ, ఆన్‌లైన్ వేధింపులు మరియు వెలికితీత కూడా పెరిగాయి. సామాజిక ఉద్యమాలు, హక్కుల కోసం పోరాటాలు మహిళలను మరింత చైతన్యవంతులుగా మార్చుతున్నాయి. మొత్తంగా 2025 మహిళలకు శక్తివంతమైన అవకాశాల కాలమే అయినా, సంపూర్ణ సమానత్వం సాధించాల్సిన పోరాటం ఇంకా కొనసాగుతూనే ఉంది. సామాజిక స్థితి, లింగ సమానత్వం మార్పు దశలో ఉన్నాయి. మహిళల విద్యా స్థాయి, ప్రజాజీవితంలో భాగస్వామ్యం పెరుగుతున్నప్పటికీ, లింగ వివక్ష ఇంకా పూర్తిగా తొలగిపోలేదు. పని ప్రదేశాల్లో సమాన అవకాశాలు, సమాన వేతనం మహిళలకు అన్ని రంగాల్లో అందడం లేదు. కుటుంబం, సమాజం విధించే సంప్రదాయ ఆలోచనలు మహిళల స్వేచ్ఛను కొన్ని సందర్భాల్లో పరిమితం చేస్తున్నాయి. అయితే మహిళలు తమ హక్కులపై స్పష్టంగా మాట్లాడటం, అన్యాయాలకు వ్యతిరేకంగా సంఘటితంగా స్పందించడం పెరుగుతోంది. ఈ చైతన్యమే భవిష్యత్తులో నిజమైన లింగ సమానత్వానికి మార్గం వేస్తోంది.

**అభిమానుల చిరకాల స్వప్నాన్ని భారత మహిళా క్రికెట్ జట్టు ఈ ఏడాది నెరవేర్చింది. మహిళల ప్రపంచ కప్ చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకొని, కొత్త చరిత్రను సృష్టించింది. హర్మన్‌ప్రీత్ కౌర్ కెప్టెన్సీలో భారత్‌కు మొదటిసారి మహిళల ప్రపంచ కప్ దక్కింది. ఈ ఏడాది ఇదో అద్భుతం. చిరకాలం గుర్తుండిపోయే క్షణం.**



### విద్య... నైపుణ్యాభివృద్ధి

మహిళల విద్యా ప్రాప్యత 2025 నాటికి గణనీయంగా పెరిగింది. ఉన్నత విద్యలో, ప్రొఫెషనల్ కోర్సుల్లో మహిళల నమోదు అధికమవుతోం ది. అయినప్పటికీ చదువుకు తగిన ఉపాధి, కెరీర్‌లో ఎదుగుదల అన్ని వర్గాల మహిళలకు సమానంగా లభించడం లేదు. కొత్త సాంకేతిక నైపుణ్యాలు, డిజిటల్ సామర్థ్యాలు పెంపొందించుకోలేని మహిళలు ఉద్యోగ మార్కెట్‌లో వెనుకబడే ప్రమాదం ఎదుర్కొంటున్నారు.

### ఉపాధి, ఆర్థిక స్వాతంత్ర్యం..

2025లో మహిళల ఉపాధి అవకాశాలు విస్తరించినప్పటికీ అవి స్థిరంగా లేవు. రిమోట్ వర్క్, ఫ్రీలాన్సింగ్, స్టార్టప్‌ల ద్వారా కొత్త మార్గాలు తెరచుకున్నాయి. అయితే వేతన అసమానత, ఉద్యోగ భద్రత లోపం, ప్రమోషన్లలో వివక్ష వంటి సమస్యలు కొనసాగుతున్నాయి. ఆర్థిక స్వాతంత్ర్యం సాధించాలంటే మహిళలకు భద్రమైన పని పరిస్థితులు, సమాన అవకాశాలు అవసరమని స్పష్టమవుతోంది.

### సాంకేతికత..

డిజిటల్ టెక్నాలజీ 2025లో మహిళలకు ఒకవైపు అవకాశంగా, మరోవైపు సవాలుగా మారింది. ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌లు మహిళలకు వ్యాపారం, ఉపాధి అవకాశాలను అందిస్తున్నాయి. అదే సమయంలో సైబర్ వేధింపులు, డిజిటల్ అసురక్షితత మహిళలపై మానసిక ఒత్తిడిని పెంచుతున్నాయి. టెక్నాలజీ వినియోగంలో భద్రత, అవగాహన పెరగాల్సిన అవసరం ఉంది.

### ఆరోగ్యం... మానసిక స్థితి

మహిళల ఆరోగ్యం 2025లో మరింత ప్రాధాన్యం పొందుతోంది. శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యంపై అవగాహన పెరుగుతోంది. పని–కుటుంబ సమతుల్యం, సామాజిక ఒత్తిళ్లు, భవిష్యత్తుపై అనిశ్చితి మహిళలను మానసికంగా ప్రభావితం చేస్తున్నాయి. ఆరోగ్య సేవలు అందుబాటులో ఉన్నప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో ఇంకా లోపాలు ఉన్నాయి.

### గ్రామీణ మహిళలు.. అసమానతలు

గ్రామీణ మహిళలు 2025లో కూడా అనేక అసమానతలను ఎదుర్కొంటున్నారు. ఉపాధి అవకాశాల కొరత, విద్యా పరిమితులు, ఆరోగ్య సదుపాయాల లోపం వారి పురోగతిని నెమ్మదింపజేస్తున్నాయి. అయితే స్వయం సహాయక సంఘాలు, స్థానిక ఆర్థిక కార్యక్రమాలు మహిళలను స్వయం ఉపాధి వైపు నడిపిస్తూ కొత్త ఆశను కలిగిస్తున్నాయి.

### రాజకీయ భాగస్వామ్యం.. భవిష్యత్తు ఆశలు

మహిళల రాజకీయ భాగస్వామ్యం క్రమంగా పెరుగుతోంది. స్థానిక సంస్థల నుంచి జాతీయ స్థాయి వరకు మహిళల ప్రాతినిధ్యం పెరగడం నిర్ణయ ప్రక్రియల్లో మహిళల స్వరం వినిపించే అవకాశం ఇస్తోంది. సమాన హక్కులు, భద్రత, గౌరవంతో కూడిన జీవితం కోసం మహిళల పోరాటం కొనసాగుతోంది. మొత్తంగా 2025 మహిళలకు సవాళ్లతో కూడిన కాలమే అయినా, భవిష్యత్తుపై ఆశను నిలుపుకునే శక్తిని కూడా అందిస్తోంది.

# కమ్యూనిస్టుల ప్రభావంతోనే సంస్కరణలు

సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి



**ప్రజాపక్షం/సూర్యాపేట :** ఖమ్మంలో సిపిఐ శతజయంతి ఉత్సవాల సందర్భంగా జనవరి 18న జరిగే బహిరంగసభను విజయవంతం చేయాలని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కిరాణ ఫ్యాన్సీ మర్చంట్ అసోసియేషన్ భవనంలో ఉస్తెల నారాయణరెడ్డి, బూర వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యుల సమావేశం, సూర్యాపేట జిల్లాలో ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో గెలిచిన సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, వార్డుమెంబర్ల అభినందన సభకు పల్లా వెంకట్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సిపిఐ జెండా ఆవిష్కరించి, అనంతరం సభలో మాట్లాడారు.1925లో కాన్పూర్‌లో ఆవిర్భవించిన సిపిఐ స్వాతంత్ర ఉద్యమంలో కీలకపాత్ర పోషించిందన్నారు. కాంగ్రెస్‌పార్టీలో గాంధీజీ నాయకత్వంలో మితవాదులు పనిచేస్తుంటే, సిపిఐ ఆధ్వర్యంలో అతివాదులు దేశ స్వాతంత్ర్యం కోసం పోరాటాలు చేశారన్నారు. ఎందరో దేశభక్తులు ఎర్రజెండా ఎత్తుకొని దేశంకోసం అమరులయ్యార న్నారు. దేశంలో కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత కమ్యూనిస్టుల ప్రభావంతో అనేక సంస్కరణలో వచ్చాయన్నారు. నెహ్రూ, ఇందిరాగాంధీల పాలనలో బ్యాంకుల జాతీయకరణ, ప్రభుత్వరంగసంస్థల ఏర్పాటు, భూసంస్కరణలు వంటి అనేక నిర్ణయాలు దేశంలో అమలు చేయడానికి కమ్యూనిస్టుపార్టీ తీవ్రంగా కృషి చేసిందన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను నష్టాల పేరుతో మూసివేస్తుందని విమర్శించారు. మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చే విధంగా ప్రయత్నాలు చేస్తూ కేంద్రం 60 శాతం, రాష్ట్రాలు 40 శాతం నిధులు ఖర్చు చేయాలని కొత్తగా ఆదేశాలు జారీ చేయడం వలన పథకం నీరుగారిపోతుందన్నారు. గ్రామీణ ఉపాధిహామీ పథకంలో మహాత్మా గాంధీ పేరును తొలగించి జీ రాంజీ పేరు ప్రవేశపెట్టడం దురదృష్టకరమన్నారు. బీహార్‌లో ఎన్నికల సమయంలో ఎస్ఐఆర్ పేరుతో అరవై లక్షల ఓట్లను తొలగించి బిజెపి కూటమి అధికారంలోకి వచ్చిందన్నారు. తమిళనాడు, కేరళ, పశ్చిమబెంగాల్ వంటి రాష్ట్రాలలో కూడా పెద్ద సంఖ్యలో ఓటర్లను తొలగించడానికి ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. బిజెపి ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో బూటకపు ఎన్‌కౌంటర్లు చేసి మావోయిస్టులను చంపేస్తుందన్నారు. నక్సలైట్లకు మద్దతు ఇస్తున్నారనే నెపంతో కమ్యూనిస్టు పార్టీ నాయకులను అర్బన్ నక్సలైట్లు అని ముద్ర వేసి అరెస్టు చేస్తుందని ఆరోపించారు. అటవీసంపదను కార్పొరేట్ భక్తులకు అప్పగించడానికి ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందన్నారు. అనేక పార్టీలు ఈవందేళ్ళ కాలంలో కనుమరుగైపోయాయని కానీ, కమ్యూనిస్టు పార్టీ మాత్రం అధికారం ఉన్నా, లేకున్నా నిరంతరం ప్రజాసమస్యలపై పోరాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ తన స్థానాన్ని ఎప్పటికప్పుడు మెరుగుపరుచుకుంటుందని పల్లా పేర్కొన్నారు. సభలో ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో జిల్లాలో సిపిఐ అభ్యర్థులుగా గెలుపొందిన ఆరుగురు సర్పంచ్‌లు, ఇద్దరు ఉపసర్పంచ్‌లు, 40 మంది వార్డుసభ్యులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్, గన్న చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, ఎల్లావుల రాములు, ఉస్తెల సృజన, మండవ వెంకటేశ్వర్లు, కంబాల శ్రీనివాస్, మేకల శ్రీనివాస్, ఎల్లంల యాదగిరి, బద్దం కృష్ణారెడ్డి, పోకల వెంకటేశ్వర్లు, దేవర మల్లేశ్వరి, సాయిబెల్లి, ఎస్‌కె లత్తు, రాంరెడ్డి, దంతాల రాంబాబు, చామల అశోక్ కుమార్, బొమ్మగాని శ్రీనివాస్, అనంతుల మల్లేశ్వరితో పాటు జిల్లా కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.



## ప్రజల గొంతుక 'ప్రజాపక్షం'

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు

'ప్రజాపక్షం' హనుమకొండ జిల్లా క్యాలెండర్ ఆవిష్కరణ

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** ప్రజాపక్షం దినపత్రిక ప్రజల గొంతుకగా నిలవాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు. హనుమకొండ జిల్లా 2026 సంవత్సరం క్యాలెండర్‌ను మంగళవారం తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ఆవిష్కరించారు. హనుమకొండ బాల సముద్రంలోని సిపిఐ ప్రజాపక్షం జిల్లా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో 2026 సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరించి పత్రిక యాజమాన్యానికి, పాత్రికేయులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తక్కళ్లపల్లి మాట్లాడుతూ ప్రజాపక్షం దినపత్రిక ప్రజా సమస్యలకు మార్గం చూపేదిగా ఉండాలని, నూతన సంవత్సరంలో కూడా ప్రజాపక్షం పత్రిక ప్రజల గొంతుకగా నిలవాలని, కార్మిక, శ్రామిక, రైతు, మహిళా, యువజన, విద్యార్థులు, మేధావుల మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఏదునూరి వెంకట్రాజం, వేల్పుల సారంగపాణి, కొట్టెపాక రవి, ప్రజాపక్షం జిల్లా ప్రతినిధి తోట సుధాకర్, పాత్రికేయులు ఎండి. ఉస్మాన్‌పాషా, కుక్కల రాజు, పి.కిషోర్ కుమార్, ఎర్ర కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఊరురా 'ఖమ్మం' సభ ప్రచారం

సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంత్‌రావు



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** జనవరి 18న ఖమ్మం నగరంలో నిర్వహించనున్న సిపిఐ వందేళ్ల వేడుకను విజయవంతం చేయాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు బాగం హేమంత్‌రావు పిలుపునిచ్చారు. మంగళవారం ఖమ్మం రూరల్ మండలంలోని పల్లెగూడెం గ్రామంలో జరిగిన శాఖ జనరల్‌బాడీ సమావేశానికి హేమంత్‌రావు హాజరై మాట్లాడుతూ సిపిఐ వందేళ్ల వేడుకల విజయవంతానికి సిపిఐ శ్రేణులు ఊరురా ముమ్మర ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. వేడుకలో భాగంగా సుదీర్ఘకాలంలో సిపిఐ చేసిన పోరాటాలు, సాధించిన హక్కులను నేటి తరానికి చాటి చెప్పాలన్నారు. ఇతర దేశాల నుంచి కమ్యూనిస్టు నేతలు హాజరుకాబోతున్నారని, ఐదు లక్షల మందితో భారీ బహిరంగ సభ ఉండబోతుందన్నారు. ఇటువంటి వేడుక విజయవంతానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలని బాగం కోరారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మొహ్మద్ మౌలానా, రాష్ట్ర సమితి సభ్యులు సిద్ధినేని కర్ణకుమార్, జిల్లా సమితి సభ్యుడు పగిళ్ల వీరభద్రం, పార్టీ మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, గ్రామ సర్పంచ్ చూండురి సృజన, నాయకులు పెండ్లి నర్సిరెడ్డి, కళ్లెం ముత్తయ్య, కళ్లెం సీతయ్య, కళ్లెం వీరయ్య, కొమరబత్తిని వెంకటరత్నం, అన్నమ్మ, దారుమల్ల నాగయ్య, రామాచారి తదితరులు పాల్గొన్నారు.

## విద్వేష రాజకీయాలకు పాల్పడుతున్న బిజెపి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాల నరసింహ్మా



**ప్రజాపక్షం/మహబూబ్ నగర్ :** దేశవ్యాప్తంగా బిజెపి విద్వేష రాజకీయాలకు పాల్పడుతుందని, అందుకు డెహ్రాడూన్‌లో జరిగిన త్రిపుర విద్యార్థి హత్య విద్వేషాలకు పరాకాష్ట అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.బాల నరసింహ్మా అన్నారు. మంగళవారం మ సిపిఐ జిల్లా సమితి సమావేశం డి.రాము అధ్యక్షత జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన బాలనరసింహ్మా మాట్లాడుతూ దేశంలో కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి 100 ఏళ్ళు పూర్తి చేసుకున్న సందర్భంగా ఉత్సవాలు జరుగుతున్న నేపథ్యంలోనే, మరోపక్క ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు కూడా జరుగుతున్నాయని, ఇందులో దేశం కోసం రక్తార్పణ చేసిన ఘన కీర్తి సిపిఐ పార్టీది అయితే, ఆర్ఎస్ఎస్‌ది మాత్రం గడిచిన కాల గమన చరిత్ర అంతా దేశ స్వాతంత్రంలో వెన్నుపోట్లు, కుట్రలు, కుతంత్రాలు సొంతం చేసుకుందన్నారు. ఆర్ఎస్ఎస్ వాళ్లు ఏ ఒక్కరైనా స్వాతంత్ర సంగ్రామం ఉద్యమంలో పాల్గొన్న ఆనవాలే లేవని అన్నారు. ఆర్ఎస్ఎస్ మనుస్మృతికి మద్దతిస్తున్నారా లేక వ్యతిరేకిస్తున్నారా ప్రజలకు బహిరంగంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. దేశంలో కుల సమస్య రూపు మార్చి జఠిలమవుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. యుపిఎ వన్ ప్రభుత్వంలో వామపక్షాల మద్దతుతో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం చట్టం తీసుకురావడం జరిగిందన్నారు. కానీ నేటి బిజెపి ప్రభుత్వం ఉపాధి గ్యారెంటీ చట్టాన్ని విబీ రాంజీ పేరుతో స్కీమ్‌గా మార్చారని, దీని ఫలితంగా ఉపాధి హామీ చట్టం రద్దు అయ్యే ప్రమాదం ఏర్పడిందన్నారు. పేరు మార్పు పేరుతో పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు మోదీ ప్రభుత్వం కుట్ర చేస్తుందని ఆరోపించారు. విద్య, వైద్యం ఉపాధిలతో పాటు ప్రభుత్వరంగ సంస్థలను మొత్తాన్ని మోడీ ప్రభుత్వం ప్రైవేటీకరణ చేస్తూ నయా ఉదారవాద ఆర్థిక విధానాలతో దేశ సంపదను లూటీ చేస్తున్నారని మండిపడ్డారు. దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణకు లౌకిక శక్తులు ఏకం కావాలన్నారు. డబ్బు. మద్యం, తాయిలాలతో ఎన్నికల వ్యవస్థ మసకబారుతుందని, దీని ఫలితంగా ప్రజల కోసం నీతి నిజాయితీగా సేవలు చేస్తున్న వారు చట్ట సభలకు వెళ్లలేని దుస్థితి నెలకొన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. నాటినుంచి నేటివరకు సమస్యలు లేని సమాజం కోసం సిపిఐ రాజీలేని పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా జనవరి 18న ఖమ్మం జిల్లా కేంద్రంలో లక్షలాదిమందితో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామన్నా రు. ఉమ్మడి జిల్లా కార్మికులు, కర్షకులు, శ్రమజీవులు, ప్రజలు పెద్దఎత్తున ఈ బహిరంగ సభకు తరలిరావాలని బాల నరసింహ్మా పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి బృంగి బాలకిషన్, జిల్లా కార్యవర్గ సభ్యులు పి.సురేష్, ఎం.గోవర్ధన్, కృష్ణయాదవ్, కె.పద్మావతి, జిల్లా సమితి నాయకులు కొటకదిరా నరసింహా, చాంద్‌పాషా, సత్యనారాయణ రెడ్డి, శ్రీను, మహేష్, ఖలీల్, భార్గవి, శివ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల్లోకి సిపిఐ ఉద్యమ చరిత్ర

సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** సిపిఐ వందేళ్ల ఉద్యమ చరిత్ర, త్యాగాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా పిలుపునిచ్చారు. సిపిఐ జిల్లా కార్యాలయం శేషగిరిభవన్‌లో మంగళవారం జరిగిన పట్టణ విస్తృతస్థాయి జనరల్ బాడీ సమావేశానికి సాబీర్ పాషా హాజరై మాట్లాడారు. జనవరి 18న ఖమ్మంలో జరిగే సిపిఐ వందేళ్ల బహిరంగ సభకు జిల్లా నలుమూలల నుంచి భారీగా తరలిరావాలని కోరారు. ప్రతీ కమ్యూనిస్టు కుటుంబం ఈ చారిత్రక ఉత్సవాల్లో పాల్పంచుకోవాలన్నారు. శత వసంత ఉత్సవాల ప్రచారంలో భాగంగా జనవరి 3వ తేది నుండి 7వరకు జిల్లావ్యాప్తంగా ప్రచారజాతా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ జాతా ద్వారా సిపిఐ పోరాట చరిత్రను ప్రజల్లోకి తీసుకెళ్లనున్నట్లు చెప్పారు. సమావేశంలో పట్టణ కార్యదర్శి కంచర్ల జమలయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు కందుల భాస్కర్, ఎస్‌కె ఫహీమ్, నాయకులు నేరెళ్ల రమేష్, గౌనె మణి, విజయలక్ష్మి, వంగ వెంకట్, గడ్డం రాజయ్య, ఎండి యూసుఫ్, పిడుగు శ్రీనివాస్, గోపి కృష్ణ, నిమ్మగడ్డ వెంకటేశ్వర రావు, గుత్తుల శ్రీనివాస్, పి.సత్యనారాయణచారి, తూముల శ్రీనివాస్ పాల్గొన్నారు.





# స్థానికం REGIONAL NEWS

ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం

## జర్మన్ భాష శిక్షణ, ఉద్యోగం కోసం దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : జర్మన్ భాష శిక్షణ అందించి అక్కడ పేరొంది న ఆసుపత్రిలో ఉద్యోగ అవకాశాలు కల్పించడం కోసం అర్హులైన నర్సుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి కొండపల్లి శ్రీరాం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కార్మిక, ఉపాధి శిక్షణ కార్మాగారాల శాఖ క్రింద రిజిస్టరైన తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్‌కామ్) ఆధ్వర్యంలో అర్హత కలిగిన నర్సులకు ఉచితంగా జర్మన్ భాష శిక్షణ అందించి అక్కడ ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. జర్మన్ భాష శిక్షణ ఎన్‌రోల్ మెంట్ ప్రోగ్రాం కోసం దరఖాస్తు చేసుకోవాలని, బియస్సి లేదా జిఎన్‌ఎం కోర్సు పూర్తి చేసి 22 నుంచి 38 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వారు, ఒక సంవత్సరం క్లినికల్ పనిచేసిన అనుభవం కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు బిఎన్ స్థాయి వరకు భాషా శిక్షణ అందించి, విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్న తర్వాత జర్మనిలో స్టాఫ్ నర్సుగా పనిచేసే అవకాశం ఉంటుందన్నారు.

## శతాబ్ది ఉత్సవాల బహిరంగ సభకు వాల్ పోస్టర్ ఆవిష్కరణ



ప్రజాపక్షం/చింతకాని: జనవరి 18న ఖమ్మంలో జరిగే సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభకు చింతకాని మండల వ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజలు హాజరై విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం బస్వాపురం గ్రామంలో శతాబ్ది ఉత్సవాల బహిరంగ సభ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించి ప్రచారం నిర్వహించారు. భారతదేశ గడ్డపై సిపిఐకి వందేండ్లన్నారు. దీనికి గుర్తుగా శతాబ్ది ఉత్సవాల ముగింపు సభను నిర్వహిస్తున్నామని తెలిపారు.వందేండ్ల మహా ప్రస్థానంలో నిత్యం ప్రజాసమస్యల పరిష్కారం కోసం అనేక పోరాటాలు నిర్వహించిన చరిత్ర సిపిఐ సొంతమన్నారు.ఏ పార్టీకి లేని ఘన చరిత్ర సిపిఐ కి ఉందన్నారు. సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభకు బస్వాపురం నుంచి అన్ని వర్గాల ప్రజలు అదిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.గ్రామల్లో ప్రచార జాతా వచ్చినపుడు ప్రతి కార్యకర్త కదలిరావాలన్నారు.బస్వాపురం సర్పంచ్ ఆవుల నర్సింహారావు, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు రాసాల మోహన్‌రావు, పార్టీ మండల సహా య కార్యదర్శి మార్గం శ్రీను, ఉపసర్పంచ్ చంద్రకాని నర్సింహారావు, శాఖ కార్యదర్శి బద్దల నర్సింహారావు, బద్దల పెద్ద వెంకటి, సైదులు, మామిడాల వేలాద్రి, చంద్రకాని రామ్మూర్తి, ఆవుల మన్మధరావు, శ్రీను, మార్గం శ్రీను, లక్ష్మి నారాయణ, వెంకటేశ్ , లక్ష్మి నారాయణ , ఉమామహేశ్వర రావు, రాజు, తిరపతిరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## ఆలయ పనులతో అభివృద్ధికి శ్రీకారం

టేకుల చెరువు సర్పంచ్ బోళ్ళ సైదమ్మ



ప్రజాపక్షం/బూర్గంపాడు: రామాలయ పనులతో గామ పంచాయితీలో అభివృద్ధికి శ్రీకారం చుట్టినట్లు ్టినట్లు సర్పంచ్ బోళ్ళ సైదమ్మ అన్నారు. మంగళవారం గ్రామంలోని రామాలయ ప్రహరీగోడ పనులను సర్పంచ్ బోళ్ళ సైదమ్మ, ఉప సర్పంచ్ ఇస్లావత్ రవిలు భూమి పూజ చేసి పనులకు శ్రీకారం చుట్టారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయితీ పరిధి లోని కాలనీలలో దశలవారీగా అభివృద్ధి పనులు చేపడతామని అన్నారు. తమకు ఓట్లు వేసి గెలిపించిన ప్రజల రుణం తీర్చుకునేందుకు గ్రామంలోని అభివృద్ధి పనులు చేపడతామని అన్నారు. ఎన్నికలు ముగిసిన తర్వాత పార్టీలకతీతంగా, రాజకీయాలకతీతంగా గ్రామ అభివృద్దే ధ్యేయంగా తమ పాలక మండలి పని చేస్తుందని పేర్కొన్నారు. గ్రామంలోని ఎనిమిది వార్డులను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తమ ముందున్న లక్ష్యమని తెలిపారు. గ్రామ ఉపసర్పంచ్ ఇస్లావత్ రవి, వార్డు సభ్యులు బోళ్ళ శ్రీశైలం, కాకా రాఘవమ్మ, లావుడియా వీరన్న, తేజావత్ కుప్లీయా, గ్రామ పెద్దలు పాండవుల రామానాథం,వెంకన్న, రాము, ఉపేందర్,రాంబాబు, పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి


టిపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జోగ రాంబాబు



ప్రజాపక్షం/ఆళ్లపల్లి: గిరిజన సంక్షేమ శాఖలో పని చేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని టిపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జోగ రాంబాబు అన్నారు. మంగళవారం ఆళ్లపల్లి మండల కేంద్రంలో ఆశ్రమ హైస్కూల్ మర్కోడు నందు జరిగిన మండల కమిటీ సమావేశం మండల అధ్యక్షులు బానోత్ భోజ్యా అధ్యక్షతన జరిగింది. ఈసమావేశంలో మండల ప్రధాన కార్యదర్శి ఈసం ముత్తయ్య, టిపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జోగ రాంబాబు మాట్లాడుతూ గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయులకు ప్రమోషన్లు ఇవ్వాలని, పండిట్, పిఈటీలకు అప్‌గ్రేడేషన్ చేయాలని, సిఆర్‌టిలకు, డైలీ వర్కర్లకు మినిమం టైం స్కేల్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. విద్యా వ్యవస్థకు మూల స్తంభాలైన సిఆర్‌టిలు ఏళ్ల తరబడి సేవలందిస్తున్నప్పటికీ వీరికి తగిన ప్రయోజనాలు కలగకపోవడం తీవ్ర అన్యాయం, ఇది గిరిజన విద్యాభివృద్ధిపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతోందన్నారు. కావున ప్రభుత్వం సమస్యలను సానుకూలంగా పరిగణించి తక్షణమే స్పష్టమైన నిర్ణయాలు తీసుకొని ఉత్తర్వులు జారీ చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. లేనిపక్షంలో ఉద్యమ కార్యాచరణకు సిద్ధంగా ఉంటామని హెచ్చరిస్తున్నామన్నారు. ఈకార్యక్రమంలో టిఎస్‌టిటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి ఇస్లావత్ నరేష్, ఉపాధ్యాయులు బి బాలు, భద్రు, ఈసం రవీందర్ బాబు, బి రవి కుమార్, యం లక్ష్మయ్య, బాలకృష్ణ, సోమేశ్వర్, మధు, తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు

ప్రజాపక్షం/నేలకొండపల్లి: మండలం లోని వివిధ గ్రామాలలో మంగళవారం వైకుంఠ ఏకాదశి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. పలు దేవాలయాలలో ఉత్తర ద్వార దర్శనంను దర్శించుకున్నారు. మండల కేం ద్రం లో రామదాసు మందిరంలో ఉత్సవం ను ఘనంగా నిర్వహించారు. శ్రీ వెంకటేశ్వరస్వామి, శ్రీ వేణుగోపాలస్వామి, శ్రీ ఉత్తరేశ్వరస్వామి దేవాలయాలలు భక్తులతో కిటకిటలాడారు. మండలం లోని మంగాపురతండా లో జరిగిన ఏకాదశి వేడుకలలో సర్పంచ్ ధీరావత్ అశోక్ రాణి దంపతలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.చెరువుమాధారం మత్స్య సొసైటీ ఉపాధ్యక్షుడు ధీరావత్ రాధాకృష్ణమూర్తి, ఉప సర్పంచ్ నాగరాజు, సొసైటీ మాజీ అధ్యక్షుడు ధీరావత్ బాలాజీ, గోబ్రియానాయక్ తదితరులు పాల్గొన్నారు. రాజేశ్వరపురం దేవాలయంలో జరిగిన వేడుకలలో సర్పంచ్ దండా రంగయ్య, ఉప సర్పంచ్ రాసాల నవీన్, బొనగిరి కిరణ్ పాల్గొన్నారు.



# మున్సి‘పోల్’కు కసరత్తు

- కొత్తగా ఎదులాపురం,కల్లూరు,అశ్వారావుపేట మున్సిపాలిటీలు
- కొత్తగూడెం స్థానే పాల్వంచతో కలిపి కార్పొరేషన్
- వార్డుల విభజన ప్రక్రియలో అధికారులు
- ఫిబ్రవరిలో ఎన్నికలు జరిగే అవకాశం




ప్రజాపక్షం/ ఖమ్మం : రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ ఎన్నిక లను జరిపేందుకు సిద్ధమవుతుంది. మున్సిపల్ ఎన్నికలతో పాటు హైదరాబాద్ మినహా మిగిలిన కార్పొరేషన్లకు కూడా ఎన్నికలు నిర్వహించే ఆలోచనలో రాష్ట్ర ప్ర భుత్వం ఉంది. ప్రభుత్వ ఆలోచన ప్రకారం ఎన్నికలు జ రిగితే ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పాత మున్సిపాల్టిలైన మధిర, వైరా, సత్తుపల్లి, ఇల్లందుతో పాటు కొత్తగా ఏర్పాటైన ఏదులాపురం, కల్లూరు, అశ్వారావుపేట మున్సిపాలిటీలకు కూడా ఎన్నికలు జరగనున్నాయి. కొత్తగూడెం మున్సిపాలిటీ స్థానే పాల్వంచ, సుజాత నగర్ కలిపి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసిన విషయం విధితమే. 60 డివిజన్లతో ఏర్పాటైన ఈ కార్పొరేషన్‌కు కూడా ఫిబ్రవరి మాసంలో ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ఓటర్ల జాబితా సవరణ షెడ్యూల్‌ను ఇప్పటికే విడుదల చేసింది. మున్సిపల్ అధికారులు వార్డుల వారీగా కసరత్తు ప్రారంభించారు. మున్సిపాలిటీలోని మొత్తం ఓటర్లు కుడి ఎడంగా ఆయా వార్డులకు విభజించే ప్రక్రియను చేపట్టారు. మధిర, వైరా, ఇల్లందులో వార్డుల సంఖ్య గతం కంటే పెరగవచ్చునని భావిస్తున్నారు.

**కొత్త మున్సిపాలిటీలు :** ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కొత్తగా ఏర్పాటైన మూడు మున్సిపాలిటీలలో ఏదులాపురం మున్సిపాలిటీని 32 డివిజన్లతో ఏర్పాటు చేశారు. కొత్తగా ఏర్పాటైన మున్సిపాలిటీ పరిధిలో అన్ని గ్రామాలే ఉండటం కొంత పారిశ్రామిక ప్రాంతం ఉండటంతో వార్డుల కసరత్తు సులభంగానే జరిగిపోయింది. ఏదులాపురం మున్సిపాలిటీ అధికారులు వార్డుల విభజన ప్రక్రియను పూర్తి చేసినట్లు సమాచారం. కొత్తగా ఏర్పాటైన కల్లూరు మున్సిపాలిటీలో కల్లూరు పట్టణంతో పాటు చుట్టూ ఉన్న కొన్ని గ్రామ పంచాయతీలను కల్లూరు మున్సిపాలిటీలో విలీనం చేశారు. అశ్వారావుపేట పట్టణంతో పాటు కొన్ని గ్రామ పంచాయతీలను విలీనం చేశారు.

**కార్పొరేషన్‌గా కొత్తగూడెం :** ఖమ్మం కొత్తగూడెం మున్సిపాలిటీని స్థానిక శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు చొరవతో విశాల లక్ష్యంతో కార్పొరేషన్‌గా ఏ ర్పాటు చేశారు. కొత్తగూడెం పట్టణంతో పాటు పాల్వంచ పట్టణం సుజాతనగర్, లక్ష్మి దేవిపల్లి మండలంలోని కొన్ని గ్రామ పంచాయతీలను కలుపుతూ కార్పొరేషన్‌ను ఏ ర్పాటు చేశారు. కార్పొరేషన్‌ను 60 డివిజన్లుగా విభజించనున్నారు. వీటితో పాటు పాత మున్సిపాలిటీలైన సత్తుపల్లి, ఇల్లందు, మధిర, వైరా మున్సిపాలిటీల్లో కూడా రెండు నుంచి నాలుగు వార్డుల చొప్పున పెరిగే అవకాశం ఉందని తెలుస్తుంది.

**రాజకీయ పార్టీల సన్నాహం :** రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ ఎన్నికలకు కసరత్తు ప్రారంభించడంతో రాజకీయ పార్టీలు సన్నాహాలు ప్రారంభించాయి. ఆయా మున్సిపాలిటీల పరిధిలో కార్యకర్తల సమావేశాలు ఏర్పాటు చేసి పోటీకి సన్నాహాలు ప్రారంభించాయి. అధికార కాంగ్రెస్‌తో పాటు విపక్ష బిజెపి, సిపిఐ, సిపిఎంలు మున్సిపల్ ఎన్నికలపై దృష్టిసారించాయి. కొత్తగూడెం కార్పొరేషన్ ఎన్నికల సన్నాహక సమావేశం మంగళవారం నిర్వహించారు. అన్ని మున్సిపాలిటీల్లోనూ డివిజన్ల వారీగా బరిలో నిలిపే అభ్యర్థుల కోసం రాజకీయ పార్టీలు వేట ప్రారంభించాయి. పార్టీ గుర్తులపై ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకోనున్నాయి.

## నిబంధనల ప్రకారం సర్వే పూర్తి

జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : నిబంధనల ప్రకారం సర్వే పనులను జనవరి 15 వరకు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి భూ సర్వే పనులపై మంగళవారం మండలాల వారీగా సమీక్షించి పలు సూచనలు చేశారు. భూ సేకరణ పూర్తి చేయడంలో సర్వే శాఖ కీలక పాత్ర పోషించాల్సి ఉంటుందన్నారు. ప్రజలు దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుల న్ని సర్వే సరిగ్గా చేయడం లేదని ఫిర్యాదులు అం దుతున్నాయన్నారు. మండలాల వారీగా సర్వేయర్ పనితీరుపై సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడి రెగ్యులర్‌గా రివ్యూ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజలు అందించిన దరఖాస్తులలో అధికంగా తిరస్కరించడం పట్ల కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు దరఖాస్తులను తిరస్కరించే సమయంలో తప్పనిసరిగా కారణాలు ఉండాలని లేని పక్షంలో సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. సర్వేకు సంబంధించి మండలాలకు వచ్చిన పెండింగ్ దరఖాస్తులను పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. చిన్న చిన్న కారణాలకు ప్రజలు అందించిన దరఖాస్తులను తిరస్కరించడానికి వీలు లేదని కలెక్టర్ తెలిపారు. మండలంలో పెండింగ్‌లో ఉన్న భూ సర్వే పనులు జనవరి 15 వరకు నిబంధనల ప్రకారం పూర్తి చేయాలన్నారు. ప్రస్తుతం భూ భారతిలో ఉన్న ప్రభుత్వ భూమి ఫీల్డ్ పోజిషన్ డి మార్క్ చే సి ఎంత అందుబాటులో ఉందో వివరాలు కూడా సమర్పించాలన్నారు.

## అటవీ మంటల నివారణపై అవగాహన

ప్రజాపక్షం/ కొణిజర్ల : మండల పరిధిలోని గుబ్బగుర్తి, అంజనాపురం గ్రామాల్లో అటవీ శాఖ ఆధ్వర్యంలో అడవి మంటల నివారణపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.వేసవి కాలంలో అడవుల్లో మంటలు చెలరేగడం వల్ల వృక్ష సంపద, వన్య ప్రాణులు, పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని తెలిపారు. అడవుల్లో నిర్లక్ష్యంగా నిప్పుపెట్టడం, పశువుల మేత కోసం గడ్డి కాల్చడం, వంటల అనంతరం మంటలను పూర్తిగా ఆర్పకపోవడం వంటి కారణాల వల్ల అడవి మంటలు ఏర్పడుతున్నాయని వివరించారు. మంటలు కనిపించిన వెంటనే అటవీ శాఖాధికారులకు సమాచారం అందించాలని గ్రామస్తులకు సూచించారు. అడవులను కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అటవి మంటలను నియంత్రించవచ్చునని అధికారులు తెలిపారు. గుబ్బగుర్తి అటవీ శాఖ సెక్షన్ ఎఫ్ఎస్‌వో జి. ఉపేంద్రయ్య, ఎఫ్‌బివోలు విజయ, అయోధ్యమ్మ, ఖాజాబీ, గ్రామస్తులు పాల్గొన్నారు.



## శతాబ్ది ఉత్సవ ముగింపు సభను పండగలా జరుపుకుందాం

జనవరి 3 నుండి 7వరకు ప్రచార జాతా

ఐదులక్షల మందితో భారీ బహిరంగ సభ



ప్రజాపక్షం/పాల్వంచ : ఖమ్మం కేంద్రంగా వచ్చే నెల 18న, జరిగే సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభను పండగలా ఉత్సాహభరితంగా జరుపుకొందామని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా అన్నారు. పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో పాల్వంచ పట్టణ, మండల విస్తృత కౌన్సిల్ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సంధర్భంగా సాబీర్ పాషా మాట్లాడుతూ భారీ బహిరంగ సభకు పార్టీ ప్రధాన కార్యదర్శి రాజాతో పాటుగా సుమారు 14 దేశాల నుండి ప్రతినిధులు, కవులు, కళాకారులు, మేదావులు తరలివస్తున్నారని చెప్పారు. దీనితో ఖమ్మం పట్టణం అరుణవర్ణం కాబోతున్నదని అందులో పాల్వంచ భాగం కావాలని సూచించారు. భారత గడ్డపై సిపిఐ వందేండ్ల చరిత్ర కలిగిన పార్టీలో సభ్యులుగా ఉండటం మనకు గర్వకారణమన్నారు. నిత్యం ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేస్తున్న సిపిఐ మరో వందేండ్లు కూడా ప్రజల గుండెల్లో ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. గోడకు కొట్టిన బంతిలాగా ప్రశ్నించేవారు పుడుతూనే ఉంటారని స్పష్టం చేశారు.

**నీతివంతమైన పాలన సాగించాలి :** ఖమ్మం వేదికగా వచ్చే నెల 18వ, తేదీన జరిగే సిపిఐ శతాద్ది ఉత్సవ ముగింపు సభకు భారీ ఎత్తున కదిలివచ్చి విజయవంతం చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాధం పిలుపునిచ్చారు. నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లు గ్రామాలలో నీతి వంతమైన పాలన అందించాలన్నారు. ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు సహకారంతో అభివృద్ధిలో భాగం పంచుకోవాలని సూచించారు. ఇదే స్పూర్తితో రాబోయే కార్పొరేషన్, జెడ్‌పిటిసి, ఎంపిటిసి ఎన్నికలను ఎదుర్కొని విజయబాహుటా ఎగురవేద్దామని అన్నారు.

## ఉత్తర ద్వార దర్శనానికి పోటెత్తిన భక్తులు

ప్రజాపక్షం/ ఎర్రుపాలెం : తెలంగాణ తిరుపతిగా ప్రసిద్దిగాంచిన స్వ యంభూ జమలాపురం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఉత్తర ద్వార దర్శనానికి భక్తులు పోటెత్తారు. మంగళవారం ముక్కోటి ఏకాదశి పర్వదిన సందర్భంగా ఆలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఉత్తర ద్వారం ద్వారా స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు. జమలాపురం గ్రామానికి చెందిన ఖమ్మం కెఎన్ఆర్ గ్రానైట్స్ అధినేత తుళ్లూరు కోటేశ్వరరావు, సర్పంచ్ తుళ్లూరు నిర్మలకుమారి దంపతుల సహకారంతో స్వామి వారిని, అమ్మవారిని సుందరంగా అలంకరించి భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ, వేద పండితులు విజయ్‌కృష్ణ, చక్రధర్, దాతలు కోటేశ్వరరావు, నిర్మలకుమారి ఆధ్వర్యంలో ఉత్తర ద్వారం తెరిచి పుణ్యాహవచనం, ప్రత్యేక పూజలు చేసి అనంతరం భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. స్వామి వారి గోవిందమాల ధరించి ఇరుముడితో వచ్చిన స్వాములకు ముందుగా దర్శనం కల్పించారు. తెల్లవారుజాము నుంచే సుదూర ప్రాంతాల నుంచి భక్తులు దర్శనానికి క్యూలైన్‌లో వేచి ఉన్నారు. గోవింద నామస్మరణతో ఆలయ పరిసరాలు మారుమ్రోగాయి. ప్రధాన అర్చకులు శ్రీనివాసశర్మ మాట్లాడుతూ 24 ఏకాదశులలో ధనుర్మాసంలో వచ్చే ఏకాదశి అత్యంత ప్రాముఖ్యత కలిగి ఉందని ముక్కోటి ఏకాదశి హిందువులకు ఎంతో పవిత్రమైందని ఈ రోజు స్వామి వారిని దర్శనం చేసుకుంటే ముక్కోటి దేవతలను దర్శనం చేసుకున్నంత పుణ్యఫలం లభిస్తుందని తెలిపారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఈవో జగన్‌మోహన్ రావు ఆధ్వర్యంలో ఎస్ఐ రమేష్‌కుమార్ తన సిబ్బందితో పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## సింగరేణి మనుగడకు రాజీలేని పోరాటం

గుర్తింపు సంఘం

ప్రధాన కార్యదర్శి రాజ్ కుమార్



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : సింగరేణి మనుగడ కోసం రాజీలేని పోరాటాలు చేస్తామని, కార్మిక సంక్షేమమే ధ్యేయంగా గుర్తింపు సంఘం ముందుకు సాగుతుందని ఏఐటియూసి అనుబంధ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (గుర్తింపు సంఘం)ప్రధానకార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ అన్నారు. కొత్తగూడెం ఏరియా పిసికే 5 ఇంక్లైన్ గేట్‌మీటింగ్ మంగళవారం జరిగింది. ఫిట్ కార్యదర్శి హుమాయూన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కొరిమి మాట్లాడుతూ సంస్థ ద్వారా నూతన బొగ్గు బ్లాకులను తీసుకొచ్చి సింగరేణి మనుగడను కాపాడాలని డిమాండ్ చేశారు. కార్మికులకు సొంత ఇంటి పథకం అమలు చేసే ప్రతీ కార్మికుడికి 30 లక్షల వడ్డీలేని రుణం ఇవ్వాలన్నారు. యాజమాన్యం మెడికల్ బోర్డు నిర్వహించకుండా కాలయాపన చేస్తుందని మండిపడ్డారు. అదే విధంగా సంస్థ ప్రైవేటు పరం కాకుండా కాపాడుకునేందుకు పోరాటాలకు సిద్ధం కావాలని కార్మికులకు పిలుపునిచ్చారు. కేంద్రం ప్రవేశపెట్టిన నాలుగు నల్ల చట్టాలకు వ్యతిరేకంగా సమ్మెకు సైతం వెనుకాడబోమని స్పష్టం చేశారు. క్వాలిటీ వచ్చే పికే ఓసి డిఫైన్సడ్ బ్లాక్‌ను వేలం లో పెట్టడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. కార్మికుల మారుపేర్లు సమస్య పరిష్కరించాలని, సింగరేణిలో కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై సోమవారం జరిగిన అసెంబ్లీ శీతాకాల సమావేశాల్లో ఏఐటియూసి గౌరవ అధ్యక్షులు, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివ రావు కార్మికుల సమస్యల పరిష్కారానికి మాట్లాడారని అన్నారు. సింగరేణి స్థితిగతులు, కార్మికుల సమస్యలపై ఎప్పుడూ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ నిరంతరం పోరాడుతూనే ఉంటుందన్నారు.

# ప్రశాంత వాతావరణంలో కొత్త సంవత్సర వేడుకలు

ప్రజాపక్షం/ఖమ్మం క్రైం : నూతన సంవత్సర వేడుకలను ప్రశాంతవాతవరణంలో జ రుపుకోవాలని, నిబంధనల ను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పో లీసు కమిషనర్ సునిల్‌దత్ మంగళవారం ఒక ప్రకటన లో ప్రజలకు సూచించారు. డిసెంబర్ 31 రాత్రి జాతీయ రహదారితో పాటు ప్రధాన రహదారులపై వేడుకలు నిషేధించబడ్డాయని పేర్కొన్నారు. మితిమీరిన వేగం, మద్యం సేవించి వాహనాలు నడపవద్దన్నారు. రోడ్డుప్రమాదాలకు గురై దుర్ఘటన పాలైతే నూతన వేడుకల్లో కుటుంబాల్లో విషాదం నింపవద్దని విజ్ఞప్తి చేశారు. ప్రధానంగా యువత ద్విచక్రవాహనాలపై తిరుగుతూ ప్రమాదాల భారీన పడవద్దని పేర్కొన్నారు. గుంపుల గుంపులుగా రోడ్లపై తిరగడం నిషేదమన్నారు. నిర్ణిత నిమయంలో మద్యం దుకాణాలు మూసివేయాలని నిర్వహకులకు సూచించారు. వీధుల వెంట గుంపులు గుంపులుగా తిరుగుతూ కేరింతలు కొడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేయవద్దని యువతను, ఆకతాయిలను హెచ్చరించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో పోలీసు పెట్రోలింగ్ ఏర్పా టు చేసినట్లు తెలిపారు. స్నేహపూర్వక వాతవరణంలో శుభాకాంక్షలు తెలుపుకోవాలన్నారు. మహిళల భద్రతలకు షీటిం బృందాలు పర్యవేక్షిస్తాయన్నారు.



సిపి సునిల్‌దత్

శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ట్రాఫిక్, టాస్క్‌ఫోర్స్, షీటీం, పెట్రోలింగ్ బృందాలు అప్రమత్తంగా ఉండాలన్నారు. బాణాసంచా కల్చడం నిషేధమన్నారు. డిజేలకు అనుమతిలేదన్నారు. బార్లు, వైన్స్ నిర్ణత సమయంలోపు మూసివేయాలన్నారు. మైనర్లకు మద్యం విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. రెస్టారెంట్లు, షాపులు పరిసరప్రాంతాల్లోని సిసి కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకుని విజువల్ రికార్డు అయ్యేలా చూసుకోవాలని యాజమాన్యాలకు సూచించారు. మైనర్లకు వాహనాలు నడుపుతూ పట్టుబడితే వాహన యజమానితో పాటు తల్లితండ్రులను బాధ్యులను చేస్తూ కేసులు నమోదు చేస్తామన్నారు. డ్రంకెన్ డ్రైవ్‌లు ముమ్మరంగా చేపట్టనున్నట్లు తెలిపారు. అర్థ రాత్రి సమయంలో బైక్‌రేసులు, అతివేగంగా వాహనాలు నడపకుండా పోలీసు పెట్రోలింగ్ ము మ్మరం చేసినట్లు పోలీసుకమిషనర్ తెలిపారు.

**ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే జైలుకే : సిఐ సత్యనారాయణ**

నూతన సంవత్సర వేడుకల సందర్భంగా శుభాకాంక్షల పేరుతో యువత అతిఉత్సాహం ప్రదర్శిస్తూ ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు జైలుకు పంపుతామని ట్రాఫిక్ సిఐ బెల్లం సత్యనారాయణ హెచ్చరించారు. మంగళవారం ఈమేరకు ప్రకటన విడుదల చేశారు. ప్రశాంతవాతవరణలో సంబరాలు జరుపుకోవాలన్నారు. మద్యం సేవించి పెద్దపెద్ద శబ్దాలు, కేరింతలు కొడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేవిధంగా బైక్‌పై విన్యాసాలు చేస్తే వాహనాలను స్వాధీనం చేసుకుంటామన్నారు. ఖమ్మం నగరం వ్యాప్తంగా అన్ని ప్రధాన కూడళ్లలో డ్రంకెన్‌డ్రైవ్‌లు నిర్వహిసున్నామన్నారు. మద్యం సేవించి దొరికితే కేసులు నమోదు చేయడమే కా కుండా జైలుకు పంపుతామన్నారు. మహిళల పట్ల మర్యాదగా వ్యవహరించాలని, ఆనందం కోసం ఇతరులకు ఇబ్బందులు కలిగించవద్దన్నారు. షాపింగ్, ఇతర ఈవేంట్లకు వెళ్లినప్పుడు పోలీసువారి సూచనలు పాటిస్తూ ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూసుకోవాలని నగర వాసులకు విజ్ఞాప్తి చేశారు.





# స్థానికం
REGIONAL NEWS


వరంగల్, హన్మకొండ, జనగాం, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్

## పీచర సమ్మక్క సారక్క కమిటీ చైర్మన్ గొల్లెన రమేష్ ఎన్నిక

**ప్రజాపక్షం / వేలేరు :** వేలేరు మండలంలోని పీచర గ్రామశివారులో మిని మేడారంగా పిలువబడుతున్న పీచర సమ్మక్క సారక్క కమిటీని మంగళవా రం ఎన్నుకోవడం జరిగింది చైర్మన్‌గా గొల్లెన రమేష్,వైస్‌చైర్మన్‌గా సట్ల రవిందర్ తోపాటు డైరెక్టర్లను కూడా ఎన్నుకోవడం జరిగిందని సర్పంచ్ మది జ అనిత నర్సింగారావు,మాజీజెడ్పిటిసి కీర్తి వెంకటేశ్వర్లు తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఈనూతనకమిటీని 2026–27వరకు కొనసాగుతోందని గ్రామఅభివృద్ధితోపాటు సమ్మక్క సారక్క దేవస్థానం అభివృద్ధికి తోడ్పాటును అందించాలని కోరారు.

కార్యక్రమంలో మాజీచైర్మన్‌లు కొయ్యడ మహేందర్,ఎర్రగొల్ల ఎల్లయ్య, మారబోయిన రాజు, పోలు తిరుపతి, జంపయ్య, మాజీకోఆప్షన్ సభ్యుడు జానీ, మేకల యాదయ్య, నకీర్త సంపత్, ఏలూరి కళ్యాణ్ తదిత రులు పాల్గొన్నారు.

## బిసి రిజర్వేషన్లకు అఖిలపక్ష భేటీ ఏర్పాటు చేయాలని వినతి



**ప్రజాపక్షం / వరంగల్ :** బిసి రిజర్వేషన్ల సాధనకై ముఖ్యమంత్రి అఖిలపక్ష సమావేశాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు డిమాండ్ చేశారు. బిసిని అధ్య క్షుడు ఆయూబ్ ద్వారా, జిల్లా కలెక్టర్ ద్వారా ముఖ్యమంత్రికి వినతిప త్రాలు సమర్పించారు. ఈ సందర్భాంగా ఆయన మాట్లాడుతూ బిసి హక్కుల సాధన సమితి బిసి రిజర్వేషన్ పెంచిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని, రాష్ట్రంలో బిసిలకు స్థానిక సంస్థల్లో, విద్యా ఉద్యోగ రంగాలలో 42 శాతం రిజర్వేషన్ సాధించేందుకు తక్షణమే అన్ని రాజకీయ పార్టీల బిసి సంఘాల ప్రతినిధులతో అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించి ప్రధానమంత్రి వద్దకు అఖిలపక్ష బృందాన్ని తీసుకు వెళ్లాలన్నారు. బిసి రిజ ర్వేషన్స్ పెంచిన తర్వాతనే జెడ్పిటిసి, ఎంపిటిసి, మున్సిపల్ ఎన్నికలు నిర్వ హించాలని ఆయన డిమాండ్ చేశారు. కలెక్టర్ కార్యాలయంలో అడిషనల్ కలెక్టర్ జి సంధ్యారాణి కి వినతి పత్రాన్ని అందించగా రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. వినతి పత్రాన్ని అందించిన వారిలో జిల్లా అధ్యక్షుడు వలబోజు వెంకన్న, ప్రధాన కార్యదర్శి చింతకింది కుమార స్వామి , సహాయ కార్యదర్శి బొల్ల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## షెల్టర్ హోమ్ పనులను త్వరితగతిన పూర్తి చేయండి :బల్దియా కమిషనర్



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:**షెల్టర్ హోమ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులను ఆదేశిం చారు. హన్మకొండలోని ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి ఆవరణలో నూతనగా నిర్మితమవుతున్న పట్టణ నిరాశ్రయుల కేంద్ర పనులను కమిషనర్ క్షేత్ర స్థాయిలో సందర్శించి నిర్మిత పనుల పురోగతిని అధికారులను అడిగి తెలు సుకొని సమర్థవంతంగా నిర్వహించుటకు తగు సూచనలు చేశారు. ఈ సం దర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రస్తుతం నగర పరిధిలో 2 షెల్టర్‌లు అం దుబాటులో ఉన్నాయని ఇది పూర్తి అయితే హస్పటల్ అటెండెంట్‌తో పాటు సుమారు 100 మంది నిరాశ్రయులకు ఆశ్రయం లభిస్తుందని ఇట్టి పనుల ను ఇంజనీరింగ్ అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేసి పెండింగ్‌లో ఉన్న పెయింటింగ్, సానిటరీ, ఎలక్ట్రికల్ పనులను వేగవంతంగా పూర్తి చేసి అం దుబాటులోకి తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమి షనర్ సమ్మయ్య, ఇఇ రవికుమార్, టిఎంసిరమేష్‌తదితరులు పాల్గొన్నారు.

## నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/మహబూబాబాద్:** ప్రజానేత అమరజీవి ధర్మన్న 25వ వర్ధంతి సందర్భంగా భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ నియోజకవర్గ సమితి ఆధ్వ ర్యంలో 2026 నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సంద ర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి బి విజయసారథి మాట్లాడుతూ 2026 రాబో వు నూతన సంవత్సరంలో ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని వారు ఎంచుకున్న లక్ష్యాలు నెరవేరాలని ప్రజల జీవితాల్లో వెలుగులు నిండాలని ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖ శాంతులతో వర్ధిల్లాలని, సమాజం లో కులం మతం భేదం లేకుండా ప్రజలంతా ఒక్కటే అని అందరూ జీవిం చాలని మానుకోట ప్రజలందరికీ ముందస్తుగా నూతన సంవత్సర 2026 శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ కార్య దర్శి బి అజయ్ సారధి రెడ్డి, పెరుగు కుమార్ రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, కట్లోజు పాండురంగ చారి, వరిపల్లి వెంకన్న, వీరవెల్లి రవి, వెలుగు శ్రావణ్ ,ఎండి ఫాతిమా, మేక వీరన్న, ఆబోతు అశోక్, కేదాసు రమేష్, జలగం ప్రవీణ్, వంకాయలపాటి చిరంజీవి, అజ్మీర వేణు, చీధిరాల జానే శ్వర్ భానోతు లింగ్య, కొమ్ము నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ ఉద్యోగుల సంక్షేమానికి ఎన్‌పిడిసిఎల్ కట్టుబడి ఉంది

ఎన్‌పిడిసిఎల్ సిఎండి కర్నాటి వరుణ్ రెడ్డి



**ప్రజాపక్షం/హనుమకొండ :** విద్యుత్ శాఖలో విధి నిర్వహణ అనేది అత్యం త ప్రమాదంతో కూడుకున్నదని, అటువంటి క్లిష్ట పరిస్థితుల్లో పనిచేసే ఉద్యో గుల సంక్షేమం కోసం నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ ఎల్లప్పుడూ ముందుంటుందని సిఎండి కర్నాటి వరుణ్ రెడ్డి తెలి పారు. మంగళవారం హన్మకొండ నక్కలగుట్టలోని కార్పొరేట్ కార్యాల యంలో ఇటీవల విధి నిర్వహణలో మరణించిన జనగాం సర్కిల్, రఘునా థపల్లి సబ్ డివిజన్, నర్మెట్ట సెక్షన్‌లో పనిచేసిన బానోత్ రాజు అన్ మ్యాన్డ్ వర్కర్ భార్య బానోత్ నీలకు న్యూ ఇండియా ఎస్యూరెన్సు కంపెనీ తరపున రూ.20 లక్షలు, ఎన్‌పిడిసిఎల్ కంపెనీ నుండి రూ.5 లక్షల చెక్కును సిఎం డి కర్నాటి వరుణ్ రెడ్డి అందచేశారు. సిఎండి కర్నాటి వ రుణ్ రెడ్డి మాట్లా డుతూ ఉద్యోగులకు అండగా నిలబడేందుకు కోటి రూపాయల ప్రమాద బీమా, అన్ మ్యాన్డ్ వర్కర్ లకు 20 లక్షల ప్రమాద బీమా కల్పించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు వి.మోహన్ రావు, వి. తిరుపతి రెడ్డి, టి.మధుసూదన్, సి. ప్రభాకర్, సిఇలు కె.రాజు చౌహాన్, జయవంత్ రావు చౌహాన్, జనగాం ఎస్ఇ చెరుకు సంపత్ రెడ్డి, డిఇ జనగాం లక్ష్మి నారా యణ రెడ్డి, ఎడిఇ రఘునాథపల్లి సుధాకర్, ఎస్‌టి అసోసియేషన్ రాష్ట్ర వ ర్కింగ్ అధ్యక్షులు నందా రాథోడ్, టిజిఎన్‌పిడిసిఎల్ కంపెనీ అధ్యక్షుడు హర్జి జాటోత్, ప్రధాన కార్యదర్శి అజ్మీరా శ్రీరామ్ నాయక్, జనగాం జిల్లా అధ్య క్షులు బి. బాలు నాయక్, సెక్రటరీ బి. చంద్ర భాను నాయక్, రాంధన్ నాయ క్, న్యూ ఇండియా అస్యూరెన్స్ కంపెనీ హన్మకొండ సీనియర్ బిజినెస్ మేనే జర్ జ్యోతిర్మయి, క్లెయిమ్‌ఆఫీసర్‌బాలాజీ తదితర నాయకులు పాల్గొన్నారు.

## ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీతో
# ప్రజల జీవితాల్లో మార్పు

జిల్లా కలెక్టర్, రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షురాలు స్నేహ శబరీష్



**ప్రజాపక్షం/హనుమకొండ :** రెడ్‌క్రాస్ సేవా కా ర్యక్రమాల్లో పాల్గొని సేవలందించాలని జిల్లా కలె క్టర్, రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షురాలు స్నేహ శబ రీష్ అన్నారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ హ నుమకొండ జిల్లా సర్వసభ్య సమావేశం మంగళ వారం హనుమకొండ సమీకృత జిల్లా కార్యా లయ భవనంలోని (కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్), సుబేదారిలో జిల్లా కలెక్టర్, రెడ్‌క్రాస్ సొసైటీ అ ధ్యక్షురాలు స్నేహ శబరీష్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించబడింది. ఈ సమావేశానికి ముందు జి ల్లా కలెక్టర్, రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షురాలు స్నే హ శబరీష్, రెడ్ క్రాస్ పాలకవర్గ సభ్యులతో కలి సి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వ్యవస్థాపకులు జీన్ హెన్రీ డ్యూనాంట్, రక్తదాన ఉద్యమ పితామ హులు (ఫాదర్ ఆఫ్ బ్లడ్ డొనొర్స్) కార్ల్ ల్యాండ్ స్టైనర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి కార్యక్ర మాన్ని ప్రారంభించారు. ముందుగా హనుమకొం డ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ పి. విజ యచందర్ రెడ్డి మాట్లాడుతూ, పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా 2022–23, 2023–24, 2024–25 సంవత్సరాలకు సంబంధించిన వా ర్షిక నివేదికలు, ఆడిటెడ్ అకౌంట్లు, అలాగే రా బోయే సంవత్సరానికి ఆదాయ–వ్యయ అంచనా లను సర్వసభ్యులకు వివరించారు. ఈ వార్షిక ని వేదికను సోదా రామకృష్ణ ప్రతిపాదించగా, మం డల పరశురాములు బలపరిచారు. అనంత రం జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ రెడ్ క్రాస్ సొసైటీ సేవాతత్పరతతో ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొచ్చే సంస్థ అని, ప్రస్తుత పా లక వర్గం అనేక సేవా కార్యక్రమాలను విజయవం తంగా నిర్వహించిందని ప్రశంసించారు. ఈ స మావేశంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ హను మకొండ జిల్లా చైర్మన్ డాక్టర్ పి. విజయచందర్ రెడ్డి, వైస్ చైర్మన్ పెద్ది వెంకట్ నారాయణ గౌడ్, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, రాష్ట్ర పాలకవర్గ సభ్యులు ఇ.వి. శ్రీనివాస్ రావు, జిల్లా పాలకవర్గ సభ్యులు పుల్లూరు వేణుగోపాల్, డాక్టర్ మాగంటి శేషు మాధవ్, పొట్లపల్లి శ్రీనివాస్ రావు, డాక్టర్ కె. సుధాకర్ రెడ్డి, డా. సిహెచ్. సంధ్యారాణి, చె న్నమనేని జయశ్రీ, బిళ్ల రమణారెడ్డి, బాశెట్టి హరి ప్రసాద్, రెడ్ క్రాస్ వైస్ ప్రెసిడెంట్ , అదనపు కలె క్టర్ వై.వి. గణేష్, డిటిఐ ఎ. శ్రీనివాస్ కుమార్, టిజిఐ నుండి ఏ. జగన్మోహన్ రావు, డాక్టర్ ప్ర వీణ్ కుమార్, టిఎన్‌జిఐ అధ్యక్షుడు రాజేందర్, సోమన్న, రెడ్ క్రాస్ ప్యాట్రన్లు పొన్నాల రామ్ మోహన్, రావుల అనిల్ కుమార్, గంధ్ర నరో త్తమ్ రెడ్డి, జి. వెంకట్ నారాయణ, శాశ్వత సభ్యు లు నడెం శాంతి కుమార్, బోడ డిన్న, కుసుమ శ్యామ్ సుందర్, నేహాల్, యాకుబ్ రెడ్డి,మండల పరుశరాములు, కార్పొరేటర్ మానస రాంప్ర సాద్, తాడిశెట్టి విద్యాసాగర్, జి. రవీందర్, గోపాల్, పి. శ్రీనివాస్, ట్రాన్సజెండర్ స్టేట్ ప్రెసి డెంట్ : లైలా, గుంటి స్వప్న, పూర్ణిమ రెడ్డి, రేష్మ, రెడ్ క్రాస్ సిబ్బంది, జీవితకాల సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అధికారుల పనితీరుపై నిరంతరం పర్యవేక్షణ

వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్



**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** స్టేషన్ అధికారులు, సిబ్బంది పనితీరుపై పోలీస్ ఉన్నతాధికారులు నిరంతం పర్యవేక్షణ వుండాలని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు. వార్షిక తనిఖీల్లో భాగం వరంగల్ పోలీస్ కమిషనర్ మంగళవారం సెంట్రల్ జోన్ కార్యాలయమును తనిఖీ చేశారు. సెంట్రల్ జోన్ కార్యాలయమునకు చేరుకున్న పోలీస్ కమిషనర్‌కు సెంట్రల్ జోన్ డిసిపి దార కవిత పుష్పగుచ్చాలను అందజేసి స్వాగతం పలకగా, సాయుధ పోలీస్ గౌరవవందనం చేసారు. అనంతరం పోలీస్ కమిషనర్ ముందుగా సెంట్రల్ జోన్ సిసి కార్యాలయమును సందర్శించి ఇక్కడ సిబ్బంది నిర్వహిస్తున్న విధులపై సిపి అరా తీయడంతో పాటు పలు రికార్డులను పరిశీలించారు. రికార్డుల నిర్వహణలో సిపి కార్యాలయ సిబ్బందికి పలు సూచనలు చేయడంతో పాటు, రికార్డులన్ని ఎప్పటికప్పుడు అప్‌డేట్ పెట్టుకోవల్సి వుంటుందని తెలిపారు. తనిఖీల్లో భాగం డిసిపి కార్యాలయములో వరంగల్, హన్మకొండ, కాజీపేట్ డివిజన్ల సంబందిం చిన పలు రికార్డులతో పాటు, గ్రీవేన్స్ దరఖాస్తులు, రౌడీషీటర్ల వివరాలతో శాకపరమైన ఫైల్లను పోలీస్ కమిషనర్ పరిశీలించడంతో సెంట్రల్ జోన్ పనితీరుపై పోలీస్ కమిషనర్ డిసిపి పలు సూచనలు, సలహాలు అందజే శారు. ఈ తనిఖీల్లో వరంగల్ ఎఎస్పి శుభం, కాజీపేట ఎసిపి ప్రశాంత్ రెడ్డి, ట్రైనీ ఐపిఎస్ అధికారి మనిషా నేహ్రా పాల్గొన్నారు.

## బాలానగర వెంకటేశ్వర ఆలయంలో మంత్రి కొండా సురేఖ పూజలు



**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** నగరంలోని రామన్నపేట బట్టల బజారు లోని బాలానగర వెంకటేశ్వరస్వామి దేవాలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచే భక్తులు దేవాలయానికి పోటె త్తారు. రాజు స్వీట్స్ వారు వంద కిలో లడ్డూ ప్రసాదం, కొండూరి జ్ఞానేశ్వ ర్‌రావు వంద కిలోల రవ్వ ప్రసాదం, కాళీ సేవా సమితి వారు వంద కిలో ల రవ్వ కదంబ ప్రసాదం, శ్రీనివాస పద్మావతి సేవా ట్రస్టు వారు 3000 లడ్డూలు పంపిణీ చేశారు. సా.4 గంటల నుంచి భగవద్గీత సామూహిక పారాయణం చేశారని ఆలయ ఈవో కిషన్‌రావు, ఛైర్మన్ పరాశరం శ్రీనివా సచార్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్ గందె కల్పన నవీన్ హాజరై స్వామికి పూజలు చేశారు. దేవాదాయ ధర్మాదాయ అసిస్టెంటు కమిషనర్ సునీతతోపాటు ఆలయంలోని సేవా సమితుల సభ్యులు, ఎన్‌ఎ స్‌ఎస్ కోఆర్డినేటర్ కొడిమాల శ్రీనివాసరావు, సేవా సభ్యులు, పోలీసు, ట్రాఫిక్, మున్సిపల్ శాఖ ఇతోధిక సేవలు అందించినట్లు తెలిపారు. భక్తు లకు కావల్సిన తాగునీరు రామకృష్ణ వాటర్ ప్లాంటు వారు అందించారు.

## విద్యార్థిని చితకబాదిన వార్డెన్‌పై క్రిమినల్ కేసు నమోదు

ఎస్‌సి బాలికల హాస్టల్‌లో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎఎస్‌పి తనిఖీ



**ప్రజాపక్షం/భూపాలపల్లి :**జిల్లా కేంద్రంలోని ఎస్‌సి హాస్టల్‌లో విద్యార్థిని కొట్టిన ఘటనపై వార్డెన్‌ను సస్పెండ్ చేసి, పోలీస్ కేసు నమోదు చేసినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. గత రెండు రోజుల క్రితం జిల్లా కేంద్రంలోని ఎస్‌సి బాలికల హాస్టల్‌లో వార్డెన్ విద్యార్థిని చితకబాదిన ఘటన ఒక ఆ గంత కుడు దూరి విద్యార్థులను భయాందోళనకు గురిచేసిన సంఘటన మీడియా ద్వారా తెలుసుకున్న జిల్లా కలెక్టర్ మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎస్‌సి హాస్టల్‌ను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ముఖా ముఖీగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డిగ్రీ చదువుతు న్న హాస్టల్ విద్యార్థిని నాకు తెలియకుండా బయటకు ఎందుకు వెళ్లావని బాలి కను విచక్షణ రహితంగా కొట్టడం చాలా బాధాకరమని, తక్షణమే ఎస్‌సి అభి వృద్ధి అధికారి ద్వారా విచారణ నిర్వహించి సస్పెండ్ చేసినట్లు తెలిపారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి వార్డెన్‌పై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు. హాస్టల్‌లో జరిగిన ఈ ఘటనపై ప్రాథమిక విచారణ అనంత రం, విధుల్లో నిర్లక్ష్యం వహించినందుకు, బాధ్యతారాహిత్యంగా వ్యవహరించి నందుకు వార్డెన్‌ను తక్షణమే సస్పెండ్ చేయడం జరిగిందని తెలిపారు. బాధ్యు రాలిపై శాఖాపరమైన చర్యలే కాకుండా, క్రిమినల్ కేసు కూడా నమోదు చేసి నట్లు ఆయన తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన మైన శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సంక్షేమ అధికారిని ఈ ఘటనపై ప్రత్యేక విచారణాధికారిగా నియమించామని, ఇప్పటికే హాస్ట ల్‌ను సందర్శించి, విద్యార్థినులతో మాట్లాడి పూర్తి వివరాలు సేకరించామ న్నారు. బాధిత విద్యార్థినికి, హాస్టల్‌లోని ఇతర విద్యార్థినులకు తగిన కౌన్సె లింగ్ ఇచ్చి, వారిలో మనోధైర్యాన్ని నింపేందుకు చర్యలు చేపడతామని తెలి పారు. హాస్టల్‌లో భద్రతను మరింత కట్టుదిట్టం చేస్తామని, జిల్లాలోని అన్ని ప్రభుత్వ హాస్టళ్లు, రెసిడెన్షియల్ స్కూళ్లలో ఇలాంటి అవాంఛనీయ సంఘట నలు జరగకుండా నిరంతర పర్యవేక్షణ చేసేందుకు ప్రత్యేక అధికారులను నియమించినట్లు తెలిపారు. విద్యార్థుల భద్రత ప్రధమ ప్రాధాన్యతని, చట్టాన్ని ఉల్లంఘిస్తే చట్ట పరంగా కఠినంగా శిక్షించబడతారని ఆయన స్పష్టం చేశారు. హాస్టల్ లో ప్రవేశించిన వ్యక్తి ఎవరు అనేది విచారణ జరుగుతున్నదని, విచా రణ నివేదిక రాగానే సంబంధిత వ్యక్తిపై పోలీస్ కేసు నమోదుతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఈ ఘటన పై జిల్లా అదనపు ఎస్పీ నరేష్ కుమార్ హాస్టల్ లో తనిఖీ చేసి అనంతరం మీడియాతో మాట్లా డుతూ..హాస్టల్ వార్డెన్ భవానిపై క్రిమినల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ట్లు తెలిపారు. హాస్టల్ లో దూరిన ఆగంతకుడు ఎవరూ అనేది ఇన్వెస్ట్ గేషన్ చేస్తున్నామని,హాస్టల్ లో దూరిన ఆగంతకుడు, అయన కు సహకరించిన వారిని కూడా ఇన్వెస్ట్ గేషన్ లో తెలుస్తోందని చట్టపరమైన చర్యలు తీసుకుం టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అధనపు కలెక్టర్ విజయ లక్ష్మి, ఎస్సీ అభివృద్ధి అధికారి ఇందిర, సంక్షేమ అధికారి మల్లేశ్వరి, డీఈఓ రాజేందర్, ట్రైని డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, తహసిల్దార్ శ్రీనివాసులు తదిత రులు పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధికి ప్రత్యేక నిధులు

**ప్రజాపక్షం/ములుగు:** మంత్రి సీతక్క చొరవతో గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాస్తుందని ములుగు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవి చందర్, ములుగు పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చింతనిప్పుల భిక్షపతిలు ఆశాభావం వ్యక్తం చేశారు. ములుగు మండలం పత్తిపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో పత్తిపల్లి, దేవగిరిపట్నం రైతులతో సమావేశం నిర్వహిం చగా గ్రామ పంచాయతీ ఇన్‌చార్జిలు ములుగు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, ములుగు పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చింత నిప్పుల భిక్షపతి, ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పత్తిపల్లి గ్రామంలో ఇటీవల జరిగిన స్థానిక సంస్థల సర్పంచ్ ఎన్నికలలో 12కు 12 వార్డు గెలిపించిన కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించినందుకు మంత్రి సీతక్క సంతోషంగా ఉన్నారని, గ్రామ పంచాయతీ పరిధిలోని చింతలపల్లి, చింతకుంట, కొడిశల కుంట గ్రామాలను మంత్రి సీతక్క అభివృద్ధి చేస్తామని చెప్పారని అన్నారు. రాబోయే యాసంగి పంటలకు చెరువులలో నీరు నింపి పత్తిపల్లి, దేవగిరి పట్నం గ్రామ రైతులకు పంటలకు నీరు అందిస్తామని అన్నారు.అదేవిధంగా మేము ఇన్‌చార్జిలుగా ఉన్న మదనపల్లి, జగ్గన్నపేట, పత్తిపల్లి, పొట్లాపూర్, దేవగిరిపట్నం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ విజయంతో మంత్రి సీతక్క సంతో



షంగా ఉన్నారని ఆ గ్రామాల అభివృద్ధికి మంత్రి సీతక్క సహకారంతో ప్రతి గ్రామాభివృద్ధికి సహకరిస్తామని మంత్రి చెప్పారని సంతోషాన్ని వ్యక్తం చేశారు. ప్రతి గ్రామంలో మంత్రి సీతక్క అభివృద్ధి చేస్తానన్నారని ఆశాభా వాన్ని వ్యక్తం చేశారు. పత్తిపల్లి గ్రామాభివృద్ధికి సహకరిస్తున్న ఇన్‌చార్జిలు ములుగు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్‌కి, ములుగు పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చింతనిప్పుల భిక్షపతికి, జిల్లా బిసి సెల్ అధికార ప్రతినిధి గంద్రత్ జయాకర్‌ను శాలువాతో సత్కరించి ప్రత్యేక ధన్య వాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పత్తిపల్లి గ్రామ సర్పంచ్ ధరావత్ సరిత సారయ్య, ఉప సర్పంచ్ పోరిక భద్రునాయక్, బిసి సెల్ అధికార ప్రతి నిధి గంద్రత్ జయాకర్, రైతులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల వేధింపులు ఆపాలి

ఎఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి మేక వెంకటేష్

**ప్రజాపక్షం/మహబూబాబాద్:** మహబూబాబాద్ జిల్లాలోని పలు ప్రైవేట్ పా ఠశాలల యాజమాన్యాలు ఫీజుల పేరుతో విద్యార్థులను, తల్లిదండ్రులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఎఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి మేక వెంకటేష్ ఆరోపించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జనవరి నెల ప్రారంభం కావడంతో, విద్యా సంవత్సరం ముగింపు దశకు చేరుకుందనే నెపంతో పాఠ శాలలు ఫీజుల వసూళ్లపైనే దృష్టి పెట్టాయి. బకాయిలు ఉన్నాయని విద్యార్థు లను తరగతి గదుల బయట నిలబెట్టడం, మానసిక ఒత్తిడికి గురిచేయడం వంటి అమానుష చర్యలకు పాల్పడుతున్నారన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన నిబంధనలను కాదని, అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తూ సామాన్యుల నడ్డి విరుస్తున్నారని విమర్శించారు. జిల్లాలో ఇంత జరుగుతున్నా విద్యాశాఖ అధి కారులు పట్టించుకోకపోవడం వెనుక ఆంతర్యమేమిటని ఆయన ప్రశ్నించారు. వెంటనే జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించి, ఫీజుల పేరుతో విద్యార్థు లను వేదిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని వెంకటేష్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి ఎఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్య క్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఎఐఎస్‌ఎఫ్ పట్టణ కార్యదర్శి వికాస్, సాయి పలువురు నాయకులు పాల్గొన్నారు.

## వీధిలైట్లు వెలుగక ప్రజల ఇబ్బందులు



**ప్రజాపక్షం/కేసముద్రం:** కేస ముద్రం మున్సిపల్ పరిధి లోని విలీన గ్రామాలు, ము న్సిపల్ కేంద్రంలోని ఆర్‌ఓ బిపై వీధిలైట్‌లు వెలుగకున్నా మున్సిపల్ అధికారులు అల సత్వం వహిస్తున్నారని సిపిఐ మండల కో కన్వీనర్ మంద భాస్కర్ ఆరోపించారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని విలీన గ్రామాలు, ఆర్‌ఓబి ప్రాంతాలను సిపిఐ ఆధ్వర్యంలో పరిశీలిం చారు. కేసముద్రం మున్సిపాలిటీగా ఏర్పడినా సమస్యలు మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందని, ఆర్‌ఓబిపై వీధిలైట్‌లు వెలుగక అనేక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. విలీన గ్రామాలలో సైతం వీధిలైట్‌లు లేక గ్రామాలలో కారు చీకట్లు కమ్ముకొని ఉంటున్నాయని, రాత్రి వేళల్లో వీధుల వెంట విష పురుగుల సంచారంతో ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. ప్రయాణీకుల, ప్రజలు ప్రాణాల పట్ల మున్సిపల్ అధికారులకు పట్టింపు లేదా అని ప్రశ్నించారు. మున్సిపాలిటి అభివృద్ధి కోసం వందల కోట్లు కేటాయించామని ప్రభుత్వం చెప్తున్న లెక్కలు ఏమయ్యాయని ప్రశ్నించారు. సంతలో ఏర్పాటు చేసిన లైట్లు సంత లేని రోజులలో కూడా వెలగడం వల్ల ప్రజా ధనం దుర్వినియోగం అవుతుందన్నారు. వారానికి ఒకసారి జరిగే సంతకు ప్రాముఖ్యత ఇస్తున్న మున్సిపల్ అధికారులు ప్రయాణీకులు, ప్రజల సౌక ర్యార్థం హెచ్చరికల బోర్డులు, వీధిలైట్‌లను వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు కాసు సాయి చరణ్, మహమ్మద్ పాషా తదితరులు పాల్గొన్నారు.

## ఎంపిపిఎస్ పాఠశాల అర్ధాంతరంగా మూసివేత

తక్షణమే తెరిపించాలని సిపిఐ, ఇన్సాఫ్, ఎఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన



**ప్రజాపక్షం/మహబూబాబాద్:** మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధి లోని 25వ వార్డ్ నందమూరి నగర్‌లోని ఎంపిపిఎస్ ఉర్దూ, ఇంగ్లీష్ పాఠ శాలలు సెప్టెంబర్‌లోనే అర్ధాంతరంగా మూసివేయడం వలన ఈ ప్రాంత విద్యార్థులకు ఇబ్బందుల అవుతున్నాయని సిపిఐ, ఇన్సాఫ్, ఎఐటియుసి ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక పాఠశాల ముందు ఆందోళన కార్య క్రమం నిర్వహించారు. ఈ ఆందోళనుద్దేశించి సిపిఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి అజయ్ సారధి రెడ్డి, ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి వెలుగు శ్రావణ్ ,ఇన్సాఫ్ జిల్లా నేత ఎండి ఫాతిమా మాట్లాడుతూ ఈ ప్రాంతంలో సుమారు మూడు వార్డుల్లోని 10కాలనీలకు చెందిన మైనార్టీ విద్యార్థులు ఈ ప్రాంతంలో ఉన్న ఉర్దూ మీడియం లోనే చదువుతున్నారని, అర్ధాంత రంగా విద్యార్థులకు చెప్పకుండా సెప్టెంబర్ లోనే ఈ పాఠశాల మూసివే యడంతో విద్యార్థుల చదువు మధ్యలోనే ఆగిపోయి చదువు లేక ఇబ్బం దులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే పాఠశాల తెరిపిం చాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పెరుగు కుమార్. చింతకుంట వెంకన్న. ఎండి రఫీ, ముజాహిద్, ఇమ్రాన్, మంద శంకర్. తండ శ్రీనాథ్, ముబీన్, లతీఫ్, రుబీనా, ఫరీదా, దీపిక, రాణి, రఫీ, వీర భద్రం, షాహిదా, ఉపేందర్, ఉపేంద్రమ్మ, పృద్వి తదితరులు పాల్గొన్నారు.

## బొమ్మ పిస్తోలు ఉపయోగించిన వ్యక్తి అరెస్ట్

**ప్రజాపక్షం/జనగామ :** బొమ్మ పిస్తోలు ఉపయోగించి డబ్బులు వసూలు చేస్తున్న నిందితుడిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ భరత్ కుమార్ తెలిపారు. మం గళవారం ఆయన ఒక ప్రకటన చేస్తూ రఘునాథపల్లి మండలానికి చెందిన మల్లిగారి సతీష్ జనగామ హాస్పిటల్ ముందు ఉన్న సింధు వైన్స్‌లో మద్యం సేవిస్తుండగా ఇంగ ప్రశాంత్ అలియాస్ ప్రసాద్ అనే వ్యక్తి బొమ్మ గన్ ఉప యోగించి బెదిరించడంతోపాటు రూ.5వేలు ఇవ్వాలని డిమాండ్ చే యడం జరిగిందన్నారు. ఈ విషయమై బాధితుని ఫిర్యాదు మేరకు పోలీ సులు కేసు నమోదుచేసి బొమ్మ తుపాకీతో బెదిరింపులకు పాల్పడుతు న్న వ్యక్తిని అరెస్ట్ చేయడం జరిగింద న్నారు. నిందితుడిని పట్టుకోవడం లో ప్రతిభ కనబరిచిన కానిస్టేబుల్ కృష్ణ, సాగర్, చరణ్‌లను డీసీపీ అభినందించారు.



# రీల్

## థియేట్రికల్‌గా రూ.20కోట్ల కలెక్షన్స్

తెలుగు తెరపై చిన్న సినిమాగా విడుదలై పెద్ద విషయం సాధించిన రాజు వెడ్స్ రాంబాయి. ఈ సినిమా విడుదల రోజు నుంచే కలెక్షన్ల వర్షం కురిపించింది. ఈ సినిమా థియేట్రికల్‌గా రూ.20కోట్ల కలెక్షన్స్ సాధించి ఈ ఏడాది విడుదలైన చిన్న చిత్రాల్లో భారీ కలెక్షన్లు వసూలు చేసిన చిత్రంగా నిలిచింది. మరోవైపు ఓటీటీలోనూ సత్తాచాటింది. ఈటీవీ విన్‌లో స్ట్రీమింగ్ అవుతున్న రాజు వెడ్స్ రాంబాయి మూవీ 100 ప్లస్ మిలియన్ మినిట్స్ వ్యూయర్ షిప్ దక్కించుకోవడం విశేషం. హార్ట్ టచింగ్ లవ్ స్టోరీ అంటూ ప్రేక్షకులు, క్రిటిక్స్ నుంచి సైతం ఈ సినిమా ప్రశంసలు అందుకుంది.




## బాక్సాఫీస్ వద్ద 'మెగా-విక్టరీ' హంగామా..



రాబోయే సంక్రాంతికి థియేటర్లలో అసలైన పూనకాలు తెచ్చేందుకు సిద్ధమవుతున్నారు అగ్ర కథానాయకుడు మెగాస్టార్ చిరంజీవి. ఆయన ప్రధాన పాత్రలో అనిల్ రావిపూడి దర్శకత్వంలో రాబోతున్న చిత్రం 'మన శంకరవరప్రసాద్ గారు'. ఈ చిత్రంలో వెంకటేష్ ఒక పవర్‌ఫుల్ అతిథి పాత్రలో నటిస్తుండటం విశేషం. ఈ సినిమా విడుదల తేదీ దగ్గరపడుతుండటంతో చిత్ర యూనిట్ 'ఆర్ యూ రెడీ' అనే మాస్ పాటను విడుదల చేసింది. ప్రముఖ గీత రచయిత కాసర్ల శ్యామ్ అందించిన సాహిత్యం మాస్ ఆడియన్స్‌ను ఉర్రూతలూగిస్తోంది. ఏంటి బాసూ సంగతీ.. అదిరిపోద్దీ సంక్రాంతీ.., ఏంటి వెంకీ సంగతీ.. ఇరగతీద్దాం సంక్రాంతీ.. అంటూ సాగే లైన్లు అభిమానుల చేత ఈలలు వేయిస్తున్నాయి. మెగాస్టార్ తన సిగ్నేచర్ స్టెప్పులతో గ్రేస్‌ను చూపిస్తుంటే, వెంకటేష్ తనదైన కామెడీ టైమింగ్, మేనరిజమ్స్‌తో పాటలో జోష్ నింపారు. పాట చిత్రీకరణలో అనిల్ రావిపూడి తనదైన కలర్‌ఫుల్ అండ్ ఎనర్జిటిక్ మార్క్‌ను చూపించారు. ఈ చిత్రంతో మెగాస్టార్ మరోసారి తన బాక్సాఫీస్ స్టామినాను నిరూపించుకోవడానికి సిద్ధమయ్యారు. వెంకటేష్ తోడవ్వడంతో ఈ సినిమా ఫ్యామిలీ ఆడియన్స్‌తో పాటు మాస్ ప్రేక్షకులకు కూడా ఫుల్ మీల్స్ లాంటి విందు అని సినీ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

## 'మోహన్ వడ్లపట్ల'కు సంయుక్త కార్యదర్శి బాధ్యతలు

అభినందించిన సురేష్ బాబు



తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్‌లో ప్రధాన పదవులకు జరిగిన తాజా ఎన్నికల్లో నిర్మాత మోహన్ వడ్లపట్ల మరోసారి కీలక బాధ్యతలు దక్కించుకున్నారు. 'మన ప్యానల్' నుంచి పోటీ చేసిన ఆయన, నిర్మాతల విభాగానికి ప్రాతినిధ్యం వహిస్తూ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడిగా గెలుపొందారు. అనంతరం 2025–2027 పదవీ కాలానికి సంయుక్త కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మోహన్ వడ్లపట్లకు బాధ్యతలు అప్పగించిన చాంబర్ అధ్యక్షుడు దగ్గుబాటి సురేష్ బాబు అభినందించారు. ఈ సందర్భంగా మోహన్ వడ్లపట్ల మాట్లాడుతూ.. నూతన కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తానని చెప్పారు. గత కమిటీలో దిల్ రాజు అధ్యక్షుడిగా ఉన్నప్పుడు సంయుక్త కార్యదర్శిగా పని చేశాను, ఈ పర్యాయం దగ్గుబాటి సురేష్ బాబు అధ్యక్షుడిగా ఉన్న కమిటీలో సంయుక్త కార్యదర్శిగా పని చేయడం సంతోషంగా ఉంది అని మోహన్ వడ్లపట్ల తెలిపారు. తెలుగు సినిమా నిర్మాణ, పంపిణీ, ప్రదర్శన రంగాలకు ఫిల్మ్ ఛాంబర్ కీలక దిక్సూచి సంస్థగా నిలుస్తుందని తెలిపారు. పరిశ్రమ అభివృద్ధి దిశలో మరింత బలోపేత దిశగా అడుగులు పడనున్నాయని అన్నారు. ఈసారి అందరూ సీనియర్లు ఉన్నారు కాబట్టి వారి అనుభవం, పరిశ్రమ పట్ల నిబద్ధత ఫిల్మ్ ఛాంబర్‌కు మరింత ఉపయోగకరంగా ఉండనుందని ఆయన అభిప్రాయపడ్డారు.

## ఈ మూవీ చూసి ఎంజాయ్ చేశా..

### శంబాల సక్సెస్ మీట్‌లో అల్లు అరవింద్




నిజాయితీగా సినిమా తీస్తే ప్రేక్షకులు సక్సెస్ ఇస్తారని మరోసారి నిరూపించారని ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ అన్నారు. ఆది సాయి కుమార్ హీరోగా నటించిన 'శంబాల' చిత్రం ప్రస్తుతం సక్సెస్ ఫుల్‌గా దూసుకుపోతోంది. ఈ క్రమంలో సోమవారం చిత్రానికి సంబంధించిన విజయోత్సవ వేడుక డివైన్ బ్లాక్‌బస్టర్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏస్ ప్రొడ్యూసర్ అల్లు అరవింద్, ప్రముఖ దర్శకులు వశిష్ట, బాబీ, యంగ్ హీరో సందీప్ కిషన్, ప్రముఖ రచయిత కోన వెంకట్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అల్లు అరవింద్ మాట్లాడుతూ' శంబాల' సినిమాని యుగంధర్ ముని అద్భుతంగా తెరకెక్కించారు. సాయి కుమారర్‌తో మాది మూడు తరాల అనుబంధం ఉంది. 'శంబాల' ట్రైలర్ చూసిన వెంటనే ఆదికి బన్నీ మెసెజ్ పెట్టాడు. కొడుకు పైకి రావడంలో తండ్రికి ఉండే ఆనందం నాకంటే ఎవరికి బాగా తెలుస్తుంది. నా కుటుంబంలోని వ్యక్తి సక్సెస్ అయినప్పుడు నేను రావాలని ఇక్కడకు వచ్చాను. కొంచెం ఆలస్యంగా అయినా కూడా ఆది అద్భుతంగా నటించి విజయాన్ని అందుకున్నాడు. ఇక నుంచి ఆది హైవే ఎక్కినట్టుగా దూసుకుపోవాలి. బ్రహ్మాండమైన పాత్రలు ఎంచుకుని ముందుకు సాగాలని కోరుకుంటున్నాను. శంబాల మూవీని చూసి నేను చాలా ఎంజాయ్ చేశాను అని అన్నారు. ఆది సాయి కుమార్ మాట్లాడుతూ 'శంబాల' సినిమా చూసి మరీ అల్లు అరవింద్ ఇక్కడికి వచ్చారు. ఈ జర్నీలో ఇండస్ట్రీలో నుంచి ఎంతో మంది నాకెంతో సపోర్ట్ చేశారు. మా ట్రైలర్ రిలీజ్ చేయడమే కాకుండా.. బ్లాక్ బస్టర్ అని కూడా ప్రభాస్ పోస్ట్ పెట్టారు. నాకు హిట్టు పడాలని అందరూ సపోర్ట్ చేశారు. మా డైరెక్టర్ యుగంధర్ ఈ మూవీ కోసం రెండేళ్లు కష్టపడ్డారు. ప్రతీ క్రెడిట్ ఆయనకే దక్కాలి. మళ్లీ మేమంతా కలిసి ఓ సినిమా చేయాలని కోరుకుంటున్నాను. సాయి కుమార్ మాట్లాడుతూ 'అమ్మానాన్నల ఆశీర్వాదంతో 50 ఏళ్లుగా ఇండస్ట్రీలో కొనసాగుతున్నాను. ఇప్పుడు ఇలా 'శంబాల'తో హిట్టు ఇవ్వడం ఆడియెన్స్ గిఫ్ట్. సినిమా ఫ్లాప్ అయినా ప్రయత్నం ఆపొద్దు అని మా అమ్మ నాకు చెబుతుండేవారు. అదే మాట ఆదికి కూడా చెప్పాను. 'శంబాల'తో హిట్టు రావడం ఆనందంగా ఉంది. డైరెక్టర్ బాబీ, డైరెక్టర్ వశిష్ట, సందీప్ కిషన్, కోన వెంకట్, రాజేష్ దండా, అయ్యప్ప శర్మ, రవి శంకర్, నిర్మాత మహీధర్ రెడ్డి, నిర్మాత రాజశేఖర్, అన్నభీమోజు, దర్శకుడు యుగంధర్, అర్చనా ఐయ్యర్, మైత్రి శశి, ఉషా పిక్చర్స్ సురేష్, మ్యూజిక్ డైరెక్టర్ శ్రీ చరణ్ పాకాల ఈ సక్సెస్ మీట్‌లో పాల్గొన్నారు.

## ముచ్చటగా మూడోసారి!



సిద్ధు జొన్నలగడ్డ, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ కలయికలో వస్తున్న మూడో చిత్రమిది. గతంలో వీరి కలయికలో వచ్చిన డీజే టిల్లు, టిల్లు స్క్వేర్ సినిమాలు భారీ విజయం సాధించాయి. ఇప్పుడు వారు హ్యాట్రిక్ కోసం సన్నద్ధమవుతున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తన ప్రత్యేకమైన కథన శైలితో గుర్తింపు పొంది, తెలుగు చిత్ర సీమలో ప్రతిభగల యువ దర్శకులలో ఒకరిగా పేరుగాంచిన స్వరూప్ ఆర్ఎస్జే.. ఈ ప్రతిష్టాత్మక చిత్రం యొక్క కథ, కథనం మరియు దర్శకత్వ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అద్భుతమైన కథాకథనాలతో ప్రేక్షకులను ఆకట్టుకునే ఓ కొత్త ప్రపంచాన్ని తెరపై ఆవిష్కరించనున్నారు. ఈ సినిమాలో సిద్ధు జొన్నలగడ్డను కొత్తగా, గాఢమైన, అదే సమయంలో వినోదాత్మకమైన అవతారంలో చూడబోతున్నాము. నిరంతరం తనను తాను కొత్తగా ఆవిష్కరించుకోవడంలో పేరుగాంచిన సిద్ధు జొన్నలగడ్డ, నటుడిగా తనను సవాలు చేసే కథలను ఎంచుకోవడంలో ప్రేక్షకులను మరింత లోతుగా ఆకట్టుకోవడంలో తన నిబద్ధతను మరోసారి చాటుకున్నారు. మిగితా వివరాలు త్వరలోనే వెల్లడించనున్నారు.

## బండ్ల.. బ్లాక్‌బస్టర్స్

### నూతన చిత్ర నిర్మాణ సంస్థ ప్రారంభం



నటుడిగా కెరీర్ ప్రారంభించి, ఆ తర్వాత నిర్మాతగా మారిన బండ్ల గణేష్, మాస్ మహారాజా రవితేజ నటించిన 'అంజనేయులు' చిత్రంతో సినీ నిర్మాణ రంగంలోకి అడుగుపెట్టారు. ఈ సినిమాతోనే ఆయన తన సొంత బ్యానర్ 'పరమేశ్వర ఆర్ట్ ప్రొడక్షన్స్'ను ప్రారంభించారు. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటించిన సంచలన బ్లాక్‌బస్టర్ 'గబ్బర్ సింగ్' చిత్రంతో ఈ బ్యానర్‌కు మొదటి బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ లభించింది. ఈ సినిమా బండ్ల గణేష్‌ను ఒక విజయవంతమైన నిర్మాతగా సుస్థిరం చేసింది. ఆ విజయం స్ఫూర్తితో, ఈ బ్యానర్ 'బాద్షా', 'ఇద్దరమ్మాయిలతో', 'టెంపర్' వంటి అనేక ప్రతిష్టాత్మక, కమర్షియల్‌గా విజయవంతమైన చిత్రాలను నిర్మించి తెలుగు సినిమాలో ప్రత్యేక గుర్తింపును సంపాదించుకుంది. ఇప్పుడు తన కొత్త నిర్మాణ సంస్థ 'బండ్ల గణేష్ బ్లాక్‌బస్టర్స్' (బీజీ బ్లాక్‌బస్టర్స్)ని అనౌన్స్ చేశారు. ఈ కొత్త అధ్యాయాన్ని మరింత ప్రత్యేకంగా మార్చే విషయం ఏమిటంటే, ఇందులో నెక్ట్స్ జనరేష్ భాగస్వామ్యం చేస్తానని బండ్ల గణేష్ ఈ సందర్భంగా చెప్పారు. బీజీ బ్లాక్‌బస్టర్స్ బ్యానర్ ద్వారా మనసుకి దగ్గరగా ఉండే సినిమాలు, నిజాయితీతో కూడిన కథలు, కంటెంట్ రిచ్ చిత్రాలను ప్రేక్షకులకు అందించాలనే లక్ష్యంతో బండ్ల గణేష్ ముందుకు సాగుతున్నారు. కొత్త ఆలోచనలు, వినూత్న కథనాలు, ఫ్రెష్ టాలెంట్‌కు అవకాశం ఇవ్వడమే ఈ బ్యానర్ ప్రధాన ఉద్దేశం. బండ్ల గణేష్, అతని టీం వరుసగా ఎక్సైయిటింగ్ ప్రాజెక్టులను నిర్మించడానికి ప్రణాళికలు చేస్తున్నారు. ఇప్పటికే ఒక ప్రాజెక్ట్ ఖరారైంది, దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలో వెలువడనుంది.

## ఇక ఓటీటీలోకి 'బ్యూటీ'..




టాప్ ఓటీటీ మాద్యమాల్లో ఒకటిగా గుర్తింపు సంపాదించుకున్న జీ5 తాజా లవ్ స్టోరీ బ్యూటీ సినిమా ప్రేక్షకులకు అందిస్తోంది. అంకిత్ కొయ్య హీరోగా, నిలఖి పాత్రా హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రం జీ 5లో జనవరి 2 నుంచి స్ట్రీమింగ్ కానుంది. హృదయాన్ని హత్తుకునే క్యూట్ లవ్ స్టోరీ ఓ వైపు.. కూతురిపై అపరిమితమైన ప్రేమను చూపించే తండ్రి భావోద్వేగం మరో వైపు.. ఈ సంఘర్షణలో కథ ఎలాంటి మలుపులు తీసుకుందనే ఆసక్తికరమైన మలుపులున్న కథాంశంతో బ్యూటీ సినిమాను రూపొందింది. సెప్టెంబర్ 15న విడుదలైన ఈ చిత్రం థియేటర్స్‌లో ప్రేక్షకుల ప్రశంసలను అందుకుని ఇప్పుడు జీ 5లో జనవరి 2 నుంచి అందరికీ అందుబాటులోకి రానుంది.

## టోల్ ఫ్రీ చేయండి

(మొదటి పేజీ తరువాయి)

జనవరి 13 వరకు వాహనాల రాక విపరీతంగా ఉంటుందని కోమటిరెడ్డి లేఖలో పేర్కొన్నారు. పంతంగి, కొర్లపహాడ్, చిల్లకల్లు టోల్ గేట్ల వద్ద ఉన్న డేటా ప్రకారం.. సాధారణ రోజుల కంటే ఈ సమయంలో 200% అదనపు ట్రాఫిక్ ఉంటుందని వివరించారు. దీనివల్ల టోల్ ప్లాజాల వద్ద ప్రయాణికులు తీవ్ర జాప్యానికి గురవుతున్నారని లేఖలో తెలిపారు. జంక్షన్లు, జనావాసాలు ప్రస్తుతం రహదారిపై జరుగుతున్న పనుల వల్ల కూడా ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌హెచ్ఎఐ పోలీసులతో కలిసి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తోందని పేర్కొన్నారు. ప్రయాణం సాఫీగా సాగడం కోసం టోల్ వసూలు చేయకుండా (టోల్ ఫ్రీ) టోల్ మినహాయింపు ఇచ్చి వాహనాలను అనుమతించాలని కోరారు. హైదరాబాద్ నుండి విజయవాడకు: జనవరి 9 నుండి 14 వరకు. విజయవాడ నుండి హైదరాబాద్‌కు: జనవరి 16 నుండి 18 వరకు. ప్రజల సౌకర్యార్థం జనవరి 9 నుండి 18 వరకు ఈ మార్గంలో ఉచిత ప్రయాణాన్ని (టోల్ ఫ్రీ) అనుమతించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి కేంద్ర మంత్రిని లేఖలో అభ్యర్థించారు.

**అధికారులతో మంత్రి సమీక్ష...**

'హైదరాబాద్ విజయవాడ హైవేపై జనవరి 8 నుండి వాహన రద్దీ ఎక్కువ ఉంటుంది. సంక్రాంతికి వెళ్ళే వారికి ఇబ్బంది లేకుం డా అన్ని రకాల చర్యలు చేపట్టాలని అధికారులను మంత్రి కోమటిరెడ్డి వెకంట్‌రెడ్డి సూచించారు. పోయినసారి ఎదురైనా అనుభవాల దృష్ట్యా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. రోజుకు సుమారు లక్ష వాహనాల ప్రయాణం సాగుతుందని.. దీనిపై అన్ని విభాగాల అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. బుధవారం తాను తూప్రాన్ పేట్, అబ్దుల్లాపూర్ మెట్ ప్రాంతాల్లో ఫీల్డ్ విజిట్ చేస్తానన్నారు. ప్రధానంగా ఎల్‌బినగర్ నుండి వనస్థలిపురం, పనామా గోడౌన్, హయత్ నగర్, రామోజీ ఫిల్మ్ సిటీ ఈ ప్రాంతాల్లో వేలాది వాహనాలు రద్దీ ఏర్పడుతుంది.ఇక్కడ ఎట్టి పరిస్థితుల్లో ట్రాఫిక్ ఆగడానికి వీల్లేదు.. పండుగ రద్దీ ఉన్న రోజుల్లో లేన్‌లు మూసే పనులు, భారీ యంత్రాలతో చేసే పనులు చేయొద్దు. అత్యవసరంగా చేయాల్సిన పనులు ట్రాఫిక్ తక్కువగా ఉండే రాత్రి వేళల్లో మాత్రమే చేయాలి. పండుగ మొదలుకానున్న తేదీకి ముందే రోడ్లపై ఉన్న మట్టి, నిర్మాణ సామగ్రి, యంత్రాలు పూర్తిగా తొలగించాలని అధికారులను ఆదేశించారు. రద్దీ ఎక్కువగా ఉండే జంక్షన్లు, టోల్ ప్లాజాలు, కీలక ప్రాంతాల్లో అదనపు ట్రాఫిక్ పోలీసులను మోహరించాలన్నారు. ప్రత్యేక కంట్రోల్ రూం సెంటర్ ఏర్పాటు చేయాలని, 108అంబులెన్స్‌లు, మెడికల్ టీంలు, రెవెన్యూ, పోలీసు, ఆర్ అండ్ బి, ఎన్‌హెచ్ఎఐ అప్రమత్తంగా ఉండాలన్నారు. తాను స్వయంగా మోటార్ సైకిల్ మీద తిరుగుతూ క్షేత్ర స్థాయిలో పరిశీలన చేస్తానని అన్నారు. చౌటుప్పల్, నార్కట్ పల్లి, కట్టంగూరు, పెద్దకాపర్తి, గుండ్రంపల్లి, వద్ద ఉన్న ఇబ్బందులు అధిగమించాలని, ఆయా జిల్లా కలెక్టర్ల ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి. రోడ్ ఎంక్రోచ్ మెంట్స్ వెంటనే తొలగించాలని ఆదేశించారు. అధికారులు అంతా డ్యూటీలోనే ఉంటూ ఈ సంక్రాంతికి ట్రాఫి క్ ఫ్రీ రోడ్లు లక్ష్యంగా పనిచేద్దాం అని మంత్రి పేర్కొన్నారు.



హైదరాబాద్ 38వ బుక్ ఫెయిర్ డిసెంబర్ 19 నుండి 29 వరకు ఎన్టీఆర్ స్టేడియంలో జరిగింది. అందులో భాగంగా నవచేతన పబ్లిషింగ్ హౌస్ బుక్ స్టాల్‌ను తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక సలహామండలి సభ్యులు, తెలంగాణ ప్రజానాట్యమండలి ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహ్మ సందర్శించారు. సాహిత్యం కళలు, శ్రీశ్రీ పాటల పుస్తకాలు విక్రయించారు.

## సిఐఎ దాడులు! (మొదటి పేజీ తరువాయి)

భావిస్తున్నారు. ఒక రేవు ప్రాంతంలో పడవలను నిలబెట్టి ఆ పడవల్లో మాదక ద్రవ్యాలను ఎక్కిస్తున్నారని, దీనితో వెనిజులాకు సంబంధం ఉందని, మాదక ద్రవ్యాల లోడింగ్ జరుగుతున్న సమయంలో భారీ పేలుళ్ళతో పడవలపై దాడులు చేశామని ట్రంప్ చెప్పారు. ఇది డ్రగ్స్ ఎగుమతి చేసే అతిపెద్ద కేంద్రంగా ట్రంప్ చెప్పారు. కానీ ఈ డాక్ ఏరియా ఎక్కడ ఉంది? ఎక్కడ దాడులు చేశారు? సహా ఇతర వివరాలను మాత్రం ఆయన చెప్పలేదు.ఐతే వెనిజుల్లో ఈ రేవు ప్రాంతం ఎక్కడ ఉన్నదీ ట్రంప్ వివరం చెప్పకుండా పరిమిత సమాచారమే ఇచ్చారు. అతిపెద్ద ఐతే ఈ దాడులు సిఐఎ నాయకత్వంలో జరిగాయన్నదే ప్రధానాంశం. వెనిజులా అధ్యక్షుడు నికొలస్ మదురో నార్కో టెర్రరిజాన్ని ప్రోత్సహిస్తున్నారని, మాదక ద్రవ్యాల ముఠాలకు ఆశ్రయం ఇస్తున్నారని మొదటినుండీ తీవ్ర ఆరోపణలు చేస్తున్న ట్రంప్ వెనిజులాపై సైనిక దాడి తప్పదని ఎప్పటినుండో చెబుతున్నారు. ఈ ప్రణాళికలో భాగంగానే దాడులు మొదలయ్యాయి. ఇప్పటికే ట్రంప్ వెనిజులా ముడి చమురు నౌకల రాకపోకలను స్తంభింపజేశారు. వెనిజులా చమురు విక్రయ ఆదాయాలను మాదక ద్రవ్య ముఠాల నేరగాళ్ళకు పెట్టుబడులుగా సమకూరుస్తోంమదని ఆయన ఆరోపిస్తున్నారు. ట్రంప్ చేస్తున్నవన్నీ బూటకపు ఆరోపణలని, తమ దేశంలో ఉన్న అపారమైన ముడి చమురు నిల్వలను, ఖనిజ వనరును దోచుకోవడం కోసమే ట్రంప్ ఈ దురాక్రమణకు పాల్పడుతున్నారని, కొలంబియా, వెనిజులా సహా దక్షిణ అమెరికాలో కమ్యూనిస్టు ప్రభుత్వాలను కూల్చివేసేందుకే నార్కో టెర్రరిజం పేరుతో ఆరోపణలు చేస్తున్నారని మదురో విమర్శిస్తున్నారు. ట్రంప్ ప్రకటించిన దాడుల ఘటనపై వెనిజులా ప్రభుత్వం ఇంకా స్పందించలేదు. ఐతే సిఎన్ఎన్, న్యూయార్క్ టైమ్స్ పత్రికల కథనాల ప్రకారం, సిఐఎ గూఢచారి సంస్థ ఈ డాక్ ఏరియాలో ఉన్న పడవలపై దాడులు చేసింది, దానివల్ల పేలుళ్ళు సంభవించాయి. వెనిజులా అధ్యక్షుడు నికొలస్ మదురో ప్రభుత్వాన్ని కూల్చివేసేందుకు సిఐఎ గూఢచారి సంస్థను ట్రంప్ రంగంలోకి దింపినట్లు ఈ కథనాల ద్వారా వెల్లడవుతోంది. ఇదే విషయాన్ని పాత్రికేయులు నేరుగా ట్రంప్‌ను ప్రశ్నించగా, "నేను ఈ విషయం చెప్పదలచుకోలేదు, ఎవరు దాడులు చేశారనే విషయం ఖచ్చితంగా నాకు తెలుసు, ఎవరు దాడి చేశారరో నేను చెప్పను" అని ట్రంప్ కరాఖండీగా మీడియాకు చెప్పారు. వెనిజులాపై భూతల దాడులు చేస్తామని, నికొలస్ మదురో పదవి నుండి గౌరవ ప్రదంగా వైదొలగిపోవాలని ట్రంప్ పదే పదే హెచ్చరికలు చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ఆయనను పదవీచ్యుతుణ్ణి చేసే రహస్య కార్యకలాపాలు నిర్వహించడానికి ట్రంప్ సిఐఎకు అధికారాలు ఇచ్చారు. ట్రంప్ మంగళవారం చేసిన ప్రకటనపై ఎలాంటి అధికారిక స్పందనా వెనిజులా ప్రభుత్వం నుండి రాలేదు. డాక్ ఏరియాపై దాడులు జరిగినట్లు వెనిజులా అధికార మీడియా కూడా ఎలాంటి వార్తలూ ఇవ్వలేదు. ఈ విషయంపై వైట్‌హౌస్ కూడా ఇంకా వ్యాఖ్యానించలేదు.

## ఖలీదాజియా కన్నుమూత

(మొదటి పేజీ తరువాయి)

తారిఖ్ రెహ్మాన్ మీడియాకు ఈ విషయం చెప్పారు. దీంతో బంగ్లాదేశ్‌లో విషాదఛాయలు అలముకున్నాయి. పెద్దసంఖ్యలో ప్రజలు ఆసుపత్రివద్దకు చేరుకున్నారు. దేశంలో మూడురోజులు సంతాపదినాలుగా ప్రభుత్వం ప్రకటించింది. బుధవారంనాడు జాతీయ సెలవుదినంగా ప్రకటించారు. ఖలీదాజియా భర్త, బంగ్లాదేశ్ మాజీ అధ్యక్షుడు (1977–1981), మిలిటరీ జనరల్ జియావుర్ రెహ్మాన్ సమాధి పక్కనే ఆమెను కూడా ప్రభుత్వ లాంఛనాలతో బుధవారం ఖననం చేస్తారు. అంత్యక్రియలకు భారత్ తరఫున విదేశాంగ శాఖ మంత్రి జయశంకర్ వెళ్లనున్నారు. బంగ్లాదేశ్ తాత్కాలిక నాయకుడు మహ్మద్ యూనుస్ తన సంతాప సందేశంలో దేశం ఒక గొప్ప రాజనీతిజ్ఞురాలిని కోల్పోయిందన్నారు. బంగ్లాదేశ్ చరిత్రలో ఒక కీలక అధ్యాయానికి ఆమె ప్రాతినిధ్యం వహించారన్నారు. కాగా భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సహా పలు దేశాల నాయకులు సంతాపాలు తెలియజేశారు. ఒక సాధారణ గృహిణిగా జీవితాన్ని గడుపుతూ వచ్చిన ఖలీదాజియా భర్త హత్యానంతరం 36 ఏళ్ళ వయసులో 1983లో రాజకీయాల్లో ప్రవేశించి బిఎన్‌పి పార్టీ నాయకత్వ బాధ్యతలు చేపట్టి ఉవ్వెత్తున ఒక కెరటంలా పైకి లేచారు. అధికారం చేపట్టిన తర్వాత అధ్యక్ష తరహా పాలన నుండి దేశాన్ని బహుళపార్టీల పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థగా తీర్చిదిద్దారు. దేశంలో స్వేచ్ఛా మార్కెట్‌ను వ్యవస్థీకృతం చేశారు. మూడుసార్లు ప్రధానమంత్రి బాధ్యతలు నిర్విహించినప్పటికీ వరుసగా రెండోసారి గెలిచినప్పుడు మాత్రం 12 రోజులు మాత్రమే అధికారంలో ఉన్నారు. ప్రధానమంత్రిగా రెండుసార్లు పూర్తిపదవీ కాలం బాధ్యతలు నిర్వహించిన ఖలీదాజియా దేశంలో తొలుత సైనిక తిరుగుబాటును అణచివేసి ప్రజాస్వామ్య పరిపాలనను పునరుద్ధరించి ప్రజాభిమానం చూరగొన్నారు. బంగ్లాదేశ్‌కు మొట్టమొదటి మహిళా ప్రధానమంత్రిగా, ముస్లిం ప్రపంచంలో బేనజీర్ భుట్టో (పాకిస్థాన్) తర్వాత రెండో ప్రధానమంత్రిగా ఆమె పేరు సాధించారు. 1991ఫిబ్రవరి 27న మొదటిసారి ఎన్నికల్లో విజయం సాధించి ప్రధానమంత్రిగా పదవీ బాధ్యతలు తీసుకుని 1996 వరకూ దేశాన్ని పాలించారు. రెండోసారి 2001లో ప్రధాని పదవి అధిష్ఠించి 2006 వరకూ పదవిలో కొనసాగారు. ప్రస్తుతం ఉరిశిక్షకు గురై, భారత్‌లో అజ్ఞాతవాసం చేస్తున్న పదవీచ్యుతురాలైన ప్రధానమంత్రి షేక్ హసీనాకు రాజకీయ ప్రత్యర్థి. దేశంలో జనరల్ ఎర్షాద్ నియంతృత్వపాలనకు వ్యతిరేకంగా అటు ఖలీదాజియా బిఎన్‌పి, ఇటు షేక్ హసీనాకు చెందిన అవామీలీగ్ పార్టీలు దశాబ్దకాలంపాటు విస్తారమైన ప్రజా, ప్రచార పోరాటం చేశాయి. ఖలీదాజియాకు ఇద్దరు కుమారులు తారిఖ్ రెహ్మాన్, అరాఫత్ రెహ్మాన్. తారిఖ్ రెహ్మాన్ తల్లి రాజకీయ వారసత్వాన్ని స్వీకరించి తండ్రి స్థాపించిన బంగ్లాదేశ్ నేషనలిస్ట్‌పార్టీ బిఎన్‌పి) తాత్కాలిక ఛైర్మన్‌గా, రాబోయే ఎన్నికల్లో ప్రధానమంత్రి పదవికి పోటీ పడుతుండగా, ఆమె రెండో కుమారుడు అక్రమ్ రెహ్మాన్ 45 ఏళ్ళ వయసులో ఆకస్మింగా గుండెపోటుతో 2015లో మరణించారు. ఖలీదాజియా మృతికి భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ సహా పలు దేశాల నాయకులు సంతాపాలు తెలియజేశారు.

## లోయలో పడిన బస్సు

(మొదటి పేజీ తరువాయి)

ముందు లోయలో పడిపోయింది. ప్రమాదం గురించి సమాచారం అందిన వెంటనే పోలీసులు, రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం (ఎస్‌డిఆర్ఎఫ్) బృందాలతో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారని ఆయన చెప్పారు. ఈ ప్రమాదంలో ఆరుగురు అక్కడికక్కడే మరణించగా మరొకరు ఆసుపత్రికి తరలిస్తుండగా గాయాలతో మరణించారని ఆ అధికారి తెలిపారు. ప్రమాదంలో డ్రైవర్‌తో సహా 12 మంది గాయపడ్డారని, వారిని లోయలో నుండి రక్షించామని ఎస్ఎస్‌పి పించా చెప్పారు. గాయపడిన వారిని ఆసుపత్రిలో చేర్చారు. ఈ ప్రమాదంలో ప్రాణనష్టం జరగడంపై ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి సంతాపం వ్యక్తం చేశారు. హిందీలో ఫేస్‌బుక్ పోస్ట్‌లో గాయపడిన వారందరూ త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నానన్నారు. ఈ మొత్తం ఘటనను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని, స్థానిక అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నామని చెప్పారు. జిల్లా యంత్రాంగం గాయపడిన ప్రయాణికులను సమీపంలోని ఆసుపత్రులలో చేర్పించిందని, తీవ్రంగా గాయపడిన వారిని మెరుగైన చికిత్స కోసం ఉన్నత వైద్య కేంద్రాలకు తరలించారని ముఖ్యమంత్రి తన పోస్ట్‌లో పేర్కొన్నారు.

**ప్రధాని దిగ్భ్రాంతి :** ఉత్తరాఖండ్‌లో జరిగిన బస్సు ప్రమాదంలో ప్రాణనష్టం జరగడంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విచారం వ్యక్తం చేశారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రియమైన వారిని కోల్పోయిన వారికి నా ప్రగాఢ సానుభూతిని ప్రకటిస్తూ గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని మోదీ ప్రార్థించారు.

అశ్రునివాళి



కీ॥శే॥ చావా సుగుణమ్మ గారు మరణం: 21-12-2025
స్వాతంత్ర్య సమర యోధురాలు
W/o చావా వెంకటేశ్వరరావు(లేటు)

ఆప్యాయతానురాగాలతో,
మంచితనానికి మారుపేరుగా నిలిచి,
చెరగని చిరునవ్వుతో
నలుగురికి ఆదర్శవంతురాలువై
మా అందరి హృదయాలలో
చిరస్థాయిగా నిలిచావు..
దివికేగిన నీ పవిత్రాత్మకు శాంతి చేకూరాలని
ఆ భగవంతుని ప్రార్థిస్తూ...

కుమారుడు :
చావా వేణు
డిసిసిబి మాజీ డైరెక్టర్
కొక్కిరేణి, తిరుమలాయపాలెం మం॥
ఖమ్మం జిల్లా.

పెద్దకర్మ : 31-12-2025 బుధవారం మా స్వగృహం కొక్కిరేణి గ్రామంలో జరుగును.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com